సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 61

మంగళవారం 23-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'



వాట్సాప్‌లో ఎడిట్ ఫీచర్

పంపిన సందేశాల్లో మార్పులు చేసుకు నేలా వాట్సాప్‌లో నదుపాయం. - 6లో



'ఫైనల్'కు ముందెవరు?

ఐపీఎల్‌లో నేడు గుజరాత్, చెన్నై మధ్య క్వాలిఫయర్–1 మ్యాచ్ జరగనుంది. -12లో



కశ్మీర్లో జి-20 సన్నాహకం షురూ

పాకిస్తాన్ పెడబొబ్బలను, చైనా అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ జమ్మూకశ్మీర్‌లో జి-20 సన్నాహక సదస్సు ప్రారంభమైంది. - వివరాలు 6లో



కెమెరాకు చిక్కిన సూపర్‌నోవా

సువిశాలమైన అంతరిక్షంలో ఒక నక్షత్రం చివరి దశ ఎలా ఉంటుందో చెప్పే సూపర్‌నోవాపై ప్రత్యేక కథనం. - వివరాలు 6లో



త్వరలో విపక్షాల కీలక భేటీ!

బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనే వ్యూహంలో భాగంగా ఒకట్రెండు రోజుల్లో విపక్షాల ఉమ్మడి భేటీకి ముహూర్తాన్ని నిర్ణయించనున్నారు. - వివరాలు 6లో



బీబీసీపై పరువు నష్టం కేసు

'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరుతో డాక్యుమెంటరీ రూపొందించిన బీబీసీపై ఓ సంస్థ ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేసింది. - వివరాలు 6లో

ఎల్లో మీడియా ఓవరాక్షన్

- ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు.. తల్లి అనారోగ్యం దృష్ట్యా సోమవారం విచారణకు రాలేనన్న అవినాశ్
- ఈ నెల 27 తర్వాత వస్తానని సీబీఐకి లేఖ
- కానీ సీబీఐ అధికారులు వచ్చేశారని.. అరెస్టు చేయబోతున్నారని ఉదయం నుంచే ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం
- పోలీసుల సహకారం సీబీఐ కోరిందంటూ ఓసారి.. పోలీసులు సహకరించడం లేదంటూ మరోసారి...కేంద్ర బలగాలు వస్తున్నాయంటూ మరో ప్రచారం
- అవి రాగానే అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ అదేపనిగా చర్చలు
- తప్పుడు ప్రచారాన్ని నిరసించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు.. భారీ ఎత్తున ఆస్పత్రి వద్ద బైఠాయింపు
- శ్రీలక్ష్మి ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉందన్న వైద్యులు

10లో

జేపీఎస్... హ్యాపీస్

క్రమబద్ధీకరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం



సోమవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల లోగో ఆవిష్కరణ

మహావీర్ ఆస్పత్రికే ఉచితంగా 'లీజు' స్థలం

- వివరాలు 5లో

- పనితీరు ప్రామాణికంగా విధివిధానాలు ఖరారు చేయాలని ఆదేశం
- పనితీరు మదింపునకు కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు
- కమిటీలో అదనపు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అటవీ అధికారి
- కలెక్టర్ల ప్రతిపాదనల పరిశీలనకు రాష్ట్ర స్థాయి కమిటీ
- ఆ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్)కు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శుభవార్త చెప్పారు. జేపీఎస్‌ల సర్వీసును పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను ఆదేశించారు. జేపీఎస్‌ల పనితీరును మదింపు చేయడానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని సూచించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా అటవీ అధికారి, జిల్లా ఎస్పీ/డీసీపీ సభ్యులుగా ఉంటారు. దీనికి రాష్ట్రస్థాయిలో ఒక కార్యదర్శి స్థాయి లేదా హెచ్‌ఓడీ స్థాయి అధికారి పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీలు పంపించిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ పరిశీలిస్తుంది. అనంతరం సీఎస్‌కు నివేదికను పంపిస్తుంది. దాని ఆధారంగానే క్రమబద్ధీకరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

తాత్కాలిక జేపీఎస్‌ల స్థానంలో...

రాష్ట్రంలో కొన్ని గ్రామ పంచాయతీల్లో తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్లు నియమించారు. ఈ స్థానాల్లో కొత్త జూనియర్ పంచాయతీ కార్యదర్శుల భర్తీ ప్రక్రియను క్రమబద్ధీకరణ తర్వాతి దశలో ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతికుమారి, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ఉన్నతాధికారులతో ఎర్రబెల్లి, హరీశ్ భేటీ


సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఆర్థిక మంత్రి హరీశ్‌తో కలసి పంచాయతీరాజ్ శాఖ మంత్రి

మిగతా 5వ పేజీలో ▶

ఎకానమీపై ప్రభావం..

చాలా స్వల్పం

రూ. 2,000 నోట్ల రద్దుపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



- కరెన్సీ నిర్వహణలో భాగంగానే ఉపసంహరణ ప్రక్రియ
- చలామణీలో ఉన్న కరెన్సీలో ఈ నోట్ల వాటా 11 శాతమే
- గడువులోగా చాలా నోట్లు తిరిగి వచ్చేస్తాయని భావిస్తున్నాం... ప్రస్తుతం నోట్లు చెల్లుబాటవుతాయి...
- సెప్టెంబర్ 30 తర్వాత తగు నిర్ణయం తీసుకుంటాం...
- ఈ నోట్ల డిపాజిట్లకు ప్రస్తుత కేవైసీ నిబంధనలే వర్తిస్తాయని స్పష్టీకరణ

- వివరాలు 13లో



కూలిన తెలుగు కథా

సాహితీ శిఖరం

రచయిత కేతు విశ్వనాథరెడ్డి కన్నుమూత

- తెలుగు సాహిత్యంలో కురువృద్ధుడు
- రాయలసీమ కథకు చిరునామా
- భార్యకు చికిత్స చేయించేందుకు ఒంగోలుకు రాక
- కుమార్తె ఇంటివద్ద ఉండగా గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- అక్కడ చికిత్స పొందుతూ మృతి
- ఏపీ సీఎం వైఎస్ జగన్ సంతాపం
- నివాళులర్పించిన సాహితీవేత్తలు

- వివరాలు 2లో



విలక్షణ నటుడు

శరత్‌బాబు ఇకలేరు

- కథానాయకుడు, ప్రతినాయకుడు, సహాయ నటుడు... ఇలా ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయిన అందాల నటుడు శరత్‌బాబు ఇకలేరు. కొంతకాలం నుంచి ఊపిరితిత్తులు, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు.

- వివరాలు 12లో



ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్ అవార్డుతో కేటీఆర్

కాళేశ్వరంతో కేసీఆర్

ఒక నదినే ఎత్తిపోశారు

- నాయకుడు తలచుకుంటే సాధించే విజయానికి నిదర్శనం: మంత్రి కేటీఆర్
- కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అద్భుతాలు
- అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సమావేశంలో ప్రారంభోపన్యాసం
- కాళేశ్వరానికి 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్' అవార్డు

10లో



ఫిజీ అత్యున్నత గౌరవంతో మోదీని సత్కరిస్తున్న ఆ దేశ ప్రధాని రుబుకా

భారత్ విశ్వసనీయ భాగస్వామి

ఎఫ్‌ఐపీఐసీ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ - 6లో



111 జీవో రద్దు

పెద్ద కుట్ర

- కేసీఆర్ అండ్ కో స్వలాభం కోసమే ఆ జీవో ఎత్తివేత
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- నేటి నుంచి యథావిధిగా యాత్ర
- జడ్చర్ల సభకు హిమాచల్ సీఎంతో పాటు ఠాక్రే రాక

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎం కేసీఆర్ అండ్ కో స్వలాభం కోసమే 111 జీఓ ఎత్తి వేశారని.. ఈ జీఓ రద్దు ఓ పెద్ద కుట్ర అని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. ఈ జీఓ ఎత్తివేతకు ముందు కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు, మరికొందరు బీఆర్‌ఎస్ నేతలు

మిగతా 2వ పేజీలో ▶



ఆ జీవో రద్దు

అణుబాంబు లాంటిది

- హైదరాబాద్ వరదల్లో మునిగిపోతుంది: పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- 111 జీవో రద్దు వెనుక అతి భారీ కుంభకోణం
- పార్టీ తరపున నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తాం

సాక్షి, హైదరాబాద్: జీవో 111 రద్దు హైదరాబాద్‌లో అణుబాంబు పేలడం వంటిదని.. విచ్చలవిడి నిర్మాణాల కారణంగా హైదరాబాద్ నగరం వరదల్లో మునిగి, వేల మంది చనిపోయే పరిస్థితి దాపురిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ జీవో రద్దు వెనుక ప్రపంచ చరిత్రలో కనీవినీ

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

4న 'సీపీఐ ప్రజా గర్జన'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అజీజ్ పాషా, కూనంనేని, చాడ తదితరులు

సాక్షి, హైదరాబాద్: జూన్ 4వ తేదీన కొత్తగూడెం పట్టణంలో 'సీపీఐ ప్రజా గర్జన' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. లక్ష మందితో జరిగే ఈ బహిరంగసభకు పార్టీ జాతీయ ప్రధాన కార్య దర్శి డి.రాజా ముఖ్య అతిథిగా హాజరవుతా రని చెప్పారు.సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 'బీజేపీ కో హటావో.. దేశ్ కో బచావో' కార్యక్రమం జరిగిందన్నారు.తెలంగాణలో 134 బహిరంగ సభలు, పది లక్షల మంది ప్రజలు, 5 లక్షల మంది పార్టీ కార్య కర్తలు, సానుభూతిపరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికి ప్రచారోద్యమం నిర్వ హించారన్నారు. ఈ కార్యక్రమానికి ముగింపుగా 'సీపీఐ ప్రజా గర్జన' నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనను, ప్రజల సమస్యలను బహిరంగసభ ద్వారా లేవనెత్తుతామని కూనంనేని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, హైదరాబాద్‌లో జర్నలిస్టు సొసైటికీ కేటాయించిన భూమిని అప్పగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సర్కారు మారితేనే 'పాలమూరు' పూర్తి

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం మహాధర్నాలో వైఎస్ షర్మిల



షాద్‌నగర్: కేసీఆర్ సర్కార్ మారితేనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తవుతుందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం సోమవారం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే పాలమూరు ప్రాజెక్టుకు బీజం పడిందన్నారు. రీడిజైన్‌లో భాగంగా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును చివరిగా నిర్మించాలని కేసీఆర్ డిజైన్ చేశారని విమర్శించారు. రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్.. తొమ్మిదేళ్లు ముగిసినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు కేటాయించిన రూ.32వేల కోట్లలో రూ.22 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు కూడా నీరందించలేదన్నారు. అనుమతులు లేని ప్రాజెక్టుకు ఇన్ని వేల కోట్లు ఎందుకు ఖర్చు చేశారని నిలదీశారు. కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కాస్తా కమీషన్ల చంద్రశేఖర్‌రావు అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. వ్యాపారం కోసం సీఎం కేసీఆర్ ప్రాజెక్టులకు రీ డిజైన్ చేస్తున్నారని మండిపడ్డారు.


కులానికో న్యాయమా..?

ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో కులానికొక న్యాయం ఉండే చిత్రమైన పరిస్థితి నెలకొన్నదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. తాను సర్వీసులో ఉన్నప్పుడు చాలా మంది బహుజన వర్గాలకు చెందిన ఉద్యోగులు ఏసీబీ దాడులకు గురై, జైలుకు వెళ్లి సహాయం కోసం తన వద్దకు వచ్చేవారని సోమవారం ట్వీట్ చేశారు. 'గత నెలలో మియాపూర్ పీఎస్‌లో జరిగిన ఏసీబీ దాడిలో లంచం తీసుకుంటూ దొరికిన హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డిని జైలుకు పంపారు. కానీ లంచం తీసుకు రమ్మని పురమాయించిన ఎస్‌ఐ యాదగిరి రావును జైలుకు పంపడానికి ఏసీబీ వాళ్లకు దమ్ము సరిపోలే. దీని వెనక సీఎం కార్యాలయం ఉందన్న సంగతి వేరే చెప్పనక్క ర్లేదు' అని ఆరోపించారు. పేద వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి మాట్లాడే సాహసం చేయరన్నారు. అక్రమ దందాలతో కోట్లు సంపాదించుకున్న అగ్రవర్ణ అధికారుల వివరాలు తన వద్ద ఉన్నాయని, సరైన సమయంలో వాటిని బయట పెడతానని చెప్పారు.

ఇదం జగత్




కూలిన తెలుగు కథా సాహితీ శిఖరం

రచయిత కేతు విశ్వనాథరెడ్డి కన్నుమూత.. తెలుగు సాహిత్యంలో కురువృద్ధుడు

అభ్యుదయ కథకు అసలైన చిరునామా.. సీమ సాహిత్య చరిత్రకు వీలునామా

నిన్నటి.. నేటి కథకు బలమైన సేతువు.. తెలుగు కథా కేతనం.. కడప కథా శాసనం

కరుణ లేని కాలం ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కలానికి శాశ్వత విశ్రాంతినిచ్చింది. సుదీర్ఘ కాలం తెలుగునాట రెపరెపలాడిన కథా కేతనం ఒరిగిపోయింది. తెలుగు కథ కంటతడి పెట్టుకుంది. తనకిప్పుడు పెద్దదిక్కు ఎవరంటూ బావురుమంది.



పుస్తక పఠనంలో కేతు విశ్వనాథరెడ్డి (ఫైల్)

సాక్షి, అమరావతి/ఒంగోలు టౌన్/కడప (కల్చరల్): సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (84) ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం గుండెపోటుతో మరణించారు. కడపలో నివాసం ఉంటున్న ఆయన సతీమణి పద్మావతికి ఆరోగ్యం బాగుండకపోవడంతో చికిత్స నిమిత్తం రెండు రోజుల క్రితం ఒంగోలులోని బీకే అపార్టుమెంట్స్‌లో ఉంటున్న పెద్ద కూతురు మాధవీలత వద్దకు వచ్చారు. భార్య పద్మావతిని ఆదివారం సంఘమిత్ర ఆస్పత్రిలో చేర్చారు. రాత్రి 8 గంటలకు భోజనం చేసిన ఆయన అల్లుడు రమేష్‌రెడ్డి, కుమార్తె మాధవితో మాట్లాడి నిద్రపోయారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అల్లుడు రమేష్‌రెడ్డిని నిద్రలేపి తనకు గుండెల్లో నొప్పిగా ఉందని, ఊపిరాడటం లేదని చెప్పారు. వెంటనే ఆయన్ను సంఘమిత్ర ఆస్పత్రికి తీసుకెళ్లి ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆయన తుదిశ్వాస విడిచారు. విశ్వనాథరెడ్డికి భార్య పద్మావతి, ముగ్గురు సంతానం ఉన్నారు. మాధవీలత పెద్ద కూతురు కాగా.. కుమారుడు శశాంక్, కూతురు శిరీష అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ఆయన మృతదేహాన్ని మంగళవారం ఒంగోలు నుంచి కడప తరలిస్తారు. అక్కడి నుంచి స్వగ్రామమైన వైఎస్సార్ జిల్లా రంగసాయిపురంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన కుమార్తె మాధవీలత తెలిపారు.

కేతు.. కథా సేతు

కేతు విశ్వనాథరెడ్డి వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం రంగసాయిపురంలో 1939 జూలై 10న జన్మించారు. ఎర్రగుంట్ల, కడప తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. కడప, శ్రీకాళహస్తి, కందుకూరు ప్రభుత్వ కళాశాలలు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో సేవలందించారు. పత్రికా రచయితగా, పాత్రికేయ పాఠశాల అధ్యాపకుడిగా పత్రికా రంగానికి సేవలందించారు. అధ్యాపకునిగా తెలుగు పాఠ్య ప్రణాళిక, పాఠ్యాంశాల రూపకల్పన చేశారు. ఉత్తమ కథా, నవలా రచయితగా, మన భూమి, ఈ భూమి పత్రికల సంపాదకులుగానే కాకుండా వివిధ రంగాల్లో రాణించారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన నాటి కుల వ్యవస్థను, ఆర్థిక అసమానతలను సమీపం నుంచి చూశారు. స్నేహితులు, సహచరుల ప్రభావంతో మార్క్సిస్టు దృక్పథాన్ని అలవర్చుకున్నారు. దృష్టి కోణం మారడంతో ఈ పరిస్థితుల మూలాన్ని వెతకడం ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని కరువు, దాని ఫలితంగా ఏర్పడిన ఫ్యాక్షన్, ఆర్థిక అసమానతలు ఆయనను స్పందింపజేశాయి. రాయలసీమ స్థితిగతులు, జీవన విధానం, భౌతిక స్థితి, పారిశ్రామికీకరణ, రాజకీయాలు, అస్తిత్వ పోరాటాలు ఆయనను కలం పట్టేలా చేశాయి.

బాల్యం నుంచే..

కేతు విశ్వనాథరెడ్డి బాల్యం నుంచే మంచి చదువరి. విద్యార్థిగా ఉన్నప్పుడే సహచరులు ఆయనకు ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించే అలవాటు చేశారు. ఆ ప్రేరణతో కలం పట్టిన ఆయనకు కొడవటిగంటి కుటుంబరావు అంటే ఎంతో ఇష్టం. నల్లపాటి రామప్పనాయుడు, వజీర్ రెహ్మాన్, ఆచంట జానకిరాం, శారదాదేవి, గొల్లపూడి మారుతిరావు ప్రోత్సాహం లభించింది. చిత్తూరు జిల్లా రచయితలు మధురాంతకం రాజారాం, సభా తదితరుల పరిచయాలు ఆయన సాహిత్య ఒరవడికి మరింత ప్రోత్సాహం కల్పించాయి. అప్పటినుంచి ఆయన వ్యాసాలు, కథలు రాశారు. రాచమల్లు రామచంద్రారెడ్డి ఆయనలోని ప్రతిభను గమనించి తన సవ్యసాచి పత్రిక ద్వారా ప్రోత్సహించారు. విమర్శతో ఆయన సాహిత్యానికి మెరుగులు దిద్దారు. బాల్య మిత్రుడు సొదుం జయరాంతో కలిసి కథా రచనపై చర్చలు చేసేవారు. 'కడప జిల్లా గ్రామ నామాలు' అనే అంశంపై పరిశోధనలు చేసిన ఆయన ఆ పేర్ల వెనుకగల ఎన్నో ఆసక్తికరమైన కథనాలను సమాజానికి తెలిపారు.

తెలుగు కథకు మట్టి పరిమళాలు అద్ది..

'అనాది వాళ్లు' పేరిట తొలి కథ రాసిన విశ్వనాథరెడ్డి కథా రచనలో తనదైన ముద్ర వేశారు. తెలుగు కథకు మట్టి పరిమళాలు అద్దారు. కేతు విశ్వనాథరెడ్డి కథలు, జప్తు, ఇచ్ఛాగ్ని కథా సంకలనాలు ప్రచురించారు. ఇందులో ఆయన కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. కొడవటిగంటి కుటుంబరావు కథలను సంపుటంగా తన సంపాదకత్వంలో ప్రచురించారు. దృష్టి, దీపధారులు, పరిచయం, సంగమం, పాత్రికేయం, మన కొడవటిగంటితోపాటు తెలుగు, ఆంగ్లంలో వ్యాస సంకలనాలు, వేర్లు, బోధి తదితర నవలలు రాశారు. తన రచనల్లో సగటు మనిషి ఆవేదన, ఆర్తి, సామాజిక చింతన కలగలిపి ఉండడం ఆయన ప్రత్యేకత. ఆయన రచనలు హిందీ, మలయాళం, కన్నడంతో పాటు ఇంగ్లిష్, రష్యన్ భాషల్లో కూడా అనువాదం అయ్యాయి. ఆయన కృషికి గుర్తింపుగా భారతీయ భాషా పరిషత్తు అవార్డులు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, రావిశాస్త్రి అవార్డు సహా ప్రతిష్టాత్మక అవార్డులు, వేలాది సత్కారాలు పొందారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ తదితరులు విశ్వనాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేతు విశ్వనాథరెడ్డి మరణంతో ఒక సాహితీశిఖరం కూలిపోయినట్లయిందని, ఆయన మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి ఇక లేరంటే నమ్మశక్యంగా లేదని, ఆయన కుటుంబానికి పార్టీ తరఫున ప్రగాఢ సంతాపం తెలుపుతున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు.

ఏపీ సీఎం వైఎస్ జగన్ సంతాపం

ప్రముఖ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి హఠాన్మరణం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆధునిక తెలుగు సాహితీ రంగానికి విశ్వనాథరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. సామాజిక సంస్కరణల ఆవశ్యకతను చెబుతూ విశ్వనాథరెడ్డి రాసిన కథలు పలువురికి స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆయన సేవలను గుర్తించి 2021లో వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించిన విషయాన్ని సీఎం జగన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కేతు విశ్వనాథరెడ్డి మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ రంగానికి విశ్వనాథరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలియచేశారు.

కోవర్టులు లేరు.. టికెట్లు రావు..

- టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో నేతల స్పష్టత
- పార్టీలో కోవర్టులు లేరన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ పరిచయాలున్నంత మాత్రాన టికెట్లు రావన్న రాష్ట్ర ఇన్‌చార్జి ఠాక్రే



సమావేశంలో ఠాక్రే, రేవంత్, మధుయాష్కీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో కోవర్టులు ఎవరూ లేరని, ఢిల్లీలో పరిచయాలు ఉన్నంత మాత్రాన ఎన్నికల్లో టికెట్లు రావని టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం తేల్చేసింది. రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలంటూనే.. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టం చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం లక్ష్యంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది.

విభేదాల్లేవు.. కోవర్టులు లేరు: రేవంత్

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు లేరని, పార్టీ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నేతలందరం కలిసికట్టుగా ముందుకెళతామన్నారు. దేశాన్ని విభజించి అధికారాన్ని పదిలం చేసుకోవాలనే బీజేపీ ప్రయత్నాలను, అవినీతి సొమ్ముతో మళ్లీ అధికారం దక్కించుకోవాలని భావిస్తోన్న కేసీఆర్‌కు బుద్ధి వచ్చేలా.. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నేతలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా నిలబడితే తెలంగాణలోనూ కర్ణాటక తరహా తీర్పు వస్తుందన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, రాష్ట్రం ఇచ్చేందుకు కాంగ్రెస్, సోనియాగాంధీ చేసిన కృషిని ప్రజలకు వివరించాలని సూచించారు.

హెచ్చరికలతో రారెత్తించిన ఠాక్రే

పార్టీకి నష్టం చేసే పనులు ఎవరు చేసినా చర్యలు తీసుకుంటామని, పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే స్పష్టం చేశారు. కర్ణాటకలో కష్టపడి గెలిచినట్టుగానే తెలంగాణలోనూ గెలవాలని చెప్పారు. సీఎం కేసీఆర్ బీజేపీతో స్నేహంగా ఉంటున్నారని, బీఆర్ఎస్–బీజేపీల మధ్య స్నేహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ పదవులు తీసుకుని పని చేయని వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల అధ్యక్షులను నియమించలేని పక్షంలో జిల్లా అధ్యక్షులెవరూ రాజీనామా చేయాల్సిన పనిలేదని, తామే వారిని పదవుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇన్ని రోజులు అందరి మాటలు తాను విన్నానని, ఇప్పటి నుంచి తన మాట వినాలని చెప్పారు. బాధ్యతలను విస్మరిస్తే సహించేది లేదని, ఢిల్లీలో పరిచయాలు ఉన్నంత మాత్రాన టికెట్లు వస్తాయనుకోవడం పొరపాటని.. కష్టపడ్డ వారికి, సర్వేల ఆధారంగా మాత్రమే వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామని ఠాక్రే స్పష్టం చేశారు. కాగా.. పార్టీలో కోవర్టులున్నారని గతంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు కొందరికి బాధ కలిగించాయని, ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి కోవర్టులు లేరని చెప్పడం సంతోషకరమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. కార్యవర్గ సమావేశం అనంతరం డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

బీఆర్‌ఎస్‌కు కౌంటర్‌గా 'దశాబ్ది దగా'

తెలంగాణకు బీఆర్‌ఎస్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తూ 'దశాబ్ది దగా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. 30 శాతం కమీషన్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని.. ముందస్తు ప్రచారం, సమష్టి కృషితో ముందుకెళ్లి ఎన్నికలను ఎదుర్కోవాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు వి.హనుమంతరావు, కోదండరెడ్డి, షబ్బీర్‌అలీ, పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, సంపత్‌కుమార్, రోహిత్‌చౌదరి, నదీమ్‌జావేద్, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు.

ఇది.. సారు- కారు-60% సర్కారు

- దళితబంధులో 30% ఎమ్మెల్యేలకు, మరో 30% సీఎం కుటుంబానికి ..
- కాళేశ్వరం, మిషన్ భగీరథ, రియల్ దందాల్లో 60% కమీషన్లు
- జీఓ 111 రద్దు, కోకాపేట భూములపై కోర్టుకెళ్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో బండి



మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: 'దళితబంధులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్లు తీసుకుంటే.. మరో 30 శాతం కమీషన్ సీఎం కుటుంబానికి పోతోంది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయ నిర్మాణంతోపాటు భూ దందాల్లోనూ 60 శాతం కమీషన్లు వెళ్తున్నాయి. ఇది అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ కాదు. సారు–కారు–60 పర్సంట్ భ్రష్టాచార్ సర్కార్' అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ 60 పర్సంట్ సర్కార్‌ను సాగనంపేదాకా తాము పోరాడతామని చెప్పారు. సోమవారమిక్కడ జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో సంజయ్ మాట్లాడారు. '111 జీవో రద్దు అనేది మహా కుట్ర, బీఆర్‌ఎస్ కార్యాలయానికి కోకాపేట భూముల కేటాయింపు వెనుక కూడా కుట్ర ఉంది. వీటిపై న్యాయ పోరాటం చేస్తాం' అని ప్రకటించారు. 'రాష్ట్ర ప్రజలకు ప్రధాన విలన్ కేసీఆరే. కాంగ్రెస్ సైడ్ విలన్ పాత్ర పోషిస్తోంది. బీఆర్‌ఎస్–కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టు పార్టీల చీకటి ఒప్పందాలను బయటపెడతామని పేర్కొన్నారు. ఈ భేటీలో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎమ్మెల్సీ కేవీఎన్ రెడ్డి, మురళీధర్ రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నల్లు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌రెడ్డి, ఈటల, వివేక్ పాల్గొన్నారు.

జూన్ 30 దాకా 'మహాజన సంపర్క్ అభియాన్'

కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, తెలంగాణకు చేకూర్చిన ప్రయోజనాలను ఇంటింటికీ తెలియజేసేలా ఈనెల 30 నుంచి జూన్ 30 దాకా 'మహాజన సంపర్క్ అభియాన్' నిర్వహిస్తామని బండి సంజయ్ చెప్పారు. 'ఒకనాడు ప్రధాని మోదీని విశ్వగురుగా, నిజాయితీపరుడిగా కీర్తించిన కేసీఆరే ఇప్పుడు ఆయనను అవినీతిపరుడు, రాక్షసుడంటూ తిడుతున్నారు. ఇలాంటి విశ్వాస ఘాతకుడిని నా రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదు' అని సంజయ్ మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ఏం సాధించారని వందలకోట్లు ఖర్చుతో దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని నిలదీశారు. కాగా, బండి, బన్సల్ సమక్షంలో బీఆర్‌ఎస్ నేతలు గోవింద్ రాఠీ, మనోజ్, మాజీ మంత్రి శంకర్ రావు కుమార్తె సుస్మిత బీజేపీలో చేరారు.

పనిచేసేవారికే టికెట్లు: సునీల్‌బన్సల్

'ఫ్లెక్సీలు పెట్టి, సొంత ఫొటోలతో వ్యక్తిగత ప్రచారం చేసుకునే వాళ్లు లీడర్లు కారు, ప్రజల్లోకి వెళ్లి పనిచేసే వారే నాయకులు. పార్టీ, ప్రజల కోసం పనిచేసే వారికే టికెట్లు ఇస్తాం. పార్టీ క్రమశిక్షణను అందరూ విధిగా పాటించాలి. గీత దాటితే కఠినచర్యలు తప్పవు' అని జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ చెప్పారు. 'బీజేపీ ముఖ్యనేతలు పార్టీ మారుతున్నట్టు, వారిలో ఈటల, వివేక్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వంటి నేతలున్నారంటూ కొందరు చేస్తున్న ప్రచారాన్ని విశ్వసించకండి. మన ప్రత్యర్థులు రేవంత్‌రెడ్డి వర్గానికి చెందిన వారు చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు' అని పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధానకార్యదర్శి శివప్రకాశ్ పేర్కొన్నట్టు సమాచారం.

బీఆర్‌ఎస్‌తో భేటీ అసెంబ్లీ ఎన్నికల తర్వాతే!

- కాంగ్రెస్ ఒత్తిళ్లతో కేసీఆర్‌తో భేటీపై నితీశ్‌కుమార్ వెనకడుగు
- బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు వివిధ పార్టీల నేతలను కలుస్తున్న బిహార్ సీఎం
- ఈ క్రమంలో కేసీఆర్‌తోనూ సమావేశానికి ప్రణాళిక
- కానీ తెలంగాణలో పరస్పర పోరు నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యంతరం
- అసెంబ్లీ ఎన్నికల దాకా ఆగాలని నితీశ్‌కు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని దీటుగా ఎదుర్కొనేలా విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నంలో ఉన్న బిహార్ సీఎం నితీశ్‌కుమార్.. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌తో భేటీకావడంపై సందిగ్ధం నెలకొంది. కర్ణాటక ఎన్నికల ఫలితాలకు ముందే కేసీఆర్‌తో నితీశ్ భేటీ ఉంటుందని జేడీయూ నేతలు ప్రకటించినా ఇంతవరకు జరగలేదు. కాంగ్రెస్ పార్టీ ఒత్తిడితోనే కేసీఆర్‌తో భేటీకి నితీశ్ వెనక్కి తగ్గారని ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వరుసగా కీలక నేతలతో భేటీలు



బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రధాన పార్టీల అధినేతలను నితీశ్‌కుమార్ కలుస్తున్నారు. కర్ణాటక ఎన్నికల ముందు ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌లతో సమావేశమై చర్చలు జరిపారు. ఎన్నికల అనంతరం ఈ ప్రక్రియకు మరింత పదునుపెట్టారు. శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం నేతలతోపాటు జేఎంఎం నేత, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌లతో సమావేశమయ్యారు. అరవింద్ కేజ్రీవాల్‌తో మరోమారు భేటీ అయ్యారు. తాజాగా సోమవారం ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో నితీశ్ సమావేశమయ్యారు. ఈ భేటీల సందర్భంగా విపక్ష పార్టీల ఐక్యత, బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలు, పొత్తులు, ఉమ్మడి కార్యాచరణ తదితర అంశాలపై చర్చిస్తున్నారు. అయితే అన్ని ప్రాంతీయ పార్టీలను కలుపుకొన్నట్టుగానే బీఆర్‌ఎస్‌ను కూడా కలుపుకొని పోవాలని నితీశ్ భావిస్తున్నా.. కాంగ్రెస్ పెద్దలు దీనికి సానుకూలంగా లేరని సమాచారం.

ఎన్నికల తర్వాత ఆలోచిద్దాం!

బీఆర్‌ఎస్‌ను కలుపుకొనిపోయే విషయంలో రాహుల్ గాంధీ అంత సుముఖంగా లేరని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణ ఇచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్)ను విలీనం చేస్తామని మాట ఇచ్చి తప్పారని.. అలాంటి బీఆర్‌ఎస్‌ను రాష్ట్రంలో అధికారంలోంచి దింపేందుకు కాంగ్రెస్ శ్రేణులు బలంగా పనిచేస్తున్నాయని నితీశ్‌కు రాహుల్ స్పష్టం చేశారని అంటున్నాయి. తెలంగాణలో బీఆర్‌ఎస్ బలహీనమవుతూ, కాంగ్రెస్ బలపడుతున్న దృష్ట్యా.. ఆ పార్టీని కలుపుకొంటే తమకు నష్టం వస్తుందని రాహుల్ పేర్కొన్నట్టు వివరిస్తున్నాయి. రాహుల్ వ్యాఖ్యలకు సంకేతం అన్నట్టుగానే కర్ణాటక సీఎం ప్రమాణస్వీకార కార్యక్రమానికి 17 విపక్షాలను పిలిచినా బీఆర్‌ఎస్‌ను ఆహ్వానించలేదని సమాచారం. ఒకవేళ బీఆర్‌ఎస్‌ను కలుపుకోవాలని అన్ని పార్టీలు కోరితే.. ఈ ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక, లోక్‌సభ ఎన్నికలకు ముందుగానీ, ఎన్నికల తర్వాతగానీ ఆలోచిద్దామని ఏఐసీసీ పెద్దలు నితీశ్‌కు తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌తో భేటీపై నితీశ్ ఊగిసలాడుతున్నారని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంటున్నాయి. వారం, పది రోజుల్లో బిహార్‌లోని పట్నాలో విపక్షాల ఉమ్మడి భేటీ నిర్వహించాలని నితీశ్ యోచిస్తున్నారు. దీనికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను పిలిచే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

111 జీవో రద్దు పెద్ద కుట్ర..

▶ మొదటి పేజీ తరువాయి

ప్లాన్ ప్రకారం భూములు కొనుగోలు చేశారని.. ఆ తర్వాత తాజాగా ఈ జీఓ ఎత్తివేశారని నిందించారు. దీంతో కేసీఆర్ కుటుంబానికి ఎక్కువ లాభం ఉంటుందని ఆయన ఆరోపించారు. వడదెబ్బతో పీపుల్స్ మార్చ్ యాత్రకు విరామం ప్రకటించి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం రుక్కంపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పరిధిలో బీఆర్‌ఎస్ నేతలకే ఐదు వేల ఎకరాలు ఉన్నాయని.. బినామీలు, రియల్ ఎస్టేట్ వాళ్ల కోసమే జీఓ ఎత్తివేశారని మండిపడ్డారు.

దశాబ్ది ఉత్సవాల పేరిట నిధుల దుర్వినియోగం

దశాబ్ది ఉత్సవాల పేరిట కేసీఆర్ రూ.200 కోట్ల దుర్వినియోగానికి తెరలేపారని భట్టి విమర్శించారు. కేసీఆర్ పాలనలో సామాజిక న్యాయం లేదని.. 2014 ముందు నీళ్లు, నిధులు, నియామకాల పరిస్థితి ఎట్లా ఉందో ఇప్పుడూ అట్లాగే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. ఆ వెంటనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తో పాటు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

జడ్చర్ల సభకు హిమాచల్ సీఎం, ఠాక్రే..

పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఈ నెల 25న జడ్చర్ల పట్టణంలో నిర్వహించనున్న భారీ బహిరంగసభకు ముఖ్య అతిథిగా హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌వేందర్ సింగ్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్ రావు ఠాక్రే హాజరుకానున్నట్లు భట్టి వెల్లడించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో వెలుగులోకి వచ్చిన ప్రజా సమస్యలను ఎలా పరిష్కరి స్తామో జడ్చర్ల వేదికగా నేతలందరూ సమష్టిగా వివరించి ప్రజలకు భరోసా కల్పిస్తారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కృష్ణా, గోదావరి నదులపై నిర్మిస్తున్న పెండింగ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తప్పనిసరిగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, మంగళవారం నుంచి పాదయాత్ర షెడ్యూల్ ప్రకారం నవాబు పేట మండలంలో యథావిధిగా కొనసాగనున్నట్లు భట్టి వెల్లడించారు.

జీవో 111 రద్దు అణుబాంబు లాంటిది

▶ మొదటి పేజీ తరువాయి

ఎరుగని భారీ కుంభకోణం దాగి ఉందని, ఈ కుంభకోణం విలువను లెక్కించడానికి ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు వి.హనుమంతరావు, కోదండరెడ్డి, గడ్డం వినోద్, అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులతో కలిసి రేవంత్ మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లతోపాటు ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, అర్వింద్‌కుమార్‌లు దుష్ట చతుష్టయంలా తయారయ్యారని.. జీవో 111 రద్దుతో హైదరాబాద్‌ను అణుబాంబుతో ధ్వంసమైన నాగసాకి నగరంలా తయారుచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సీఎం అయ్యాకే హైదరాబాద్ విధ్వంసం మొదలైందని.. బ్రిటిష్, నిజాం, సమైక్య పాలకుల కన్నా ప్రమాదకరంగా తయారయ్యారని ఆరోపించారు.

అక్కడ భూములన్నీ బినామీల పేరిటే..

111 జీవో పరిధిలోనికి వచ్చే గ్రామాల్లోనే కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, దామోదర్‌రావు, రంజిత్‌రెడ్డి వంటి బీఆర్‌ఎస్ నేతల ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని.. 2019 తర్వాత ఇక్కడి భూములను బీఆర్‌ఎస్ నేతలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ ప్రాంతంలో 80శాతం భూమి కేసీఆర్ బంధుగణం, బినామీల చేతుల్లోకి వెళ్లిందని, ఆ తతంగమంతా ముగిశాకే జీవోను రద్దు చేశారని ఆరోపించారు. 111 జీవో రద్దు వ్యవహారంపై కాంగ్రెస్ తరఫున నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీ ఆ గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, పర్యావరణవేత్తలతో చర్చించి సమగ్ర నివేదిక ఇస్తుందని, ఆ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే జీవో 111 రద్దుపై విచారణ జరిపిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెప్తున్నారని.. బీజేపీ నేతలు ఇలా రంకెలు వేయడం మానేసి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని సవాల్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌కు చెందిన ఎంపీ అని, 111 జీవో రద్దు గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత ఆయనకు లేదా అని నిలదీశారు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వండి

కోకాపేటలో బీఆర్‌ఎస్‌కు 11 ఎకరాల స్థలాన్ని కేటాయించడంపై రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే బంజారాహిల్స్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 100 ఎకరాలకుపైగా బీఆర్‌ఎస్ కార్యాలయాల కోసం తీసుకున్నారని.. ఇంకా భూదాహం తీరలేదా? అని ప్రశ్నించారు. రూ.600 కోట్ల విలువైన భూమిని రూ.37 కోట్లకే తీసుకోవడం దారుణమన్నారు. దేశాన్ని ఇన్నేళ్లు పరిపాలించిన కాంగ్రెస్‌కు రాష్ట్రంలో సొంత కార్యాలయం లేదని.. వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్‌కు కేటాయించిన స్థలాన్ని ప్రభుత్వం తిరిగి తీసుకుందని గుర్తు చేశారు. తాము కట్టిన డబ్బులు ప్రభుత్వం వద్దనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా వేరే స్థలం ఇవ్వాలన్న కనీస రాజకీయ జ్ఞానం కేసీఆర్‌కు లేదన్నారు. వెంటనే పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలన్నారు. గతంలో తమకు కేటాయించిన భీంరావ్‌బాడ స్థలాన్ని పేదలకు పంచితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు..

సీఎం కేసీఆర్ సమక్షంలో చేరికలు

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితిలోకి మహారాష్ట్రలోని వివిధ పార్టీల నేతల చేరికలు సోమవారం కూడా కొనసాగాయి. పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, పర్బణీ, లాతూర్ జిల్లాలకు చెందిన బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, పలువురు ప్రముఖులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన నేతలకు సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో పర్బణీ మాజీ జెడ్పీ చైర్మన్ మహేశ్ మాధవ్ రావు ఫాడ్, మాజీ ఎమ్మెల్యే మోహన్ ఫాడ్, కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవటి మున్సిపల్ చైర్మన్ అంకోశ్ గొటవలే, బీఎస్పీ రాజురా నియోజకవర్గ నేత భానుదాస్ జాదవ్, సంతోష్ గోట్వాలే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జీవటి తాలూకా ప్రెసిడెంట్ ఆశిష్ నంవాడ్, కేకేజారి సర్పంచ్ మారుతీ మోరే, ముంబైలోని బీజేపీ కాంఘర్ యూనియన్ కు చెందిన దిలీప్ రక్, లాతూర్ అడ్వొకేట్‌లు అఖిల్ దేశ్‌ముఖ్, బాలాజీ ధైర్యతో సహా పలువురు ప్రముఖులు, నాయకులున్నారు. ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'రెండో విడత' గొర్రె.. పంపిణీకి కొర్రీ

మంజూరు చేసిన రుణాన్ని ఇచ్చేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ మీనమేషాలు

- ఏవేవో కారణాలు చెప్తూ రూ.4,565 కోట్ల విడుదలను అడ్డుకుంటున్న బోర్డు మెంబర్లు
- తొలి విడత తీసుకున్న రుణ వాయిదాలను ఠంచన్‌గా చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రెండో విడత కోసం పలుమార్లు ఢిల్లీ వెళ్లొచ్చిన రాష్ట్ర ఉన్నతాధికారులు
- అయినా ఆడిట్ పేరుతో అభ్యంతరాలు.. కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుంటోందనే ఆరోపణలు
- సహకార అభివృద్ధి శాఖ అమిత్‌షా పరిధిలో ఉండటంతో చర్చ
- 10 రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించాలని తాజాగా కేబినెట్ నిర్ణయం
- దీనికి రాష్ట్ర ఖజానా నుంచే నిధులు సర్దుబాటు చేసేందుకు ఆర్థిక శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం రెండో విడతకు నిధుల అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పథకం కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) రూ.4,565 కోట్ల రుణాన్ని మంజూరు చేసినా.. నిధులను విడుదల చేయకుండా కొర్రీలు పెడుతుండటంపై చర్చ జరుగుతోంది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిధులు విడుదల కాకుండా ఆటంకాలు కల్పిస్తోందనే ఆరోపణలు అటు ప్రభుత్వ వర్గాల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. తొలి విడత కోసం తీసుకున్న రుణ వాయిదాలను సకాలంలో చెల్లిస్తున్నా.. రెండో విడత నిధుల విడుదలలో జాప్యం చేస్తుండటం సందేహాలకు తావిస్తోందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్‌సీడీసీ బోర్డు సమావేశాలకు రాష్ట్ర అధికారులు హాజరై పథకం అమలు ఆవశ్యకతను, మొదటి విడత తీసుకున్న రుణం కింద తిరిగి చెల్లించిన మొత్తానికి సంబంధించిన వివరాలను, రెండో విడత కింద ఇచ్చే రుణాన్ని తిరిగి చెల్లించేందుకు గల అవకాశాలను స్పష్టంగా వివరించినా.. కుంటిసాకులు చెప్తూ ఆపుతుండటం వెనుక రాజకీయ కారణాలే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది.



సరేనంటూనే.. అభ్యంతరాలు

వాస్తవానికి రెండో విడత గొర్రెల పంపిణీకి అవసరమైన నిధులను ఇచ్చేందుకు ఎన్‌సీడీసీ గత ఏడాది అక్టోబర్‌లోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధులను గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ పేరిట విడుదల చేయాల్సిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తు అవసరమైంది. ఈ పూచీకత్తు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత జాప్యం చేయగా.. కథ అడ్డం తిరిగింది. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలను కూడా ప్రభుత్వ అప్పుల కింద పరిగణిస్తామని, ఎఫ్ఆర్‌బీఎం చట్టం పరిధిలో లెక్కగడతామని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించిన నేపథ్యంలో.. గత ఏడాది పలు ఆర్థిక సమీకరణాల కారణంగా ప్రభుత్వం పూచీకత్తు ఇవ్వలేకపోయింది. ఇప్పుడు కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో.. రెండో విడత కింద గొర్రెల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమై అధికారికంగా పూచీకత్తు ఇస్తూ ఎన్‌సీడీసీకి ప్రతిపాదనలు పంపింది. కానీ ఈసారి ఆడిట్ రిపోర్టు రూపంలో అడ్డంకి ఎదురైంది. తొలి విడత గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయని ఆడిట్ రిపోర్టులో పేర్కొనడంతో ఎన్‌సీడీసీ రుణం విడుదలపై పునరాలోచనలో పడింది. ఎన్‌సీడీసీ కేంద్ర మంత్రి అమిత్‌షా పరిధిలోని సహకార శాఖ పరిధిలోకి వస్తుందని.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ నడుమ రాజకీయ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఎన్‌సీడీసీ బోర్డు సభ్యులు నిధుల విడుదలకు విముఖత వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ఒకసారి బోర్డు ఆమోదం తెలిపిన తర్వాత నిధులను వెంటనే విడుదల చేయాలి. కానీ ఈ నిబంధనను ఉల్లంఘించి మరీ బోర్డు సభ్యులు కొందరు తెలంగాణకు నిధులు ఇవ్వద్దని పేచీ పెడుతున్నట్టు అధికార వర్గాలు చెప్తున్నాయి. అయితే రుణం ఇచ్చేందుకు ఎన్‌సీడీసీ అధికారులు సుముఖంగా ఉన్నారని, ఇటీవలి బోర్డు సమావేశ ఎజెండాలో ఈ ప్రతిపాదన పెట్టారని.. కానీ కొందరు సభ్యులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని మరో సమావేశం వరకు ఈ నిధుల విడుదలను వాయిదా వేయించారని అంటున్నారు.

ఖజానా నుంచే సర్దుబాటుకు ఏర్పాట్లు

ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో గొర్రెల పంపిణీ పథకంపై చర్చ జరిగింది. రుణం మంజూరు చేసినా విడుదల చేయకుండా ఎన్‌సీడీసీ వ్యవహరిస్తున్న తీరు, రెండో విడత పంపిణీకి అవసరమయ్యే నిధులు తదితర అంశాలపై చర్చించిన కేబినెట్.. 10–15 రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని అధికారులను ఆదేశించింది. అయితే రుణ విడుదలను ఎన్‌సీడీసీ వాయిదా వేసిన నేపథ్యంలో.. రాష్ట్ర ఖజానా నుంచే రెండో విడత పంపిణీకి అవసరమయ్యే నిధులను సర్దుబాటు చేసేందుకు ఆర్థిక శాఖ కసరత్తు ప్రారంభించింది. వారం, పదిరోజుల్లో జరిగే ఎన్‌సీడీసీ భేటీ వరకు వేచి చూస్తామని, ఈ దఫా కూడా నిధులను విడుదల చేయకపోతే.. రాష్ట్ర ఖజానా నుంచే విడతల వారీగా నిధులు విడుదల చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని ఆర్థికశాఖ అధికారి వెల్లడించారు.

ఒక్క వాయిదా తప్పకుండా..

తొలి విడత గొర్రెల పంపిణీ కోసం ఎన్‌సీడీసీ ఇచ్చిన రూ.3,955 కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. 2017లో ఈ రుణం మంజూరుకాగా.. ఏటా మే, నవంబర్ మాసాల్లో వాయిదాలను జమ చేస్తోంది. ఇప్పటివరకు 12 వాయిదాల్లో అసలు కింద రూ.2,626 కోట్లు, వడ్డీ కింద రూ.1,442 కోట్లు కలిపి రూ.4,068 కోట్లను చెల్లించింది. తొలి విడత రుణం 2025 మే నాటికి తీరిపోనుంది. ఇలా ఠంచన్‌గా రుణ వాయిదాలు చెల్లిస్తున్నా.. రెండో విడత కింద రూ.4,565 కోట్లను మంజూరు చేసి మరీ నిలిపివేయడం వెనుక రాజకీయ ఉద్దేశం ఉందనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. రెండో విడత రుణం విడుదల చేసేందుకు.. కేంద్ర సహకార శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న అమిత్‌షా అనుమతి కావాల్సిందేనని ఎన్‌సీడీసీ బోర్డులోని కీలక అధికారి ఒకరు మన రాష్ట్ర అధికారులకు స్పష్టం చేసినట్టు తెలిసింది.

గొర్రెల పంపిణీ సంబంధిత గణాంకాలివీ..	ఇప్పటివరకు గొర్రెల పంపిణీ జరిగిన లబ్ధిదారుల సంఖ్య: 3.94 లక్షలు	రాష్ట్రంలో గొర్రెల సంఖ్య పెరిగిన తీరు: 2014-15లో 1.28 కోట్ల నుంచి 2022-23 నాటికి 1.90 కోట్లకు..	మాంసం ఉత్పత్తి పెరిగిన తీరు: 2014-15లో 5.05 లక్షల టన్నుల నుంచి 2021-22 నాటికి 10.04 లక్షల టన్నులకు..

క్లుప్తంగా...

ఎవరూ ఊహించనంతగా మత్స్య సంపద



మత్స్య కార్పొరేషన్ చైర్మన్‌గా పిట్టల రవీందర్ బాధ్యతల స్వీకరణలో మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల పంపిణీ తో ఎవరూ ఊహించని విధంగా మత్స్య సంపద పెరిగిందని పశుసంవర్థక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. చెరువుల దగ్గర దళారులు పోయి చేపలను మత్స్యకారులే విక్రయించుకునేలా ప్రభుత్వం చేసిందని స్పష్టం చేశారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్‌లో మత్స్య సహకార సొసైటీల చైర్మన్‌గా పిట్టల రవీందర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని మాట్లాడుతూ, పిట్టల రవీందర్‌కు పూర్తి అండగా ఉంటానని, సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చూస్తానని తేల్చి చెప్పారు. గతంలో చెరువులు, కుంటలు పిచ్చిమొక్కలతో పూడిపోయిన విధంగా ఉండేవని, అదే నేడు మిషన్ కాకతీయతో చెరువులు, కుంటలు కళకళలాడుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే నెల 8న అన్ని జిల్లా కేంద్రాల్లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు నిర్వహించాలని, దీనిలో మత్స్యమహిళలను భాగ స్వాములను చేయాలని సూచించారు. పిట్టల రవీందర్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పశుసంవర్ధకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య' సొసైటీ చైర్మన్ పదవి మాకే ఇవ్వాలి

గంగపుత్రుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మత్స్య సహకార సొసైటీ చైర్మన్‌గా గంగపుత్రులకే అవకాశం ఇవ్వాలని గంగపుత్రులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. చైర్మన్ పదవి ఇతర కులం వారికి ఇచ్చారని, ఇది గంగపుత్రులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్‌గా పిట్టల రవీందర్ పదవీ బాధ్యతల స్వీకరణ సందర్భంగా మాసబ్‌ట్యాంక్ వద్దకు చేరుకుని గంగపుత్రులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

2003 డీఎస్సీ టీచర్లను పాత పెన్షన్‌లోకి మార్చాలి

సీఎస్‌కు పీఆర్‌టీయూటీఎస్ వినతి



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ–2003 ద్వారా నియుక్తులైన టీచర్లను ప్రస్తుతం ఉన్న సీపీఎస్ విధానంలో కాకుండా, పాత పెన్షన్ విధానంలోకి మార్చాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ – తెలంగాణ.. ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలసి వినతిపత్రం సమర్పించారు.

బీసీల ఐక్య పోరాటంతోనే ఏదైనా సాధ్యం

జస్టిస్ ఈశ్వరయ్య ఉద్ఘాటన

లక్సెట్టిపేట: బీసీల ఐక్య పోరాటంతోనే రాజకీయ ప్రాధాన్యత సాధ్యమని బీసీ జాతీయ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. 'వచ్చే అసెంబ్లీ ఎన్నికలు.. బీసీల పాత్ర, భవిష్యత్తు కార్యచరణ'పై సోమవారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. విభేదాలను పక్కనపెట్టి బీసీలంతా రాజకీయ పోరు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య, చిత్రంలో జాజుల

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌తోపాటు 60 సీట్లు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల్లో అసంతృప్తిని చల్లార్చడానికే కేసీఆర్ రూ. లక్ష సాయం అంటున్నారని, తొమ్మిదేళ్లలో బీసీలకు ఆయన చేసిన మేలేమీలేదన్నారు. బీసీ ముఖ్యమంత్రే లక్ష్యంగా పోరాడతామన్నారు. జూన్ 2న బీసీ బాట చేపట్టి, 'ఓ బీసీ మేల్కో.. నీ రాజ్యం దక్కించుకో' నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. త్వరలో బీసీ ప్లీనరీలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు బీసీ ఎజెండాతో జరగనున్నాయన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు కేశన శంకర్‌రావు, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మె యోచన విరమణ

మంత్రి గంగులతో చర్చలు సఫలం



సాక్షి, హైదరాబాద్: డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 5వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని ప్రకటించిన రేషన్ డీలర్లు శాంతించారు. రేషన్ డీలర్లు లేవనెత్తిన 22 డిమాండ్లలో 20 అంశాలపై పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సానుకూలంగా స్పందించడంతో పాటు గౌరవ వేతనం, కమీషన్ పెంపు అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో డీలర్లు దిగివచ్చారు. ప్రతిపాదిత సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. జూన్ 5 నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో డా. బీ.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సోమవారం మంత్రి గంగుల తెలంగాణ రేషన్ డీలర్ల ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)తో చర్చలు జరిపారు. ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పద్మా దేవేందర్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్, జేఏసీ చైర్మన్ నాయికోటి రాజు, వైస్ చైర్మన్ బంతుల రమేష్‌బాబు, కన్వీనర్ దుమ్మాటి రవీందర్, కో–కన్వీనర్ గడ్డం మల్లికార్జున్ పాల్గొన్న ఈ సమావేశంలో డీలర్లు లేవనెత్తిన 20 సమస్యల పరిష్కా రానికి సానుకూలంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని మంత్రి గంగు ల స్పష్టం చేశారు. మంత్రితో సమావేశం తరువాత సమ్మెను విరమిస్తున్నట్లు జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు.

కేసీఆర్, కేటీఆర్ అండతోనే ఎదిగావు

- పొంగులేటిపై మంత్రి పువ్వాడ ఫైర్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఐదు నెలల క్రితం వరకు బీఆర్‌ఎస్‌లో ఉండి.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను పొగిడి వేల కోట్ల కాంట్రాక్టులు సంపాదించుకున్నావు.. వారి అండతోనే ఎదిగావు. ఇప్పుడు డబ్బు ఉంది కదా అని విర్రవీగుతున్నావు' అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక పువ్వాడ మాట్లాడారు. 2016లో టీఆర్‌ఎస్‌లో చేరినప్పుడు పొంగులేటి ఆర్థిక పరిస్థితి, కంపెనీ టర్నోవర్ ఎంతో గుర్తు చేసుకోవాలన్నారు. ఎస్‌ఎస్‌పీ లెఫ్ట్ కెనాల్ ఆధునీకరణ పనులను తూతూ మంత్రంగా చేపట్టి వందల కోట్లు దండుకున్నారని, దీనిపై నమోదైన ఫిర్యాదులో విజిలెన్స్ నివేదిక ఇవ్వడంతో తప్పించుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించారు. ఆ కేసులన్నీ ఇప్పటికీ అలాగే ఉన్నాయని గుర్తు చేశారు. నిన్నటి వరకు పార్టీ పెడతానని, ఆ పార్టీ, ఈ పార్టీ నేతలు తనతో టచ్‌లో ఉన్నారంటూ మాట్లాడారన్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లోకే వెళ్తారని, ఆ పార్టీలోకి వెళ్లాక కేసీఆర్ విలువ ఏమిటో ఆయనకు తెలుస్తుందని పువ్వాడ అన్నారు. టీఆర్‌ఎస్‌లో ఉండి పార్టీ అభ్యర్థులను ఓడించిన ఘన చరిత్ర పొంగులేటిదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో ఆయన చేసిన నిర్వాకానికే 2019 ఎన్నికల్లో కేసీఆర్ ఆయనకు టికెట్ ఇవ్వలేదని, పద్ధతి మార్చుకోవాలని కేసీఆర్ చెప్పినా మార్పురాలేదన్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో పొంగులేటి పిట్టలదొర అని ఘాటుగా విమర్శించారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పంచాయతీల్లో పెండింగ్ బిల్లులకు మోక్షం?

సాక్షి, హైదరాబాద్: గత కొంతకాలంగా గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో పడిన బిల్లులకు త్వరలోనే మోక్షం లభించనుందా ? ఈ ప్రశ్నకు ప్రభుత్వవర్గాల నుంచి సానుకూల సమాధానమే వస్తోంది. ఈ వాదనకు బలం చేకూర్చేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో ఏయే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయో వాటికి సంబంధించిన మొత్తం లెక్కలు తీయాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు. సోమవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ అంశంతోపాటు గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల విషయంలో సీఎస్ శాంతికుమారితో ఆర్థికమంత్రి హరీష్ రావు, తాను, పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చర్చించామని చెప్పారు. దీనికి సంబంధించిన లెక్కలు తీసి మంగళవారం మరోసారి తాము సమావేశమై ఆయా అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

దాదాపు రూ.వెయ్యికోట్ల వరకు...

రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో దాదాపు రూ.వెయ్యికోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంటాయని సర్పంచ్‌ల సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు అంచనా వేస్తున్నారు. దాదాపు అయిదారు నెలలుగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల సిబ్బంది, సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రావడం పట్ల సర్పంచ్‌ల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.











> భయం వద్దు! వెనక్కి తగ్గవద్దు... దేవుడే స్వయంగా నీకోసం పోరాడుతాడు; నువ్వు నిశ్చలంగా ఉంటే చాలు.
> – జుడాయిజం

సాక్షి

మంగళవారం, 23 మే 2023

హిరోషిమాలో నిష్ఠుర నిజాలు

జపాన్‌లోని హిరోషిమా వేదికగా మూడు రోజులు సాగిన జీ7 దేశాల సదస్సు రష్యాపై మరిన్ని ఆంక్షలు, చైనాపై ఘాటు విమర్శలు, ఉక్రెయిన్ అధినేత ఆశ్చర్యకర సందర్శనతో ఆదివారం ముగిసింది. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూరోపియన్ యూనియన్ (ఈయూ)లతో కూడిన 'జీ7'లో భాగం కానప్పటికీ, ఈ 49వ సదస్సుకు ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందుకున్న భారతదేశం ప్రాధాన్యం ఈ వేదిక సాక్షిగా మరోసారి వెల్లడైంది. భారత ప్రధానికి అమెరికా, ఆస్ట్రేలియా అధినేతల ప్రశంసల నుంచి పాపువా న్యూ గినియా ప్రధాని చేసిన పాదాభివందనం దాకా అనేకం అందుకు నిదర్శనాలు. రష్యా దాడి నేపథ్యంలో యుద్ధబాధిత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన ఆయన సంక్షోభ పరిష్కారానికి వ్యక్తిగతంగానూ చొరవ చూపుతాననడం పెద్ద వార్త. అంతటితో ఆగక ఆ మర్నాడే ఐరాసపై విమర్శల బాణం ఎక్కుపెట్టి, పరిస్థితులకు తగ్గట్టుగా సంస్కరణలు చేయకుంటే ఐరాస, భద్రతా మండలి కేవలం కబుర్లకే పరిమితమైన వేదికలుగా మిగిలిపోతాయనడం సంచలనమైంది.

నిష్ఠురమైనా భారత ప్రధాని వ్యాఖ్యలు నిజమే. మూడేళ్ళక్రితం తూర్పు లద్దాఖ్ వెంట భారత్‌తో చైనా ఘర్షణ మొదలు తాజా ఉక్రెయిన్ సంక్షోభం దాకా అన్నిటినీ దృష్టిలో ఉంచుకొనే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారన్నది స్పష్టం. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు ఎదురయ్యే సమస్యల్ని చర్చించి, ఘర్షణల్ని నివారించాల్సిన ఐరాస ఆ పని చేయలేక ఇటీవల నామమాత్రంగా మారిన సంగతి చూస్తున్నదే. సమస్యల్ని ఐరాసలో కాక, ఇతర వేదికలపై చర్చించాల్సి రావడం వర్తమాన విషాదం. అదే సమయంలో అంతర్జాతీయ చట్టం, ఐరాస నియమావళి, ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని ప్రపంచ దేశాలన్నీ గౌరవించి తీరాలంటూ జీ7 వేదికగా భారత ప్రధాని కుండ బద్దలు కొట్టారు. కాదని ఏకపక్షంగా వాస్తవస్థితిని మార్చే ప్రయత్నాలకు ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలి అన్న మోదీ వ్యాఖ్యలు పరోక్షంగా చైనాను ఉద్దేశించినవే. భద్రతా మండలిలో భారత సభ్యత్వానికి జరుగుతున్న సుదీర్ఘ కాలయాపన కూడా మోదీ మాటలకు ఉత్ప్రేరకమైంది.

గమ్మత్తేమిటంటే, ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సైతం 1945 నాటి ప్రపంచ దేశాల పరిస్థితులకు అనుగుణంగా ఉన్న భద్రతామండలిని వర్తమాన కాలమాన పరిస్థితులకు తగ్గట్టు సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని మీడియా ఎదుట అంగీకరించడం. ఇక, సాధారణ అలవాటుకు భిన్నంగా ఒక రోజు ముందు శనివారమే వెలువడ్డ జీ7 విధాన ప్రకటన డజన్ల కొద్దీ పేజీలున్నా – అందులో ప్రధానంగా చైనాపై విసిరిన బాణాలే ఎక్కువ. కనీసం 20 సార్లు చైనా నామస్మరణ సాగింది. తైవాన్, అణ్వస్త్రాలు, ఆర్థిక నిర్బంధం, మానవహక్కులకు విఘాతం, అమెరికా సహా పలు దేశాలతో బీజింగ్‌కు ఉన్న ఉద్రిక్తతలు ప్రకటనలో కనిపించాయి. సహజంగానే డ్రాగన్ ఈ ప్రకటనను ఖండించింది. ఇదంతా 'పాశ్చాత్య ప్రపంచం అల్లుతున్న చైనా వ్యతిరేక వల' అని తేల్చేసింది. రష్యా సైతం ఈ సదస్సు తమపైనా, చైనాపైనా విద్వేషాన్ని పెంచి పోషించే ప్రయత్నమంది.

యాభై ఏళ్ళ క్రితం ఒక కూటమిగా ఏర్పడినప్పుడు ఏడు పారిశ్రామిక శక్తుల బృందమైన 'జీ7' దేశాలు ప్రపంచ సంపదలో దాదాపు 70 శాతానికి ప్రాతినిధ్యం వహించాయి. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాటి వాటా 44 శాతమే. నిజానికి, 2007–08లో ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో 'జీ20' కూటమి ఏర్పాటయ్యాక అంతర్జాతీయ ఆర్థిక మేనేజర్‌గా 'జీ7' వెలుగు తగ్గింది. అయితే, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అగ్రశ్రేణిలో నిలిచిన ఈ దేశాలు ఇప్పటికీ తామే ప్రపంచ విధాన నిర్ణేతలమని చూపాలనుకుంటున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో ఆ ఆలోచన, ఆకాంక్ష అత్యవసరమయ్యాయి. వర్తమాన ప్రపంచ అధికార క్రమాన్ని సమర్థించే శక్తులన్నీ ఒక్కచోట చేరి ఈ సదస్సును వినియోగించుకుంటున్నాయి. ఉక్రెయిన్‌పై దాడి అంతర్జాతీయ సమాజ విధివిధానాలకే సవాలని జపాన్ ప్రధాని పదే పదే పేర్కొన్నది అందుకే! స్వదేశంలోని రాజకీయ అంశాలతో తన పర్యటనలో రెండో భాగాన్ని రద్దు చేసుకున్నా 'జీ7'కు మాత్రం అమెరికా అధ్యక్షుడు హాజరైందీ అందుకే!

అదే సమయంలో 2.66 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, తమ సభ్యదేశాలైన ఫ్రాన్స్, ఇటలీ, కెనడాల కన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌ను అనేకానేక కారణాల వల్ల జీ7 విస్మరించే పరిస్థితి లేదు. ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిని, సరఫరా వ్యవస్థల్లో చిక్కులతో అనేక పాశ్చాత్య దేశాలు చిక్కుల్లో పడ్డాయి. అటు రష్యాతో, ఇటు పాశ్చాత్య ప్రపంచంతో సంబంధాల్లో సమతూకం పాటిస్తుండడం భారత్‌కు కలిసొస్తోంది. భవిష్యత్తులో చర్చలు, దౌత్యంతో యుద్ధం ఆగాలంటే – ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భారత్ మధ్యవర్తిత్వం కీలకం. కిందపడ్డా తనదే పైచేయిగా ఉండేలా 'జీ7'కు భారత్ ఆ రకంగా అవసరమే.

భారత్ సైతం ఒకపక్కన చైనా దూకుడును పరోక్షంగా నిరసిస్తూనే, రష్యా సాగిస్తున్న యుద్ధంపై తటస్థంగా ఉంటూ శాంతి ప్రవచనాలు చేయక తప్పని పరిస్థితి. భారత ప్రధాని అన్నట్టు చర్చలే అన్ని సమస్యలకూ పరిష్కారం. సమస్యను రాజకీయ, ఆర్థిక కోణంలో కాక మానవీయ కోణంలో చూడాలన్న హితవు చెవికెక్కించుకోదగ్గదే. ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో వెనకబడ్డ దక్షిణార్ధగోళ దేశాలకు భారత్ గొంతుక కావడమూ బాగుంది. ప్రపంచ అధికార క్రమంలో గణనీయ మార్పుల నేపథ్యంలో ఇలాంటి శిఖరాగ్ర సదస్సులు, సమాలోచనలు జరగడం ఒకరకంగా మంచిదే. సమస్యల్ని ఏకరవు పెట్టడం సరే కానీ, సత్వర పరిష్కారాలపై జీ7 దృష్టి నిలిపిందా అంటే సందేహమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చవితి రా.11.30 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఆరుద్ర ఉ.11.42 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.12.47 నుండి 2.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.50 నుండి 12.21 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఎంత చేయాలో అంత చేశారు!



నివాళి

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

జరుగుబాటున్న కుటుంబంలో పుట్టిన కేతు విశ్వనాథ రెడ్డి కడుపు నిండినవాళ్ళ కోసం రాయలేదు. కడుపు కాలినవాళ్ళ కోసం రాశారు. రాయలసీమను పట్టి పీడిస్తున్న రెండు సమస్యలు – కరువు, ముఠాతత్వం గురించి అత్యుత్తమ కథలు రాశారు. స్త్రీ పట్లగల మానవీయ దృష్టికి కూడా ఆయన కథలు నిదర్శనాలు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సంపుటాలుగా వింగడించి పెద్ద చలనం తీసుకొచ్చారు. సామాజిక శాస్త్రాల సహాయంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన తీరును అనేక వ్యాసాలలో స్పష్టం చేశారు. విరుద్ధ భావజాలం గలవారిపట్ల కూడా గౌరవంగా మాట్లాడేవారు. ఒకరు ఉపయోగకరమైన పని చేస్తే, ఆ కృషి కొనసాగింపునకు ప్రోత్సహించే సంస్కారి.

'మానవతావాదులు కాని వారెవరూ కమ్యూనిస్టులు కాలేరు' అన్నారు శ్రీశ్రీ ఒక ఇంటర్వ్యూలో. కులం, మతం, జెండర్, ప్రాంతం వంటివాటితో సంబంధం లేకుండా మనుషులను ప్రేమించడమే మానవవాదం. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి (10 జూలై 1939– 22 మే 2023) అలాంటి మానవ వాది, మానవతావాది. లేకుంటే 'అమ్మవారి నవ్వు' అనే మంచికథ రాసేవారు కాదు. 'బోధి', 'వేర్లు' నవలికలు రాసేవారు కాదు. 'శశిశ్రీ', రహమతుల్లా, షేక్ హుస్సేన్ సత్యాగ్ని లాంటి ముస్లిం రచయితలను, హయాత్ అనే ఆచార్యుని సోదరులుగా గౌరవించేవారు కాదు. విశ్వనాథరెడ్డి వ్యవసాయక కుటుంబం నుండి వచ్చారు. బాగా జరుగుబాటున్న కుటుంబంలో పుట్టిన ఆయన కడుపు నిండిన వాళ్ళ కోసం రాయలేదు. కడుపు కాలిన వాళ్ళకోసం రాశారు. అదే ఆయన మానవత్వం.

మానవతావాది కనుకనే, రాయలసీమను పట్టి పీడిస్తున్న రెండు సమస్యలు – కరువు, ముఠాతత్వం గురించి 'జప్తు', 'విరూపం', 'సానుభూతి' లాంటి అత్యుత్తమ కథలు రాశారు. ఆయన ఆకాంక్ష, ఆయన స్వప్నం కరువు, కక్షలు లేని రాయలసీమ. ఆయన బంధువర్గం ఫ్యాక్షన్ గొడవల్లో పడి నలిగిపోవడం చూశారు. ఫ్యాక్షన్ వల్ల ఇతర ప్రాంతాల దృష్టిలో రాయలసీమ గౌరవం దెబ్బతింటున్నదని గ్రహించి 'వెనకా ముందు' కథ రాశారు. ఫ్యాక్షనిస్టులు చివరికి ఒక్కటై, వాళ్ళ కోసం పేదలు బలైపోతున్న అమానుషత్వాన్ని 'పీర్లసావిడి' కథలో చిత్రించారు.

నేను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న సమయం (1973–1977)లో బహుశా 1975 ప్రాంతంలో విశ్వనాథ రెడ్డి పరిచయమయ్యారు. నన్ను 'చంద్రా' అని పిలిచేవారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఒకసారి నన్ను తిరుపతిలో కేతు ఇంటికి పిలుచుకొని వెళ్ళారు. ఆ సమయంలో కేతును గురించి వల్లంపాటి నాతో 'ఈయన పైకి చూడడానికి నవ్వుతూ కనిపిస్తాడు కానీ, పెద్ద రౌడీ' అన్నారు. అప్పుడు కేతు నవ్వుతూనే 'చంద్రా! ఆయన మాటలు నమ్మొద్దు' అన్నారు. అలా మొదలైన మా పరిచయం నిరాఘాటంగా కొనసాగింది. కేతు మార్క్సిస్టు అయినా, మార్క్సిస్టులు కాని చెరుకుపల్లి జమదగ్ని శర్మ, పేరాల భరత శర్మ వంటి సహాధ్యాపకుల గురించి ఉన్నతమైన మాటలు చెప్పేవారు. ఒకరిని చూస్తే ఇంకొకరికి పడని కాలంలో విరుద్ధ భావజాలం గలవారిపట్ల గౌరవంగా మాట్లాడడం నేను ఆయన దగ్గర నేర్చుకున్నాను. ఒకరు ఉపయోగకరమైన పని చేస్తే, దానిని మెచ్చుకొని, ఆ కృషి కొనసాగింపునకు ప్రోత్సహించే గొప్ప సంస్కారం ఆయనది.

'నేను చాలా స్లో రైటర్ని' అని విశ్వనాథరెడ్డి చెప్పుకొన్నారు. సమాజాన్ని దహించి వేస్తున్న రుగ్మతలను సమగ్రంగా మనసులో రూపుకట్టించుకొని రాయడానికి చాలా సమయమే తీసుకొనేవారు. 'వాన కురిస్తే' కథలో రైతు పాపయ్య, ఆయన కుటుంబమంతా వానకోసం ఎదురు చూడడంలోనే జీవితాలు గడిచిపోతాయి. కరువు కాలంలో ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే గడ్డిని ఆధిపత్యవాదులు పేదలకు అందకుండా తస్కరించే వాస్తవికతను 'గడ్డి' కథలో చిత్రించారు. ఈ అమానవీయతను 'నా బట్టా! నువ్వు రైతు కొంపల్లోనే పుట్టి నావా? కాపోడివేనా?' అని ఒక పేద మహిళ నిలదీస్తుంది. ఇలాంటి మాటలు రాయాలంటే రచయిత 'అ-కులీకరణ' (డీక్యాస్టిఫై) అయితే తప్ప సాధ్యం కాదు. అకులీకరణ చెందాలన్నా, అవర్గీకరణ చెందాలన్నా రచయిత హృదయంలోని మానవత్వమే దారి చూపుతుంది.



కేతు విశ్వనాథరెడ్డి

పులివెందుల కాలువ వస్తువుగా ఆర్తితో రాసిన 'పాడినిజం' కథలో కరువుతో ఎండిపోయి, పంటలు పండని నేలను ఒక విద్యార్థి దృష్టికోణం నుండి 'అచ్చరాలు తుడిచేసిన పలకలాగా ఉంది' అనిపిస్తాడు. పంటలు పండించి బతికే రైతులు కరువు వల్ల సారా వ్యాపారులుగా మారి, పోటీలు పడి, ఆఖరికి ఫ్యాక్షనిస్టులుగా మారి ఒకర్నొకరు చంపుకొనే అమానుష దశకు చేరుతున్న వాస్తవమే 'కూలిన బురుజు' కథ. భారతీయ సమాజంలో వితంతువులు పీడిత వర్గం. వాళ్ళపట్ల సమాజం ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో 'ముఖదర్శనం' కథలో చిత్రించారు. కేతు విశ్వనాథరెడ్డి రెడ్డి స్త్రీపక్షపాతి. అలా కాని రచయితలు మానవతావాదులు కారు. 'తారతమ్యం', 'మారి పోయారు' వంటికథలు ఆయనకు స్త్రీ పట్లగల మానవీయ దృష్టికి నిదర్శనాలు. 'ఎందరి దయాదాక్షిణ్యాల మీద ఆడవాళ్ళు బతకాలి?' అని 'తారతమ్యం' కథ ప్రశ్నిస్తుంది. ఈ కథ 1977 నాటిది. అప్పటికి తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం పుట్టలేదు.

డబ్బు కొంతమంది చేతుల్లో ఉండిపోవడాన్ని వేమన వంటి ప్రాచీన కవులే గుర్తించారు. ఆధునిక కాలంలో మార్క్సిజం నేర్పిన పాఠాలతో ప్రభావితమైన అభ్యుదయ రచయితలు అసమ ఆర్థిక వ్యవస్థ సృష్టించే వైరుధ్యాలను బలంగా చిత్రించారు. 'డబ్బు ఈ సంఘంలో అన్నింటినీ శాసిస్తోంది' అన్న అవగాహన విశ్వనాథరెడ్డిది. ఈ అవగాహనతో 'చీకటితప్పు', 'దాపుడుకోక', 'చెదిరిన గుండెలు' వంటి విలువైన కథలు రాశారు. 'దాపుడుకోక' కథలో చెన్నమ్మ పేదరికం మానవత్వం ఉన్నవాళ్ళను కలవరపరుస్తుంది. సంపద ఒకరి చేతిలో ఉండే వ్యవస్థలో పీడితులు కూడా సంపద తమ చేతికి వేస్తే, పీడకులుగా ఎలా మారతారో 'సొతంత్రం' కథలో సాయమ్మ పాత్ర ద్వారా చూపించారు. మార్క్సిజం వ్యక్తిగత ఆస్తిని వ్యతిరేకిస్తుంది. ఆ దృష్టి ఈ కథలో కనిపిస్తుంది. ఆయన కథలు చదివితే మన సంస్కారంలో ఒక కదలిక వస్తుంది. వర్తమాన ఆర్థిక రాజకీయ సాంఘిక వ్యవస్థ మీద మనల్ని పునరాలోచింప చేస్తాయి.

ప్రజలకు సేవ చేయడానికి ప్రజాధనాన్ని జీతాలుగా ఇచ్చి ఉద్యోగులుగా ప్రభుత్వం నియమిస్తుంది. ఆ ఉద్యోగులు అదనపు ఆదాయం కోసం ప్రజలను పీడించడాన్ని సహించరు అభ్యుదయ రచయితలు. 'చక్రబంధం', 'పద్ధతి' (విద్యారంగం), 'అనధికారం', 'ఆ రోజుల్లో వస్తే', 'సందాకబళం', 'అంతర్ముఖం' (పోలీసు శాఖ), 'పారువేట' (అటవీ శాఖ), 'దప్పిక' (రెవెన్యూ), 'వైరుధ్యం' (పంచాయతీ రాజ్) వంటి కథల ద్వారా కార్యనిర్వహణ వ్యవస్థలోని అమానుషత్వాలను ప్రతిబింబించారు కేతు. ప్రాంతాల మధ్య వైరుధ్యాలను కూడా 'తేడా', 'ఒక దృశ్యం – మరొక చిత్రం' వంటి కథల్లో ఆవిష్కరించారు. 'శిలువ వేసిన మనుషులు' వంటి కథలలో దళితుల జీవితాల లోని దైన్యాన్ని ప్రతిపాదించారు. పల్లెలు, నగరాలు, భారతదేశం, విదేశాలు – వీటి మధ్య తేడాలను 'రెండు ప్రపంచాల మధ్య', 'దగ్గరైన దూరం – దూరమైన దగ్గర', 'అంత్యాక్షరి' వంటి కథలలో కంటికి కొట్టి నట్లు చిత్రించారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే, కేతు విశ్వనాథరెడ్డి కథలు పాడినిజాల పట్ల తడిగీతాలు!

కేతు శాస్త్రీయమైన సాహిత్య విమర్శకుడు, పరిశోధకుడు. 'కడప ఊర్ల పేర్లు' అంశం మీద పరిశోధించి, ఓనమాస్టిక్స్ అనే ప్రత్యేక అధ్యయన విభాగానికి పునాది వేశారు. సామాజిక శాస్త్రాల సహాయంతో సాహిత్యాన్ని అధ్యయనం చేయవలసిన తీరును అనేక వ్యాసాలలో స్పష్టం చేశారు. 'దృష్టి', 'సంగమం', 'పరిచయం' వంటి గ్రంథాలు ఆయన విమర్శన గాఢతకు నిదర్శనాలు. సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలుగు వాచకాల్లో విప్లవం తీసుకొచ్చారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని సంపుటాలుగా వింగడించి విలువైన సంపాదకీయాలు రాసి పెద్ద చలనం తీసుకొచ్చారు. గొప్ప విద్యావేత్త. దూరవిద్యా విధానం మీద ఆయన చేసిన కృషి 'భాషాబోధన, విద్య–మార్పులు, ప్రాసంగికత' అనే పుస్తకంగా వచ్చింది. 'రాయలసీమ రాగాలు', 'చదువుకోలేదు' వంటి పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం, అజోవిభో కందాళై పురస్కారం వంటివి ఆయనకు దక్కాయి. ఒక మధ్య తరగతి మేధావి, ఆధునిక రచయిత తన సమాజానికి ఎంత చేయాలో అంత చేశారు!

వ్యాసకర్త తెలుగు సాహిత్య విమర్శకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సైడ్ ఎఫెక్ట్



ఊహించినట్టే చాలామంది దుకాణదారులు రెండు వేల నోటు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. పైగా మీ దగ్గర ఒక్క రెండు వేల నోటున్నా అది నల్లధనం అన్న భావనొకటి జనాల్లోకి వెళ్లిపోయింది.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

అదింకా పెద్ద తప్పు



జీవితంలో రెండు పెద్ద తప్పులు: 1. మన గురించి ఇతరులు ఏం అనుకుంటారోనని ఆందోళన చెందడం. 2. ముందసలు ఇతరులు మన గురించి ఆలోచిస్తారని నమ్మడం.

– సాహిల్ బ్లూమ్, కంటెంట్ క్రియేటర్

వేసుకోకూడనిది...



మహిళలూ! బొటాక్స్ (వార్ధక్యాన్ని కనిపించనీయని ఇంజెక్షన్) అనేదాన్ని ఒక జీవాయుధంగా సృష్టించారు. దాన్ని సరిగ్గా వేసుకోకపోతే బొచూలిజం జబ్బు రావొచ్చు, లేదా మరణానికి దారితీయొచ్చు. బొటాక్స్ ఉద్వేగాలను అనుభూతి చెందకుండా శరీరాన్ని మొద్దుబారుస్తుంది. అది థైరాయిడ్‌ను అస్తవ్యస్తపరిచి, ఆటో ఇమ్యూన్ సమస్యలను సృష్టించవచ్చు. అది మీ శరీరంలో ఉండవలసింది కానేకాదు.

– జాన్ కాన్‌స్టాస్, మెడికల్ యాక్టివిస్ట్

సరైన నిర్ణయం



కశ్మీర్‌లో జీ20 సమావేశాలు జరగడం పట్ల అంతర్జాతీయ మీడియా ఉద్రేకపడుతోందంటేనే అదే సరైన వేదిక అని నాకు అనిపించింది. ఎందుకంటే ఎక్కడైనా స్థిరత్వం నెలకొంటున్నదంటే వారి బిజినెస్ మోడల్ దెబ్బతింటుందిగా!

– అవీ యెమిని, జర్నలిస్ట్

ఏం ఫర్లేదు!



శ్రీనగర్‌లో జీ20 సమావేశాలకు చైనా హాజరు కాకపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. వాళ్లు అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా హాజరుకాలేదు. దానితో పెద్ద తేడా పడలేదు. సానుకూల కోణంలో చూస్తే, చైనా హాజరుతో కశ్మీర్ అపవిత్రం అయ్యే సమస్య తప్పింది.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

అనవసర శ్రమ



మెట్రో నగరాలు, ముంబయి లాంటి వాణిజ్య నగరాల్లో తమ రోజువారీ లావాదేవీల్లో భాగంగా మధ్యశ్రేణి దుకాణదారుల దగ్గర కూడా వందలాది 2000 కరెన్సీ నోట్లు ఉండొచ్చు. అదంతా నల్లధనం కాదు. ఒక మార్పిడికి విధించిన ఇరవై వేల గరిష్ఠ పరిమితి వల్ల ఈ నోట్లను మార్చుకోవడానికి వాళ్లు బ్యాంకుల్లో గంటలకొద్దీ గడపాల్సి ఉంటుంది.

– దివ్య కుమార్ సోతీ, జర్నలిస్ట్

ఇంటి రుచి



నేను చాలా తరచుగా ప్రయాణిస్తుంటాను మాషా అల్లా! నా పరిమితుల మేరకు స్థానిక ఆహారం ఎప్పుడూ ప్రయత్నిస్తాను. కానీ గత రాత్రి సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్తాన్)లోని పంజాబీ రెస్టారెంటులో దాల్ చావల్ (పప్పన్నం) తినడం ఇంత సంతోషం కలిగిస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

– రానా సఫ్వీ, రచయిత్రి

ఇన్‌బాక్స్

సీమ అస్తిత్వ పథికుడు

కేతు విశ్వనాథరెడ్డి కథా రచయితగా ప్రసిద్ధి చెందినప్పటికీ ఉత్తమ ఉపాధ్యాయుడిగా, నవలా రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా గొప్ప ప్రజ్ఞాపాటవాలు కలిగిన వ్యక్తి. మార్క్సిజాన్ని ఒక ప్రాపంచిక దృక్పథంగా ఏర్పరచుకున్నారు. ఆ వెలుగు లోనే రచనలు చేశారు. కేతు విశ్వనాథరెడ్డి కమలాపురం తాలూకా, రంగ సాయిపురంలో ఒక వ్యవసాయ కుటుంబంలో 1939లో జన్మించారు. రాయలసీమ రైతు అనుభవిస్తున్న దుర్భర జీవితం, కన్నీటి గాథలను తన రచనల్లో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఆయన ప్రతి కథలోనూ రాయలసీమ స్థానికత ఉట్టిపడుతూ ఉంటుంది. 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' పేరుతో 1991లో వచ్చిన సంకలనం తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, భారతీయ భాషా పరిషత్ (కలకత్తా) అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను పొందింది. వీరి కథలు కొన్ని హిందీ, ఇంగ్లిష్, కన్నడం, మలయాళం, బెంగాలీ, మరాఠీ, రష్యన్ భాషల్లోకి అనూదిత మయ్యాయి.



కడప జిల్లాలోని 3,403 ఊర్ల పేర్లను అకారాది క్రమంలో చేర్చి 'కడప గ్రామనామాలు' పేరుతో సిద్ధాంత గ్రంథాన్ని 1976లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయా నికి సమర్పించారు. ఈ పరిశోధన గ్రంథాన్ని తిరిగి 'కడప ఊర్లపేర్లు' పేరుతో పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. ఇది 'స్థల నామ విజ్ఞానశాస్త్రం' అనే కొత్త అంశానికి చెందిన పరిశోధనా గ్రంథం. వీటితో పాటు 'జప్తు', 'ఇచ్ఛాగ్ని', 'కేతు విశ్వనాథరెడ్డి కథలు' (1998–2003) వంటి కథా సంపుటాలు; 'దృష్టి', 'దీపధారులు', 'పాత్రికేయం', 'పరిచయం', 'సంగమం' వంటి వ్యాస సంపుటాలు రచించారు. కుటుంబరావు సాహిత్యం 13 సంపుటాలు, 'చదువు కథలు', 'రాయల సీమ రాగాలు' వంటి పుస్తకాలకు సంపాద కత్వం వహించారు.

ఆయన ప్రతిభకు తార్కాణంగా ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని పొందారు. ఆయన ఈ లోకాన్ని వదిలివెళ్ళడం సాహితీ లోకానికి తీరనిలోటు.

– డా॥ చింతకుంట శివారెడ్డి, సి.పి. బ్రౌన్ గ్రంథాలయం, కడప

న్యూ ఇండియాలోకి 'పరకాల ప్రవేశం'!



కామెంట్

కరణ్ థాపర్

యాదృచ్ఛికాలు అన్నవి వట్టి అర్థరహిత మైన సంభవాలేనా లేక వాటి వెనుక గొప్ప అంతరార్థం ఏదైనా ఉండి ఉంటుందా అని నేను తరచూ ఆలోచిస్తూంటాను. ఒకటేదైనా మనం అర్థం చేసుకోలేనిది, లేదా కనీసం గ్రహించలేనిది దీర్ఘకాలానంతరం దానికై అదే బహిర్గతం అవుతుంది. గతవారం జరిగింది అటువంటిదే అయివుండే అవకాశం ఉంది. చూద్దాం, ఈ మాటను మీరు ఒప్పుకుంటారేమో!


ఇటీవల నేను పరకాల ప్రభాకర్‌ను ఆయన తాజా పుస్తకం 'ది క్రూకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా: ఎస్సేస్ ఆన్ ఎ రిపబ్లిక్ ఇన్ క్రైసిస్'పై ఇంటర్వ్యూ చేశాను. ప్రధానమంత్రి మీద, భారతీయ జనతాపార్టీని ఆయన రూపాంతర పరచిన వైనం మీద చురుక్కుమనిపించే విమర్శ ఆ పుస్తకం. ప్రభాకర్ ఏమిటన్నది మీరు కనుగొన్నప్పుడు ఆ చురక మరింత స్పష్టంగా దృగ్గోచరం అవుతుంది. ఇంటర్వ్యూ చేసిన మరునాడే బీజేపీకి కర్ణాటకలో పరాభవం ఎదురైంది. దక్షిణాదిన ఆ పార్టీకి ఉన్న ఏకైక రాష్ట్రం హిందుత్వ ముఖం మీదే తలుపులు వేసేసింది. పోయిన ఆదివారం 'విముక్త' బెంగళూరులో ప్రభాకర్ పుస్తకానికి ఆవిష్కరణ జరిగింది.

ప్రభాకర్ అనే వ్యక్తి ఇదీ అని చెప్పాలన్నది నా ఉద్దేశం కాదు. ఒక వ్యక్తిగా ఆయన గురించి ఆయననే మాట్లాడనివ్వడం మంచిది. మన ఆర్థిక వ్యవస్థ గురించి ఆయన ఇలా అంటారు: ''దేశ ఆర్థిక యాతనలు మోదీ పాలనలోని విస్మయకరమైన అసమర్థతల వల్ల తలెత్తినవి. ఆయన పాలన చక్కటి ఆలోచనాపరత్వాన్ని, పొందిక గుణం కలిగిన ఆర్థిక తత్వాన్ని జతపరచలేకపోయింది.'' ''ఇష్టానుసారం అధికారాన్ని అపరిమితంగా ఉపయోగించడానికి అలవాటు పడింది. ప్రజాస్వామ్యాన్ని సమస్యాత్మకం చేసింది.'' ఫలితంగా, ''1975–77 ఎమర్జెన్సీ తర్వాతెన్నడూ లేని భయం సమాజంలో నేడొక కఠినమైన ప్రత్యక్ష వాస్తవం అయింది'' అని ప్రభాకర్ ఈ పుస్తకంలో రాశారు.

ప్రభాకర్ నిక్కచ్చిగా, నిర్దయగా విషయాన్ని తేల్చేస్తారు. ''మన ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉంది. మన సామాజిక నిర్మాణం బల హీనం అయింది. మన ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉంది. మనం చీకటి యుగాలకు తిరోముఖం పడుతున్నాం'' అంటారు.

కర్ణాటక ఎన్నికల ఫలితాలలో హిందూత్వ – అలాగే హిందూత్వపై ప్రతిస్పందించడంలో విపక్షాల అసమర్థత, ప్రాసంగికతను కలిసి ఉన్నాయని ఆయన చెప్పారు. ''దేశ రాజకీయ అగ్రగణ్యతల దిగువన దాగి ఉన్న మూల ప్రవృత్తులు; సామాజిక, సాంస్కృతిక అభద్రతలను తారుమారు చేయగల నైపుణ్యంపై హిందూత్వ అభివృద్ధి చెందుతుందని అన్నారు. మన గుణగణాలలోని చీకటి కోణాలకు ఇది ఒక విజ్ఞప్తి అని ప్రభాకర్ ఈ పుస్తకం గురించి నాతో అన్నారు.

మొన్నటి ఎన్నికల ప్రచారం ముగింపు రోజుల్లో ప్రధాని జై బజరంగబలీ అంటూ ఓటింగ్ మీటను నొక్కమని కర్ణాటక ప్రజల్ని కోరడం వెనుక ఆయన నేర్పు, నర్మగర్భత ఉన్నాయని అనేకమంది విశ్వసిస్తున్నారు.



పరకాల ప్రభాకర్ - కొత్తపుస్తకం

పనితీరులోని వైఫల్యం, అవినీతిలో గడించిన ఖ్యాతి కారణంగా కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి ఎదురైన ఘోర పరాజయం మీద ప్రభాకర్ తీర్మానాలు స్పష్టతను కలిగి ఉన్నాయి. ''బీజేపీ ప్రస్తుత ఓటమి, తిరిగి అధికారాన్ని సాధించుకోలేక పోవడం అన్నవి పనితీరు వల్ల కాదు. హిందూత్వ గుర్తింపునకు ఆ పార్టీ దృఢ వైఖరిని కలిగి ఉండటం వల్ల, హిందూయేతరులను వేరుగా చూడటం వల్ల'' అని ఆయన అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ జై బజరంగ బలీ అన్నదే తప్ప, మంచి పాలనను ఇస్తానని అనలేదు.

మనమిప్పుడు ప్రతిపక్షాల గురించి ప్రభాకర్ రాసిన చోటుకు వద్దాం. ''బీజేపీయేతర రాజకీయ వర్గ వైఫల్యమే నేడు మన దేశం సూత్రరహితమైన సౌధంగా మారడానికి ప్రధాన కారణం. బీజేపీనీ, ఆ పార్టీ పరివారాన్నీ సైద్ధాంతికంగా వ్యతిరేకించే రాజకీయ పార్టీలే అత్యంత ప్రభావవంతమైన ఈ సవాలును ఎదుర్కొని ఉండాల్సింది. కానీ వారు తమ దృష్టి, వ్యూహం, శక్తికి సంబంధించిన స్థిరమైన వైఫల్యాలతో మనల్ని ఓడిపోయేలా చేశారు'' అన్నారాయన.

ఆ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎలా అధిగమిస్తున్నాయనే దానికి కర్ణాటకలో మొన్నటి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారమే మొదటి నిదర్శనమని నేను భావిస్తున్నాను. దృష్టిపరంగా ఆ పార్టీ... ఓటర్ల నిజమైన సమస్యలకు సంక్షేమాన్ని హామీని, సానుభూతితో కూడిన ప్రతిస్పందనను అందించింది. వ్యూహాత్మకంగా... హిందూ వ్యతిరేకి అని ఆ పార్టీపై ప్రధాని చేసిన ఆరోపణలను తిప్పికొట్టకుండా దాట వేసింది. శక్తిపరంగా అక్షరాలా ఉత్తేజాన్ని నింపింది. దీనిని ప్రభాకర్ అంగీకరిస్తారని చెప్పగలను.

ప్రచారం చరమాంకానికి చేరుకోగానే కాంగ్రెస్ గంభీరంగా, దృఢ నిశ్చయంతో చెవిని నేలకు ఆన్చి (సమగ్ర విషయ సేకరణ జరిపి), ప్రజలపై దృష్టి సారించింది. బీజేపీ ఇందుకు విరుద్ధంగా ఉత్కంఠంగా, నిరాశాపూరితంగా, కొన్నిసార్లు ఉన్మాదంగా కనిపించింది. ఇందుకు కారణం హిందూత్వ వెనకంజ వేయడమేనా? ఉనికి కోసం పోరాడుతుండటమేనా? లేదంటే, ఓటర్లకు కావలసిందేమిటో కాంగ్రెస్‌కు తెలిసి ఉండటం వల్లనా?

ఇప్పుడు నేను పేర్కొన్న సంఘటనల క్రమం, వాటి ఆసక్తికరమైన కాలానుక్రమణిక కేవలం యాదృచ్ఛికం అని అనిపిస్తున్నాయా? లేదా విధివశాత్తూ జరిగినవిగా తోస్తున్నాయా? నిజాయతీగా ఒప్పుకుంటున్నాను. నేను చెప్పలేను. అయితే ప్రధానమంత్రి, ప్రతిపక్షాలు... ప్రభాకర్ రాసిన ఈ పుస్తకాన్ని చదవాలని నేను కోరుకుంటున్నాను. వాళ్లకు ఈ పుస్తకం ఒక హెచ్చరిక... అలాగే పాఠం కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అన్నదాతల అరిగోస..

పంట నష్టపోయానని..

రైతు ఆత్మహత్య


రాజయ్య (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రూపిరెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముడతనపెల్లి రాజయ్య (56) తనకున్న పది ఎకరాల భూమిలో వ్యసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షానికి మిర్చితోపాటు వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయాయి. ఇప్పటికే సుమారు రూ.15 లక్షల మేర అప్పులు ఉండడం.., పంట నష్టం కారణంగా అప్పులు తీర్చలేనన్న బెంగతో ఆదివారం రాత్రి పురుగు మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి అతను మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మక్కలు కొనలేదని

రైతుల ఆందోళన

రాయికల్(జగిత్యాల): మక్కల కొనుగోళ్లలో అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తీవ్ర జాప్యం చేయడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ వ్యవసాయ మార్కెట్ ఎదుట సోమవారం రోడ్డుపై బైఠాయించారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా చేశారు. కొనుగోలు కేంద్రాలకు మక్కలు తీసుకువచ్చి నెలరోజులు గడుస్తున్నా కొనడం లేదని మండిపడ్డారు. అకాల వర్షాల కారణంగా మక్కలు తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్వాహకుల తీరును నిరసిస్తూ రోడ్డుపైనే వంటావార్పు చేశారు. దీంతో వాహనాలు భారీసంఖ్యలో నిలిచిపోయాయి. ఈ సమాచారం అందుకున్న తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై కిరణ్‌కుమార్ రైతులవద్దకు చేరుకున్నారు. కొనుగోళ్లు వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.


జగిత్యాల జిల్లా రాయికల్ రోడ్డుపై వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ధాన్యం తడిచిపోయిందని..

పురుగు మందు తాగేందుకు రైతు యత్నం

కథలాపూర్(వేములవాడ): ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరుతో విసిగిపోయిన ఓ రైతు క్రిమిసంహారక మందు తాగేందుకు ప్రయత్నించాడు. తోటి రైతులు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గోపిడి మధు అనే రైతు నెలక్రితం భూషణరావుపేటలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాడు. నిర్వాహకులు వారం కిందట తూకం వేశారు. అయితే లారీల కొరత ఉందంటూ ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించడం లేదు. అప్పటినుంచి 681 బస్తాల్లోని ధాన్యం అక్కడే నిల్వ ఉంటోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో అతని ధాన్యం తడిసింది. దీంతో మనస్తాపం చెందిన మధు.. క్రిమిసంహారకమందు తాగేందుకు ప్రయత్నించాడు. అయితే అక్కడే ఉన్న రైతులు ఆయనను అడ్డుకున్నారు. లారీల కొరత ఉందని అధికారులు చెప్పి వారం అవుతోందని, రైస్‌మిల్లులకు ధాన్యం తరలించడంలేదని రైతులు మండిపడ్డారు.



ధాన్యం బస్తాల వద్ద కన్నీటిపర్యంతమవుతున్న మధు, క్రిమిసంహారక మందు తాగేందుకు యత్నిస్తున్న మధు, అడ్డుకుంటున్న రైతులు

కాంటా వేసినా తరలించలేదని..

ధాన్యాన్ని తగులబెట్టి రైతుల నిరసన

నెల్లికుదురు: కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి నెల రోజులైనా మిల్లులకు తరలించడం లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. ధాన్యం తగులబెట్టి నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం గ్రామ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. నర్సింహులగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేసి మిల్లులకు తరలించడం లేదని రైతులు చెపుతున్నారు. ఇదేమని అడిగితే లారీలు రావడం లేదని అంటున్నారని తెలిపారు. నిర్వాహకుల తీరుతో ఆగ్రహం చెందిన రైతులు నెల్లికుదురు- మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ధాన్యం పోసి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న ఎస్సై క్రాంతి కిరణ్ సంఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పి వారిని శాంతింపజేశారు.


నెల్లికుదురు- మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ధాన్యాన్ని, తగులబెడుతున్న రైతులు

క్లుప్తంగా...

పీఎఫ్‌ఐ సభ్యులపై రూ. 2 లక్షల రివార్డు

- ముగ్గురి ఇళ్లకు వెళ్లి నోటీసులు అంటించిన ఎన్ఐఏ
- తెలంగాణకు చెందిన ఇద్దరు, ఏపీకి చెందిన ఒకరి కోసం వేట

ఖలీల్‌వాడి (నిజామాబాద్): పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేసిన నిజామాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అహద్‌పై ఎన్ఐఏ రివార్డు ప్రకటన చేసింది. అదేవిధంగా జగిత్యాల జిల్లా ఇస్లాంపురా కాలనీకి చెందిన అబ్దుల్ సలీమ్, ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలోని ఖాజానగర్‌కు చెందిన షేక్ ఇలియాస్ అహ్మద్‌పై ఒక్కొక్కరిపై రూ.2 లక్షల చొప్పున రివార్డు ప్రకటించింది. పీఎఫ్ఐపై కేంద్రం నిషేధం విధించిన తర్వాత ఈ ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లడంతో వారి నివాసాలకు నోటీసులు అంటించారు. అయినాసరే విచారణకు రాకపోవడంతో ఎన్ఐఏ రివార్డులు ప్రకటించింది. కాగా, నిజామాబాద్ పోలీసులు గతేడాది జూలై 4న పీఎఫ్ఐకి చెందిన నలుగురు సభ్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఈ కేసును ఎన్ఐఏకు ఆగస్ట్ 26న అప్పగించారు.


ఎన్నికల సవాళ్లకు సన్నద్ధం కావాలి..


అసెంబ్లీ ఎన్నికల బందోబస్తుపై డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో ఐదారు నెలల్లో జరగనున్న ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని పోలీస్ అధికారులను డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతిసారీ సరికొత్త సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయని అన్నారు. ఎన్నికలకు పరిపాలనాపరమైన ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల సంబంధిత నేరాల పాత కేసులు తదితర అంశాలపై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ అంజనీకుమార్ పలు సూచనలు ఇచ్చారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా శాంతిభద్రతల పరిశీలకులుగా వెళ్లిన అడిషనల్ డీజీ సౌమ్యా మిశ్రా, పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నవీన్ కుమార్, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం డీసీపీ అభిషేక్ మొహంతి అక్కడి తమ అనుభవాలను, ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, శాసనసభ ఎన్నికలకు మరికొన్ని నెలల సమయం ఉన్నా ఎన్నికలకు సంబంధించి బందోబస్తు, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై స్పష్టత కలిగి ఉండాలని యూనిట్ అధికారులకు సూచించారు.

కుక్కల దాడిలో చిన్నారులకు తీవ్ర గాయాలు


గాయపడ్డ సంజయ్


రోదిస్తున్న తేజ

ఖమ్మం అర్బన్, వేములవాడ: వీధి కుక్కల దాడిలో వేర్వేరు చోట్ల ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలపాలైన ఘటనలు సోమవారం చోటుచేసుకున్నాయి. ఖమ్మం రోటరీనగర్‌లో ఆటో డ్రైవర్ రాజేశ్ మూడేళ్ల కుమారుడు గగన్ తేజ ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు రాగా వీధి కుక్కలు దాడికి దిగడంతో వీపు, కాళ్ల తదితర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని కుక్కలను తరిమేయడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని మార్కండేయనగర్‌కు చెందిన దొంతుల సంజయ్ ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. బాలుడి తలకు, ముఖంపై తీవ్రంగా గాయాలయ్యాయి.

మహావీర్ ఆస్పత్రికే ఉచితంగా 'లీజు' స్థలం

- జైన భవన్ కోసం ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలం
- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం


సీఎం కేసీఆర్‌ను సత్కరిస్తున్న జైనులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో జైన భవన్ నిర్మాణానికి ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అలాగే మాసబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ స్థలంలో దశాబ్దాలుగా లీజుపై నిర్వహిస్తున్న జైన మహావీర్ ఆస్పత్రికే ఆ స్థలాన్ని ఉచితంగా కేటాయిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను జైనమత పెద్దలు కలుసుకున్నారు. జైనులకు రాష్ట్ర మైనార్టీ కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మహావీర్ ఆస్పత్రి చైర్మన్, జైన మతపెద్దల విన్నపం మేరకు సీఎం ఈ నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో విభిన్న మతాలు, సంస్కృతుల ప్రజలు సుఖశాంతులతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాగా, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నాణ్యమైన విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని జైన మతస్తుల ఐక్య సంఘం 'శ్రీ జైన్ సేవా సంఘ్'కమిటీ ప్రశంసించినట్లు సీఎంఓ తెలిపింది. మంత్రి తలసాని ఆధ్వర్యంలో జైన మతపెద్దలు సీఎంను కలిశారు.

సీఎంను కలిసిన ప్రజాప్రతినిధులు

జీవో 111ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 111 జీవో పరిధిలోని 84 గ్రామాల ప్రజా ప్రతినిధులతోపాటు సోమవారం సచివాలయంలో ఆయన సీఎం కేసీఆర్‌ను కలిశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 111 జీవోను ఎత్తేసి సీఎం కేసీఆర్ మాట నిలుపుకొన్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్యతో పాటు 111 జీవో పరిధిలోని మండలాల, గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ స్ఫూర్తిని కొనసాగిస్తాం: సీఎం

దళిత వైతాళికుడు, దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషిచేసిన భాగ్యరెడ్డివర్మ స్ఫూర్తిని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆయన 135వ జయంతిని పురస్కరించుకొని సీఎం నివాళులర్పించారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల లోగో ఆవిష్కరణ

సచివాలయంలో ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో పదేళ్ల తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా రూపొందించిన లోగోను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. సెక్రటేరియట్ లోని తన చాంబర్‌లో సోమవారం మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులతో కలిసి ఈ లోగోను కేసీఆర్ ఆవిష్కరించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులను ఈ లోగోలో పొందుపరిచారు. కాళేశ్వరం తదితర సాగునీటి ప్రాజెక్టులు, యాదాద్రి వంటి ఆధ్యా త్మిక పుణ్యక్షేత్రాలు, విద్యుత్ వ్యవసాయం, మిషన్ భగీరథ, మెట్రో రైలు, టీ-హబ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం చిహ్నాలను సీఎం ఆదేశాల మేరకు లోగోలో చోటు కల్పించారు. వీటితో పాటు తెలంగాణ తల్లి, బతుకమ్మ, , బోనాలు, పాలపిట్ట, అమరవీరుల స్మారకంతో కూడిన తెలంగాణ అస్తిత్వ చిహ్నాలతో తెలంగాణ ఖ్యాతి ఇనుమడించేలా లోగోలో చోటిచ్చారు. కార్య క్రమంలో ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, దేశ పతి శ్రీనివాస్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, సీఎస్ శాంతి కుమారి, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్.. హ్యాపీస్

▶ మొదటి పేజీ తరువాయి

ఎర్రబెల్లి దయాకర్‌రావు సచివాలయంలో తొలుత సీఎస్ ఎ.శాంతికుమారితో, ఆ తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సీఎం కేసీఆర్ మనసున్న మారాజు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. మాట తప్పకుండా, మడమ తిప్పకుండా వ్యవహరిస్తున్నారు'అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించినందుకు సీఎంకు కృతజ్ఞతలు, జేపీఎస్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. మార్గదర్శకాల రూపకల్పనపై మంగళవారం సైతం ఉన్నతాధికారులతో సమావేశం కానున్నట్లు చెప్పారు.

సీఎంకు రుణపడి ఉంటాం: జేపీఎస్ ఫెడరేషన్

తమ సర్వీసుల క్రమబద్ధీకరణ దిశగా నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని తెలంగాణ జూనియర్ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు సీఎం నిర్ణయం శుభ పరిణామమని తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమ్మె... విరమణ... క్రమబద్ధీకరణ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మొత్తం 12,769 పంచాయతీలకుగాను సుమారు 3 వేల మంది పంచాయతీ కార్యదర్శులుగా (పర్మినెంట్ ఉద్యోగులు) పనిచేస్తున్నారు. మిగతా 9,350 గ్రామ పంచాయతీల్లో 8 వేలకుపైగా జూనియర్ పంచాతీయ సెక్రటరీలు (జేపీఎస్‌లు), సుమారు వెయ్యి మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలు (ఓపీఎస్‌లు) విధులు నిర్వహిస్తున్నారు. 2019లో జేపీఎస్‌లుగా ఎంపికైన వారికి ప్రభుత్వం తొలుత మూడేళ్లపాటు కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేయాలనే నిబంధన విధించింది. 2021 జూలై 17న ఈ నిబంధనను నాలుగేళ్లకు పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్ 11న దాదాపు 6 వేల మంది జేపీఎస్‌లు నాలుగేళ్ల గడువును పూర్తిచేసుకోగా మరో 2,500 మంది మూడేళ్ల గడువు పూర్తిచేసుకున్నారు. అయితే గడువు ముగిసినా ప్రభుత్వం తమ సర్వీసులను క్రమబద్ధీకరించనందుకు నిరసనగా జేపీఎస్‌లు పీఆర్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమ్మె నోటీసిచ్చారు. ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేసి, నాలుగేళ్ల కాలాన్ని సర్వీసుగా పరిగణించాలని, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 28 నుంచి సమ్మెకు దిగారు. సమ్మెకు దిగడం చట్ట విరుద్ధమని.. మే 6లోగా విధుల్లో చేరకుంటే తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో 13 రోజుల సమ్మె అనంతరం విధుల్లో చేరారు. తాజాగా వారి పనితీరు ఆధారంగా సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

శుభకార్యానికి వెళ్తూ.. శుభవార్త చెప్పొస్తూ..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం
- ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తాత, మనవరాలు మృతి
- గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రాణాలొదిలిన అన్నదమ్ములు


అక్షిత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) అక్షిత

టేకుమట్ల(రేగొండ)/హసన్‌పర్తి: గ్రామంలో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్తూ తాత, మనవరాలు... ఇటీవల లభించిన కేంద్ర ప్రభుత్వ కొలువుకు అదనంగా మరో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందన్న శుభవార్తను తల్లిదండ్రులకు చెప్పొస్తూ ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదాలకు బలయ్యారు. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాలు ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి. పోలీసుల కథనం ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాలకు చెందిన దొంగల భిక్షపతి–మమతల కూతురు అక్షిత (9) వేసవి సెలవుల కోసం ఘనపురం మండలంలోని సీతారాంపూర్‌లో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. సోమవారం లింగాలలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉన్నందున సీతారాంపూర్ నుంచి లింగాలకు తాత నరాల చిన్న సమ్మయ్య (60)తో కలసి ద్విచక్ర వాహనంపై వస్తోంది. ఈ క్రమంలో భాగిర్తిపేట కమాన్ ముందు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొట్టి తాత, మనవరాలి పైనుంచి దూసుకెళ్లింది. దీంతో బస్సు చక్రాల కిందే అక్షిత, సమ్మయ్యలు మృతిచెందారు. ఈ ప్రమాదంలో అక్షిత చెయ్యి తెగిపడింది. 'చెయ్యి తెగిపడి, ఒళ్లంతా గాయాలతో ఎలా తట్టుకున్నావు బిడ్డా.. ఒక్కసారి కళ్లు తెరువు.. నీవు లేకుండా ఎట్లా ఉంటాము బిడ్డా.. నీ తమ్ముడు ఏడుస్తున్నాడు ఒక్కసారి చూడు' అంటూ అక్షిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం..


శివరామకృష్ణ, హరికృష్ణ (ఫైల్)

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగులకు చెందిన ఇప్పలపల్లి మనోహర్‌కు శివరామకృష్ణ (25), హరికృష్ణ (23) అనే కుమారులు ఉన్నారు. శివరామకృష్ణకు ఇటీవల రైల్వేశాఖలో ఉద్యోగం రాగా హైదరాబాద్ మౌలాలిలో శిక్షణ పొందుతున్నాడు. హరికృష్ణ ఘట్‌కేసర్‌లోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లోనే నివసిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం హరికృష్ణ కందుగులకు రాగా పోస్టల్‌శాఖలోనూ ఉద్యోగం రావడంతో ఈ శుభవార్త చెప్పేందుకు శివరామకృష్ణ ఆదివారం హైదరాబాద్ నుంచి కందుగులకు వచ్చాడు. సోమవారం ఉదయం సోదరులిద్దరూ ఉదయం 4:30 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బైక్‌పై పయనమయ్యారు. అన్నాసాగరం సమీపంలోకి రాగానే వెనక నుంచి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో సోదరులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని అక్కడ లభ్యమైన ఆధారాలతో మృతుల కుటుంబానికి సమాచారం ఇచ్చారు. కుమారులు దుర్మరణం చెందారని తెలియడంతో వారు కుప్పకూలారు. వారి రోదనలతో అక్కడ ఉన్న వారు సైతం కంటతడి పెట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

వాట్సాప్‌లో ఎడిట్ ఫీచర్ ప్రారంభం

న్యూఢిల్లీ: మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో కొత్తగా ఎడిట్ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. పొరపాటున, తప్పుగా పంపిన సందేశాల్లో మార్పులు చేసుకోవచ్చు. అక్షర దోషాలు ఉంటే సరి చేసుకోవచ్చు. ఈ మేరకు ఎడిట్ బటన్ ఫీచర్‌ను ప్రారంభించినట్లు వాట్సాప్ యాజమాన్యం ప్రకటించింది. రాంగ్ మెసేజ్‌లు ఎడిట్ చేసుకోవడానికి తొలి 15 నిమిషాల సమయం మాత్రమే ఉంటుంది. సందేశం తప్పుగా వెళ్లినట్లు భావిస్తే దాన్ని మొత్తం తొలగించాల్సిన అవసరం లేదు. మార్పులు చేస్తే సరిపోతుంది. దీనివల్ల యూజర్లకు చాటింగ్‌పై మరింత కంట్రోల్ లభిస్తుందని యాజమాన్యం తెలియజేసింది.

మెసేజ్‌లు ఎలా ఎడిట్ చేయాలి?

1. వాట్సాప్ యాప్‌లో ఏదీ చాట్‌లోకి వెళ్లాలి.
2. పొరపాటున పంపిన మెసేజ్‌పై వేలితో కాసేపు నొక్కి ఉంచాలి(లాంగ్ ప్రెస్).
3. ఇప్పుడు ఎడిట్ మెసేజ్ ఆప్షన్ కనిపిస్తుంది. దానిపై నొక్కి, సందేశాన్ని ఎడిట్ చేయొచ్చు.

మెసేజ్ పంపిన తర్వాత కేవలం 15 నిమిషాల లోపే ఈ వెసులుబాటు ఉంది. గడువు దాటితే ఆ మెసేజ్‌ను పూర్తిగా డిలీట్ చేయడం మినహా మరో మార్గం లేదు.

ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు వైద్య పరీక్షలు




న్యూఢిల్లీ: మనీల్యాండరింగ్ కేసులో తిహార్ జైలులో ఉన్న ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ సోమవారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వెన్నెముక సమస్యతో బాధపడుతున్న జైన్‌కు శనివారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించామని, మరోసారి వైద్యుల అభిప్రాయం తీసుకోవాలన్న ఆయన కోరిక మేరకు సోమవారం సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లామని జైలు అధికారులు తెలిపారు. ఆయన వెంట పోలీసులున్నారని చెప్పారు. న్యూరోసర్జరీ విభాగం వైద్యులు పరీక్షించాక ఆయన్ను తిరిగి జైలుకు తీసుకొచ్చారన్నారు. జైన్‌ను 2022 మే 31వ తేదీన ఈడీ అరెస్ట్ చేసింది. జైన్ త్వరగా కోలుకోవాలని ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆకాంక్షించారు. 'జైన్‌ను బీజేపీ చంపాలనుకుంటోంది. ఇంతటి క్రూరత్వం పనికిరాదు, మోదీజీ' అంటూ ట్వీట్ చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో జైన్ 35 కిలోలు తగ్గారని ఆయన లాయర్ అభిషేక్ సింఘ్వి సుప్రీంకోర్టుకు తెలిపారు.

కెమెరా కంటికి చిక్కిన సూపర్‌నోవా

అస్ట్రో ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కార్తీ ఘనత

సువిశాలమైన అంతరిక్షం.. ఎన్నెన్నో విశేషాలకు ఆలవాలం. అంతరిక్షంలోని కోటాను కోట్ల నక్షత్రాల్లో కొన్ని అంతరించిపోతుంటాయి. తారల జీవితకాలం ముగియగానే వాటిలోని ఇంధనం మండిపోయి, అదృశ్యమైపోతుంటాయి. చివరి దశకు వచ్చినప్పుడు ఒక నక్షత్రం ఎలా ఉంటుంది? అంతమయ్యే ముందు ఏం జరుగుతుంది? నక్షత్రాలు మృత తారలుగా మారడానికి ముందు పరిణామాలేంటి? ఇవన్నీ ప్రత్యక్షంగా చూడాలని ఆసక్తి ఉన్నప్పటికీ మన కంటికి కనిపించవు. నక్షత్రాలు మన భూమికి కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉండడమే ఇందుకు కారణం. తారల కేంద్ర భాగం(కోర్)లో అణు విచ్ఛిత్తి జరిగి పేలిపోతుంటాయి. నక్షత్రాలు పేలిపోయి, అంతం కావడాన్ని సూపర్‌నోవా అంటారు. ఇలాంటి ఒక సూపర్‌నోవాను ప్రముఖ అస్ట్రో ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కార్తీ తన కెమెరాలో చక్కగా బంధించారు. పిన్‌వీల్ లేదా ఎం10 అనే పాలపుంత(గెలాక్సీ)ని ఆయన తన టెలిస్కోప్‌తో నిశితంగా పరిశీలించారు. ఆ పాలపుంతలో కాలం తీరిన ఒక నక్షత్రం పేలిపోయి, అంతమైపోవడాన్ని టెలిస్కోప్ ద్వారా కొన్ని ఫ్రేమ్‌లను తన కెమెరాలో బంధించి, దృశ్యబద్ధం చేశారు. దీన్ని ఒక యానిమేషన్‌గా మార్చారు. మృత నక్షత్రాన్ని చిత్రీకరించడానికి ఆ గెలాక్సీకి సంబంధించిన కలర్ డేటాను ఉపయోగించానని ఆండ్రూ మెక్‌కార్తీ చెప్పారు. నక్షత్రానికి చెందిన 10 నిమిషాల ఎక్స్‌పోజర్‌తో యానిమేషన్ రూపొందించినట్లు తెలిపారు. ఎరుపు, తెలుపు వర్ణాలతో ఈ చిత్రం ఆకట్టుకుంటోంది. మరో విశేషం ఏమిటంటే.. సూర్యుడు తన జీవితకాలమంతా వెలువరించే శక్తి కంటే ఎక్కువ శక్తి కేవలం కొన్ని సెకండ్ల వ్యవధిలో సంభవించే సూపర్‌నోవాలో వెలువడుతుందట! కాంతి, వేడి, రేడియేషన్ రూపంలో ఈ శక్తి ఉద్గారమవుతుంది. సూపర్‌నోవా గాఢమైన ప్రభావం దాని పరిసర ప్రాంతాల్లో ఉంటుంది. పిన్‌వీల్(ఎం10) పాలపుంత(మిల్కీవే) ప్రస్తుతం మనం ఉంటున్న పాలపుంత కంటే 70 శాతం పెద్దది. దాని వ్యాసం 1,70,000 కాంతి సంవత్సరాలు. మన భూమి నుంచి 21 మిలియన్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.



– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ విశ్వసనీయ భాగస్వామి

పసిఫిక్ ద్వీప దేశాల ప్రాధాన్యతలను గౌరవిస్తున్నాం | **వాటిని భారత్ ఏనాడూ చిన్నదేశాలుగా చూడలేదు** | **మా శక్తియుక్తులను, అనుభవాలను పంచుకునేందుకు సదా సిద్ధం** | **ఎఫ్ఐపీఐసీ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ హామీ**

పోర్ట్ మోరిస్‌బై: ఆపదలోఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మనం ఎంతో నమ్మకం పెట్టుకున్నవారు క్లిష్ట సమయంలో ఆదుకోకపోవడం నిజంగా దారుణమని అన్నారు. తద్వారా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా వ్యవహార శైలిని తప్పుపట్టారు. పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోరిస్‌బైలో సోమవారం ఫోరమ్ ఫర్ ఇండియా–పసిఫిక్ ఐలాండ్స్ కో–ఆపరేషన్(ఎఫ్ఐపీఐసీ) శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. 14 పసిఫిక్ ద్వీప దేశాల అధినేతలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ పసిఫిక్ ద్వీప దేశాలకు భారత్ అండగా నిలుస్తోందని మోదీ గుర్తుచేశారు. భారత్‌ను విశ్వసనీయ అభివృద్ధి భాగస్వామిగా పరిగణించవచ్చని ఆయా దేశాలకు సూచించారు. తమ శక్తి సామర్థ్యాలను, అనుభవాలను పసిఫిక్ ద్వీప దేశాలతో పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రతి మార్గంలోనూ తోడుగా ఉంటామని మోదీ వివరించారు. తమ దృష్టిలో ఈ దేశాలు చిన్న దేశాలు ఎంతమాత్రం కావని, భారీ సముద్ర దేశాలుగా వాటిని పరిగణిస్తున్నామని మోదీ చెప్పారు.

మూడు దేశాల అధినేతలతో భేటీ

మోదీ సోమవారం న్యూజిలాండ్ ప్రధాని క్రిష్ హిప్‌కిన్స్, రిపబ్లిక్ ఆఫ్ పాలౌ అధ్యక్షుడు సురాంగెల్ ఎస్.విప్స్ జూనియర్, పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపేతో వేర్వేరుగా సమావేశమయ్యారు. వ్యాపారం, వాణిజ్యం, విద్య, క్రీడలు, సాంకేతికత, అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. హిప్‌కిన్స్‌తో భేటీ అద్భుతంగా జరిగిందని మోదీ ట్వీట్ చేశారు. పాలౌ ప్రజలు వాడే ఎబాకిల్ పరికరాన్ని మోదీకి సురాంగెల్ బహూకరించారు.

ఆస్ట్రేలియాతో సుదృఢ బంధం

న్యూఢిల్లీ: ''నేనంత త్వరగా తృప్తిపడే రకం కాదు. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ కూడా అంతే. ఇద్దరమూ కలిసి ఆస్ట్రేలియా, భారత బంధాలను మరింత దృఢతరం చేసి తీరతాం'' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. సిడ్నీలో 'ద ఆస్ట్రేలియన్' వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై తన మనోగతాన్ని పంచుకున్నారు. వాతావరణ మార్పులు మొదలుకుని ఉగ్రవాదం, సముద్ర తీర భద్రత, పైరసీ దాకా ఇండో–పసిఫిక్ ప్రాంతం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటోందంటూ ఆందోళన వెలిబుచ్చారు.



మోదీకి పపూవా న్యూ గినియా అత్యున్నత పురస్కార ప్రదానం



సిడ్నీలో ప్రధానికి ఘన స్వాగతం పలుకుతున్న స్థానిక భారతీయులు

విందులో భారతీయ రుచులు

ఎఫ్ఐపీఐసీ శిఖరాగ్రం సందర్భంగా పసిఫిక్ ద్వీప దేశాల అధినేతలకు సోమవారం మధ్యాహ్నం మోదీ ఇచ్చిన విందులో భారతీయ వంటకాలు, ముఖ్యంగా తృణధాన్యాల వెరైటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అతిథులు తృణధాన్యాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఖాండ్వీ, వెజిటెబుల్ సూప్, మలై కోఫ్తా, రాజస్తానీ రాగి గట్టా కర్రీ, దాల్ పంచ్‌మెల్, మిలెట్ బిర్యానీ, నాన్ పుల్కా, మసాలా చాస్, పాన్ కుల్ఫీ, మాల్పువా, మసాలా టీ, గ్రీన్ టీ, మింట్ టీ, పీఎన్‌జీ కాఫీ తదితరాలను రుచిచూసి బాగున్నాయంటూ మెచ్చుకున్నారు.

మోదీకి రెండు అత్యున్నత పౌర పురస్కారాలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అత్యున్నత గౌరవం లభించింది. పసిఫిక్ సముద్ర ద్వీప దేశాలైన పపువా న్యూ గినియా, ఫిజీ తమ అత్యున్నత పురస్కారాలను ఆయనకు ప్రదానం చేశాయి. ఆయా దేశాలు మరో దేశ ప్రధానిని ఇలాంటి పురస్కారాలతో గౌరవించడం అరుదైన సంఘటన కావడం విశేషం. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పపువా న్యూ గినియా గవర్నర్ జనరల్ సర్ బాబ్ దొడాయి ప్రధాని మోదీకి 'గ్రాండ్ కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ లొగోహు(జీసీఎల్)' పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత్‌లో భారతరత్న తరహాలో పపువా న్యూగినియాలో ఇదే అత్యున్నత పౌర పురస్కారం. పసిఫిక్ ద్వీప దేశాల ఐక్యతకు చేసిన కృషికి గాను మోదీకి ఈ పురస్కారం అందించినట్లు పపువా న్యూ గినియా ప్రభుత్వం వెల్లడించింది. జీసీఎల్ పురస్కారం పొందిన వారిని 'చీఫ్' అనే టైటిల్‌తో సంబోధిస్తారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు ఈ అవార్డు లభించింది.

ఫిజీ ప్రధానమంత్రి సితివేనీ రాబుకా భారత ప్రధాని మోదీకి తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని ప్రదానం చేశారు. మోదీ గ్లోబల్ లీడర్‌షిప్‌నకు గుర్తింపుగా ఫిజీ ప్రభుత్వం ఈ పురస్కారం అందజేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) తెలియజేసింది. ఇది భారత్‌కు లభించిన అరుదైన గౌరవమని వివరించింది. ఈ గౌరవాన్ని మోదీ భారతదేశ ప్రజలకు, ఫిజీ–ఇండియన్ సమాజానికి అంకితం చేశారని పేర్కొంది.

దేశ ప్రజలు సాధించిన విజయాలకు గుర్తింపు

'గ్రాండ్ కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ లొగోహు', 'కంపానియన్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ఫిజీ' గౌరవాలు తనకు దక్కడం పట్ల ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. పపువా న్యూగినియా, ఫిజీ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాలు భారత్‌కు, భారతదేశ ప్రజలు సాధించిన విజయాలకు ఒక గొప్ప గుర్తింపు అంటూ ట్వీట్ చేశారు. సౌదీ అరేబియా, అఫ్గానిస్తాన్, పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, రష్యా, మాల్దీవ్స్, బ్రహెయిన్ తదితర దేశాలు గతంలో తమ అత్యున్నత పౌర పురస్కారాలతో ప్రధాని మోదీని సత్కరించాయి.

బాలిక 32 వారాల గర్భ విచ్ఛిత్తికి కేరళ హైకోర్టు అనుమతి

కొచ్చిన్: సొంత సోదరుడి అఘాయిత్యానికి బలై గర్భం దాల్చిన బాలికకు కేరళ హైకోర్టు ఉపశమనం కలిగించింది. ఆమె 32 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి మంజూరు చేసింది. 'బాధిత బాలిక(15) శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నట్లు వైద్య నివేదికను బట్టి తెలుస్తోంది. గర్భం కొనసాగింపు వల్ల ఆమె సామాజిక, మానసిక ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని గర్భ విచ్ఛిత్తికి అనుమతివ్వాలని నిర్ణయిస్తున్నాం' అని జస్టిస్ జియాద్ రహ్మాన్ ఈ నెల 19న వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. తక్షణమే ఇందుకు సంబంధించిన చర్యలను అమలు చేసి, వారంలోగా పూర్తి వివరాలతో తమ ముందుకు రావాలని మలప్పురం జిల్లా వైద్యాధికారి, మంజేరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు.

చిన్ననాటి గురువు ఇంటికి వెళ్లిన ఉపరాష్ట్రపతి

కన్నూర్(కేరళ): ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సోమవారం కేరళలో కన్నూర్ జిల్లాలోని పన్నియన్నూర్ గ్రామానికి వెళ్లారు. చిత్తోడ్‌గఢ్ సైనిక్ స్కూల్‌లో తన గురువైన రత్న నాయర్‌ను కలుసుకున్నారు. అత్యున్నత స్థాయిలో తమ ఇంటికి వచ్చిన శిష్యుడిని చూసిన ఆమె పొంగిపోయారు. ఇంతకు మించిన గురుదక్షిణ ఇంకేముంటుందంటూ ఆనందించారు. వారిద్దరూ నాటి ఘటనలను గుర్తు తెచ్చుకుంటూ గడిపారు.



జూన్ 11న ఆప్ మహా ర్యాలీ

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పరిపాలనా సర్వీసులపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను నిరసిస్తూ జూన్ 11న మహార్యాలీ నిర్వహించనున్నట్లు ఆప్ సోమవారం ప్రకటించింది. అందులో ఢిల్లీ ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఢిల్లీలో అధికారుల బదిలీలు, వారిపై ఆరోపణలు వస్తే చర్యల కోసం కొత్తగా 'నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ'ని ఏర్పాటు చేస్తూ కేంద్రం ఈ నెల 19న ఆర్డినెన్స్ తేవడం తెలిసిందే. దీనిపై ఆప్ పోరాటానికి కాంగ్రెస్ కూడా మద్దతు ప్రకటించింది.

విపక్షాలకు ఇదొక అగ్ని పరీక్ష: సంజయ్

కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌ను బీజేపీయేతర పార్టీలన్నీ వ్యతిరేకించాలని ఆప్ రాజ్యసభ సభ్యుడు, జాతీయ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ రాజ్యసభలో తాము ప్రవేశపెట్టే బిల్లుకు మద్దతు ఇవ్వాలని విపక్షాలను సంజయ్ సింగ్ కోరారు. ప్రతిపక్షాలకు ఇదొక అగ్ని పరీక్ష అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి రావాలని విన్నవించారు.

త్వరలో విపక్షాల కీలక భేటీ!

నేడో, రేపో ముహూర్తం ఖరారు • ఖర్గే, రాహుల్, నితీశ్ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనేందుకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ముందడుగుకు రంగం సిద్ధమవుతోంది. విపక్షాల ఉమ్మడి భేటీకి మూహూర్తాన్ని, వేదికను ఒకట్రెండు రోజుల్లో నిర్ణయించనున్నారు. సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీలతో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్ జరిపిన భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. విపక్షాల భేటీ పట్నాలోనే ఉండొచ్చని నెల క్రితం ఖర్గేతో భేటీ అనంతరం నితీశ్ పేర్కొనడం తెలిసిందే. కీలకమైన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోరు ముగిసిన నేపథ్యంలో ఐక్యతా యత్నాలను మరింత ముమ్మరం చేయాలని తాజా సమావేశంలో నేతలు నిర్ణయించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ఉమ్మడి వ్యూహరచన విపక్షాల భేటీలో ఏయే అంశాలను చర్చించాలనే దానిపై దాదాపు గంటకు పైగా చర్చించారు. ఖర్గే, రాహుల్, నితీశ్ సమావేశమవడం గత నెలన్నరలో ఇది రెండోసారి కావడం విశేషం. జేడీ(యూ) అధినేత లాలన్‌సింగ్‌తో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఇందులో పాల్గొన్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అనారోగ్యంతో రాలేకపోయారని సమాచారం. ఇప్పుడిక దేశమంతా ఒక్కటవుతుందంటూ భేటీ అనంతరం ఖర్గే ట్వీట్ చేశారు. ''ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే మా సందేశం. దేశానికి నూతన దిశానిర్దేశం చేసే ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లాలని నితీశ్‌తో భేటీలో సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చాం'' అని పేర్కొన్నారు. అతి త్వరలో విపక్షాలన్నీ భేటీ కావాలని నిర్ణయించినట్టు వేణుగోపాల్, లాలన్‌సింగ్ మీడియాకు తెలిపారు. విపక్షాల అధినేతలంతా అందులో పాల్గొంటారని చెప్పారు.

కొన్నాళ్లుగా వరుస భేటీలు

నితీశ్ కొద్ది రోజులుగా విపక్ష నేతలందరినీ వరుసబెట్టి కలుస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం కూడా ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో నితీశ్ మరోసారి సమావేశమై పలు అంశాలపై లోతుగా చర్చించారు. ఢిల్లీ ప్రభుత్వాధికారులపై అజమాయిషీ విషయమై కేంద్రంతో జరుపుతున్న పోరాటంలో ఆప్ సర్కారుకు తమ సంపూర్ణ మద్దతుంటుందని హామీ ఇచ్చారు. శనివారం కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమంలో కూడా జాతీయ స్థాయిలో విపక్ష నేతలంతా వేదికపైకి వచ్చి సమైక్యతా సందేశమివ్వడం తెలిసిందే. నితీశ్‌తో పాటు ఎన్సీపీ అధినేత శరద్ పవార్, తమిళనాడు సీఎం స్టాలిన్, సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా తదితరులు వీరిలో ఉన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్‌లను కూడా విపక్ష కూటమిలోకి తీసుకొచ్చేందుకు నితీశ్ ప్రయత్నిస్తున్నారు.



కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, అగ్ర నేత రాహుల్‌తో బిహార్ సీఎం నితీశ్ చర్చలు

ఇవే కీలకం!

ప్రధాని మోదీకి దీటుగా విపక్షాలన్నీ ఉమ్మడి అభ్యర్థిని తమ సారథిగా నిలబెట్టాలని భావిస్తున్నాయి. అయితే పోటీదారులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీనిపై ఏకాభిప్రాయం ఎలా కుదురుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అంతేగాక లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి తమకు వీలైనన్ని ఎక్కువ స్థానాలు కేటాయించాలని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌ను డిమాండ్ చేస్తున్నాయి. అవి కోరినట్టుగా తాను 200 సీట్లలోనే పోటీకి పరిమితమయ్యేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదు. బలమైన విపక్ష కూటమి ఏర్పాటై లోక్‌సభ ఎన్నికల బరిలో బీజేపీని దీటుగా ఎదుర్కోవాలంటే దీనిపైనా వీలైనంత త్వరగా స్పష్టత రావాల్సి ఉంది.

బీబీసీపై రూ.10 వేల కోట్ల పరువు నష్టం కేసు

న్యూఢిల్లీ: 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరుతో డాక్యుమెంట్ రూపొందించిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ)పై ఓ ప్రభుత్వేతర సంస్థ ఢిల్లీ హైకోర్టులో రూ.10 వేల కోట్ల పరువు నష్టం దావా వేసింది. ఈ డాక్యుమెంట్‌లో ప్రధాని మోదీ, భారత న్యాయవ్యవస్థపై తప్పుడు ఆరోపణలతో బీబీసీ భారత ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వాల ప్రతిష్టను దెబ్బతీసిందని ఆరోపించింది. గుజరాత్‌కు చెందిన జస్టిస్ ఆన్ ట్రయల్ అనే సంస్థ వేసిన పిటిషన్‌పై సోమవారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. బీబీసీ(యూకే)తోపాటు బీబీసీ(ఇండియా)కు సమన్లు ఇచ్చింది. సెప్టెంబర్ 25న తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. పిటిషన్‌దారు తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. నష్ట పరిహారంతోపాటు తమ సంస్థకు ఇతర ఆదాయ మార్గాలు లేనందున కోర్టు ఫీజులు తదితరాల కోసం రూ.10 వేల కోట్లు చెల్లించాలని కోరారు.

75 ఏళ్ల తర్వాత కలుసుకున్న అక్క, తమ్ముడు

లాహోర్: 75 ఏళ్ల క్రితం దేశ విభజన సమయంలో విడిపోయిన తోబుట్టువులు మళ్లీ కలుసుకున్నారు. చిన్నతనంలో వేరుపడిన అక్క, తమ్ముడిని సామాజిక మాధ్యమాలు వృద్ధాప్యంలో కలిపాయి. ఇటీవల వీరిద్దరూ కర్తార్‌పూర్ కారిడార్ వద్ద కలుసుకుని ఉద్వేగ్నభరితులయ్యారు. పంజాబ్‌కు చెందిన సర్దార్ భజన్ సింగ్ కుటుంబం 1947లో దేశ విభజన సమయంలో చెల్లాచెదురైంది. కొడుకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు చేరగా కూతురు మహేంద్ర కౌర్ భజన్ సింగ్ వెంటే ఉన్నారు. ఇటీవల రెండు కుటుంబాల వారు సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం పంచుకున్నారు. పంజాబ్‌లో ఉండే మహేంద్ర కౌర్ (81), పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండే షేక్ అబ్దుల్ అజీజ్ (78) స్వయానా అక్క, తమ్ముడని తెలుసుకున్నారు. తమ కుటుంబాలతో కలిసి కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా గురుద్వారా దర్బార్ సాహిబ్‌లో కలుసుకున్నారు. ఆలింగనాలు, ఆనంద బాష్పాలతో ఇద్దరూ ఉబ్బితబ్బిబ్బయ్యారని డాన్ పత్రిక పేర్కొంది.




చంపుతామంటూ బెదిరిస్తున్నారు

రక్షణ కల్పించాలని ముంబై పోలీసులకు సమీర్ వాంఖడే విజ్ఞప్తి

ముంబై: తనను చంపుతానంటూ బెదిరింపులు వస్తున్నాయని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) ముంబై మాజీ చీఫ్ సమీర్ వాంఖడే ముంబై పోలీసులను ఆశ్రయించారు. తనను, తన భార్యను సామాజిక మాధ్యమాల్లో దుర్భాషలాడుతూ చంపుతామంటూ గత నాలుగు రోజులుగా బెదిరింపులు వస్తున్నాయని వాంఖడే పేర్కొన్నారు. వాంఖడే తన ప్రతినిధి ద్వారా ఈ మేరకు ఒక లేఖను దక్షిణ ముంబై పోలీస్ కమిషనరేట్‌కు పంపినట్లు ఒక అధికారి తెలిపారు. 'క్రూయిజ్ డ్రగ్స్' కేసులో బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్ కొడుకు ఆర్యన్ ఖాన్‌ను ఇరికించకుండా ఉండేందుకు రూ.25 కోట్లు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సమీర్ వాంఖడేను శని, ఆదివారాల్లో సీబీఐ ప్రశ్నించింది.

కశ్మీర్లో జీ-20 సన్నాహకం షురూ

త్వరలో నూతన పర్యాటక విధానం: కిషన్‌రెడ్డి



దాల్ సరస్సులో జీ-20 ప్రతినిధుల విహారం

శ్రీనగర్: పాకిస్తాన్ పెడబొబ్బలను, చైనా అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ జమ్మూకశ్మీర్‌లో జీ–20 సన్నాహక సదస్సు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య సోమవారం మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో చైనా మినహా అన్ని సభ్య దేశాల ప్రతినిధులూ పాల్గొన్నారు. పర్యాటక రంగం తదితరాలపై వారంతా లోతుగా చర్చించనున్నారు. వారికి సంప్రదాయ రీతిలో ఘనస్వాగతం లభించింది. తొలి రోజు 'ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక పరిరక్షణకు సినీ టూరిజం' అంశంపై చర్చ జరిగింది. అనంతరం ప్రతినిధులంతా చారిత్రక దాల్ సరస్సులో బోట్ షికారు చేస్తూ కశ్మీర్ అందాలను ఆస్వాదించారు. కేంద్రం త్వరలోనే నూతన జాతీయ పర్యాటక విధానాన్ని ప్రకటిస్తుందని కేంద్ర సాంస్కృతి పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. గ్లోబల్ టూరిజం ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను కూడా నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి కశ్మీర్‌లో అద్భుతమైన అవకాశాలున్నాయని మీడియాతో చెప్పారు. పర్యాటకాభివృద్ధికి వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రం అనుమతిస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ భాగస్వామ్యం లేకుండా ప్రపంచ స్థాయికి చేరుకోలేమన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు.



దక్షిణ కొరియా రాయబారితో నాటు నాటు పాటకు స్టెప్పులేస్తున్న సినీ నటుడు రాంచరణ్

హర్తాళ్ పిలుపులు గత చరిత్ర

కశ్మీర్ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని, మునుపటి లాగా బంద్ పిలుపులకు స్పందించడం లేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. ''గతంలో కశ్మీర్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే పాక్ నుంచి వచ్చిన పిలుపుతో దుకాణాలు మూతబడేవి. ఇప్పుడు మాత్రం హర్తాళ్ చేపట్టాలంటూ ఎవరు పిలిపిచ్చినా పట్టించుకోవడం లేదు. ఉగ్రవాదం కారణంగా ఇప్పటికే రెండు తరాలు నష్టపోయిన విషయం ప్రజలు తెలుసుకున్నారు. అభివృద్ధి బాటన ముందుకు సాగాలనుకుంటున్నారు'' అని అన్నారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధికి కశ్మీర్లో ఎన్నో అవకాశాలున్నాయన్నారు.

ఎవరెస్ట్ పైకి 27 సార్లు..!

కమి రిటా షెర్పా రికార్డు సమం చేసిన పసంగ్ దవా షెర్పా



కఠ్మాండు: ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని పసంగ్ దవా షెర్పా(46) పర్వతారోహకుడు 27సార్లు అధిరోహించారు. 8,848.86 మీటర్ల ఎత్తైన ఈ హిమాలయ శిఖరాన్ని సోమవారం ఉదయం 8.25 గంటలకు ఆయన చేరుకున్నట్టు పర్వతారోహక యాత్ర నిర్వహిస్తున్న 'ఇమాజిన్ నేపాల్ ట్రెక్స్' తెలిపింది. తద్వారా కమి రిటా షెర్పా రికార్డును ఆయన సమం చేశారు. ఎవరెస్ట్ రీజియన్‌లో జన్మించిన పసంగ్ తొలిసారి 1998లో ఎవరెస్ట్‌ను అధిరోహించారు. మరోవైపు 53 ఏళ్ల కమి రిటా షెర్పా ఈ సీజన్‌లోనే ఎవరెస్ట్‌ను 28వ సారి ఎక్కి పసంగ్‌ను అధిగమించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.



సోమవారం తొలిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ప్రణామం

సాక్షి హైదరాబాద్

మంగళవారం ; 23 ; మే ; 2023

తెల్లవారుజామున.. భయపెట్టిన వాన

సాక్షి, సిటీబ్యూరో: పగటిపూట ఎండ కొట్టింది. రాత్రిపూట వాన దంచికొట్టింది. సోమవారం తెల్లవారుజామున నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన భయాందోళనకు గురి చేసింది. రాజేంద్రనగర్‌లో అత్యధికంగా 5.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. తెల్లవారుజామున కురిసిన వర్షంతో రోజంతా చల్లదనం ఉంటుందని భావించినప్పటికీ భానుడు మళ్లీ భగ్గుమన్నాడు.



సైబర్ నేరాల్లో రిక'వర్రీ'

ఇన్వెస్టిమెంట్, క్రిప్టో కరెన్సీ, పార్ట్ టైమ్ జాబ్.. ఇలా వివిధ రకాలుగా ఎర వేస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

-8లో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
37.2°	21.6°

న్యూస్‌రీల్

గూగుల్ మీట్స్‌కు మేయర్ శ్రీకారం

సాక్షి, సిటీబ్యూరో: ఎంతోకాలంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ జోనల్ కమిషనర్లతో గూగుల్‌మీట్ ద్వారా సమావేశాలు నిర్వహిస్తుండగా, ఇప్పుడిక మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం గూగుల్‌మీట్ ద్వారా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. సోమవారం గూగుల్ మీట్ నిర్వహించారు. ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టిన నాలా పనుల్ని వేగంగా పూర్తిచేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఇకనుంచి ప్రతిరోజు తన కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదులు, నాలా పనులపై గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నల్లకుంట పద్మా కాలనీలో కూలిపోయిన మూసీ నాలా రిటైనింగ్‌వాల్ పనుల్ని పదిరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు తిరిగి జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పద్మా కాలనీ, వెజిటబుల్ మార్కెట్, ఓల్డ్ రామాలయం, ఫీవర్ హాస్పిటల్‌ల నుంచి వెళ్తున్న ఈ నాలాపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పద్మా కాలనీలో జరుగుతున్న నాలా పనుల గురించి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాసరెడ్డి మేయర్‌కు వివరించారు. అకాల వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

రసూల్‌పురా: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిషాంక్, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, వైద్య మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఎండీ లక్ష్మి, డీఎస్‌ఓ సుధాకర్, సికింద్రాబాద్ ఆర్డీఓ వసంత కుమారి, ఎమ్మార్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 26 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 26 రాత్రి 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 27న ధ్వజారోహణం, శేషవాహనంపై పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవారి ఊరేగింపు, హనుమంత వాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటాయి. 28న ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు ఉంటుంది. 29న ఉదయం గజవాహనంపై, రాత్రి గరుడ వాహనంపై ఊరేగింపుతో పాటు శ్రీవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 30న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించనున్నారు. 31న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం, ధ్వజావరోహణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

'కానిస్టేబుల్ భర్త'కు కటకటాలు

బంజారాహిల్స్: వేధింపులకు గురి చేస్తున్న భర్తపై ఓ మహిళా కానిస్టేబుల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం అతడిని అరెస్టు చేశారు. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. ఎమ్మార్సీ కాలనీలో నివసించే గిరికత్తుల శిరీష బేగంపేట ఠాణాలో కానిస్టేబుల్. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ చిటికుల మోహన్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఓ బాబు. మోహన్ కొంతకాలంగా భార్య శిరీషను వేధింపులకు గురి చేస్తున్నాడు. విడాకులు ఇవ్వాలంటూ ఆమెపై ఒత్తిడి తెస్తూ తీవ్రంగా హింసించేవాడు. దీంతో ఆమె ఫిలింనగర్ ఎమ్మార్సీ కాలనీలో ఉండే తన సోదరి ఇంటికి వచ్చి ఉంటోంది. ఈ నెల 17న తెల్లవారుజామున మోహన్ ఆమె ఉంటున్న ఇంటికి వచ్చి మద్యం మత్తులో శిరీషను కొట్టడమే కాకుండా అడ్డు వచ్చిన ఆమె సోదరిని కూడా దూషిస్తూ బెదిరించాడు. విడాకులు ఇవ్వకపోతే చంపేస్తానని తనను హెచ్చరించడంతో డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు మోహన్‌ను అదుపులోకి తీసుకున్నారని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసింది. పోలీసులు మోహన్‌పై కేసు నమోదు చేశారు.



సెల్ఫీ ప్లీజ్..

మెడికల్ కళాశాలల్లో కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సోమవారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం వారితో సరదాగా ఇలా సెల్ఫీ దిగి ఆయన సందడి చేశారు.

టీఎస్‌ఎఫ్‌సీకి 18 ఎకరాలు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నంబర్ 307లోని 18 ఎకరాల భూమి హక్కుల విషయంలో రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పొరేషన్ (టీఎస్‌ఎఫ్‌సీ.. గతంలో ఏపీఎఫ్‌సీగా ఉండేది)కు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం సాక్ష్యాల సేకరణలో రిట్ కోర్టుపై నిషేధం లేనప్పటికీ.. భూ టైటిల్, స్వాధీన ప్రక్రియను నిర్ణయించే పరిధి ఆ కోర్టుకు లేదని పేర్కొంది. సివిల్ కోర్టు అధికార పరిధిలో సింగిల్ జడ్జి జోక్యం చేసుకున్నారని అభిప్రాయపడింది. 1955 రెవెన్యూ చట్టం ప్రకారం ఆ భూమి ప్రభుత్వానికి చెందిందా? లేదా? అన్నది తప్పనిసరిగా నిర్ణయించాల్సి ఉందని డివిజన్ బెంచ్ తెలిపింది. రిట్ పరిధిలేని అంశంలో సింగిల్ జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టింది. ఈ భూమిపై గతంలో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు కొట్టివేసింది. టీఎస్‌ఎఫ్‌సీకి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించడంపై అభ్యంతరం తెలిపే హక్కు ఈ కేసులోని ప్రతివాదులకు లేదంది. గాజులరామారం సర్వే నంబర్ 307లోని 18 ఎకరాల భూ వివాదంలో భాగంగా 2011లో భాస్కరరాజుతో పాటు మరొకరు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషన్లను అనుమతించారు. భాస్కరరాజుకు అనుకూలంగా తీర్పు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రిట్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున పర్సా అనంత నాగేశ్వర్‌రావు, ప్రతివాదుల తరఫున హరిశ్రీధర్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేసింది. ప్రతివాదులు తమ భూ హక్కుల కోసం సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.



ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌పై బృంద సభ్యులతో హాసికారెడ్డి, కృషి గుప్తా తదితరులు

మాస్టర్ ప్లాన్ ఇప్పట్లో లేనట్టే!

భూ వినియోగ మార్పిడి ద్వారానే జీఓ 111 పరిధిలో అనుమతులు

- కన్జర్వేషన్ జోన్ నుంచి వివిధ రకాలుగా వినియోగంలోకి..
- ఎన్నికల అనంతరమే బృహత్తర ప్రణాళికపై కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: జీఓ 111 పరిధిలో ఎలాంటి మాస్టర్‌ప్లాన్ లేకుండానే భూ వినియోగ మార్పిడికి ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే అనుమతులను ఇవ్వనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 111 జీఓ పరిధిలోని 84 గ్రామాలకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందించే అవకాశం లేదు. ప్రస్తుతం బయో కన్జర్వేషన్ జోన్‌లోని భూములను చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ (సీఎల్‌యూ) కింద వివిధ రకాలుగా వినియోగంలోకి అనుమతులను ఇస్తారు. ప్రభుత్వ అనుమతితో భూ యజమానులు తమ భూమిని పారిశ్రామిక, నివాస, వాణిజ్య, వ్యాపార అవసరాల కోసం మార్చుకోవచ్చు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలోని వ్యవసాయ భూములను, నాలా భూములను ప్రత్యేక కమిటీ ద్వారా చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ ద్వారా నివాసయోగ్యమైన స్థలాలుగా మార్పు చేస్తున్నట్లుగానే జీఓ 111 పరిధిలోని బయో కన్జర్వేషన్ భూములను కూడా మార్చుకొనేందుకు సదుపాయం ఉంటుందని ఒక అధికారి వివరించారు. ప్రస్తుతం జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలను అనుమతించడం లేదు. బఫర్ జోన్ పరిధిని ఎంత వరకు అనుమతించాలనే అంశంపై మాత్రం స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు.



ముంచుకొస్తున్న ఎన్నికలు..

- మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు పెద్ద ఎత్తున కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల సంస్థల నుంచి టెండర్ల ఆహ్వానించడం మొదలుకొని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేవరకు కనీసం18 నెలల సమయం పడుతుంది. ఈ ప్రక్రియలో ఏ మాత్రం జాప్యం జరిగినా 2 సంవత్సరాలు కూడా దాటవచ్చు. మరి కొద్ది నెలల్లో ఎన్నికలు తరుముకొస్తున్న దృష్ట్యా ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండానే భూముల బదలాయింపునకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన జీఓ 168 ప్రకారం సీఎల్‌యూ అందజేయనున్నారు. మంత్రి కేటీఆర్ నేతృత్వంలో హెచ్‌ఎండీఏ కమిషనర్ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ ఆమోదంతో భూమిని మార్పు చేస్తారు.
- మరోవైపు జీఓ 111 పరిధిలోని శంషాబాద్, మొయినాబాద్, గండిపేట, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, కొత్తూరు మండలాల పరిధిలోని 84 గ్రామాల్లో ఉన్న 1.32 లక్షల ఎకరాల భూములలో ఇప్పటికే సుమారు 70 శాతం భూములు సినీ, రాజకీయ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఆయా వర్గాలకు చెందిన భూయజమానులు తమ అవసరాలకు అనుగుణంగా సీఎల్‌యూ తీసుకొనే అవకాశం ఉంది. భూ వినియోగ మార్పిడికి అనుమతిచ్చే క్రమంలో జల వనరులు, అడవులు, కొండలు, గుట్టలు, నాలాలు వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని వెసులుబాటు కల్పించనున్నట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఎన్నికల తర్వాతే ఒకే నగరం–ఒకే ప్రణాళిక..

- ప్రస్తుతం హైదరాబాద్ మహానగరం మొత్తం 5 మాస్టర్‌ప్లాన్లతో కూడి ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్), సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ), హైదరాబాద్ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఏడీఏ), ఓఆర్‌ఆర్ మాస్టర్‌ప్లాన్లతో పాటు 2013లో హెచ్‌ఎండీఏ రూపొందించిన 2030–31 మాస్టర్ ప్లాన్ కూడా అమల్లో ఉంది. ఈ అయిదు ప్రణాళికల మధ్య సమన్వయం లేకపోవడంతో అనేక రకాలుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- అన్నింటిని కలిసి ఒకే బృహత్తర ప్రణాళికను రూపొందించేందుకు ప్రభుత్వం గతంలోనే కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలోనే గతేడాది జీఓ 111 తొలగించనున్నట్లు ప్రకటించిన అనంతరం 'ఒకే నగరం–ఒకే ప్రణాళిక' లక్ష్యంతో బృహత్తర ప్రణాళిక కోసం చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. ఈ కమిటీ ఒకసారి సమావేశమైంది. కానీ ముందుకు వెళ్లలేదు. ఒకే నగరం – ఒకే ప్రణాళిక లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం చర్యలు చేపట్టింది. ఎన్నికల తర్వాత ఈ ప్రతిపాదనను తిరిగి ముందుకు తెచ్చే అవకాశం ఉంది.

సాహోరే టీనేజర్!

ఆత్మవిశ్వాసమే ఆలంబనగా..

- శిఖరాగ్రంపై సిటీ యువ పతాక
- ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌పైకి చేర్చిన అభిరుచి

సాక్షి, సిటీబ్యూరో: సరదా అభిరుచి వారిని గుట్ట లెక్కించింది. సీరియస్ వ్యాపకంగా మారి సుదూరాల్లోని శిఖరాల్ని అధిరోహింపజేసింది. నగరానికి చెందిన ముగ్గురు టీనేజర్లు ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేసుకున్నారు. తమ బృందంతో కలిసి ప్రస్తుతం తిరుగు ప్రయాణంలో ఉన్న వీరు మరో 2 రోజుల్లో నగరానికి చేరుకోనున్నారు. నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న హాసికారెడ్డి (15), ప్రస్తుతం ఐఐటీ జేఈఈకి ప్రిపేరవుతోంది. ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో చదువుతున్న సృజన్ తిమ్మిరెడ్డి సాట్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఫిట్ జీలో 12వ తరగతి చదువుతున్న కృషి గుప్తా (16).. ఐఐటీ జేఈఈకి ప్రిపేర్ అవుతోంది. వ్యక్తిగతంగా వీరికి తమ కెరీర్ లక్ష్యాలు వేరైనా.. అభిరుచులు కలిశాయి. విభిన్న రకాల హాబీలతో పాటు చదువులోనూ రాణిస్తున్న వీరంతా.. కొన్ని నెలలుగా ట్రెక్కింగ్ పట్ల ఆసక్తి పెంచుకుని ఫ్రెండ్స్‌గా మారారు. నగరం చుట్టుపక్కల ఉన్న కొండల్ని గుట్టల్ని ఎక్కడం అలవాటు చేసుకున్నారు. ఆ క్రమంలోనే వీరికి మరికొందరు పెద్దలూ జత కలిశారు. వయసులకు అతీతంగా ఆటపాటలతో పాటు అడ్వెంచర్ ట్రెక్స్‌ని ఆస్వాదిస్తున్నారు.

వైనాట్ ఎవరెస్ట్?

చిన్నా చితకా కొండలు గుట్టలు ఏల? కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలనే ఆలోచన ఈ బృందానికి వచ్చింది. అదే ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేయాలని. ఒక్కసారి అత్యంత ఎత్తయిన శిఖరారోహణకు ప్రాథమిక దశను పూర్తి చేస్తే.. ఇక అది ఇచ్చే ఆత్మవిశ్వాసం జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన సత్తా ఇస్తుందని భావించారు. అందరూ కలిసి చర్చించుకున్నారు. మిగిలిన అందరూ వయసులో పెద్దవాళ్లు కాబట్టి పర్లేదు కానీ టీనేజర్లయిన ముగ్గురి విషయంలో కాస్త చర్చ జరిగింది. తాము సైతం అని ముగ్గురూ కృత నిశ్చయం వ్యక్తం చేయడం, ముగ్గురి తండ్రులూ బృందంలో ఉండడంతో గత కొన్ని రోజుల పాటు తమకు తాముగానే సాధన చేసి వీరంతా సిద్ధమయ్యారు.



జాతీయ జెండాతో..

వేల కి.మీ ఎత్తులో...

ఈ నెల 13న వీరంతా నగరాన్ని వదిలి లక్ష్యసాధన దిశగా పయనమయ్యారు. నేపాల్ చేరుకుని అక్కడి గైడ్స్ సహకారంతో.. పూర్తి సన్నద్ధతతో ముందడుగు వేశారు. ఎవరెస్ట్ పర్వతారోహణలో ప్రాథమిక దశ అయిన బేస్ క్యాంప్ పూర్తి చేయడం కోసం వీరు ఎక్కాల్సింది 5364 మీటర్ల ఎత్తులో ఉన్న పర్వతం.. సుమారు 65 కి.మీల ఎత్తు పల్లాలతో శిఖరాల మీదుగా నడక ఉంటుంది. ఇందులో భాగంగా 8 రోజుల పాటు సాగిన వీరి సాహస యాత్ర చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు, అవాంతరాలు తప్ప మరే అడ్డంకులూ లేకుండా గత ఆదివారం ముగిసింది. మరో 2 రోజుల్లో ఈ బృందం నగరానికి చేరుకోనుంది. నిర్విరామంగా.. 0– 9 డిగ్రీల ఉష్ణోగ్రతలో.. 3.5 కి.మీ మేర మంచు దుప్పట్లో 12 గంటల పాటు శిఖరాలపై నడవాల్సి రావడంతో చివరలో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చాయని, చెప్పుకోదగ్గ ఇబ్బందులేవీ ఎదురుకాలేదని బృందంలో సభ్యుడైన ప్రశాంత్‌రెడ్డి 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. కొంత కష్టతరమైనప్పటికీ ఈ తరహా సాహసాలతో టీనేజర్లకు ఒనగూరే ఆత్మవిశ్వాసం విలువ లెక్కకట్టలేనిదని ఆయన చెప్పారు.

రూ. 20 కోట్లు! తొమ్మిదేళ్లు..



నిందితుడు మీర్జా ఖదీర్ బేగ్

మోసగాడు ఖదీర్ బేగ్ కొల్లగొట్టిన మొత్తం ఇది

- వివిధ వెబ్‌సైట్ల నుంచి ఫోన్ నంబర్లు సంగ్రహణ
- కాల్ సెంటర్ ఏర్పాటు చేసి రుణాలిస్తామని ఫోన్లు
- రెండుసార్లు పీడీ యాక్ట్ ప్రయోగించినా అదే పంథా

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్ సంస్థల నుంచి రుణాలు ఇప్పిస్తామంటూ ఎర వేసి 90 రోజుల గడువు నిర్దేశించుకుని ప్రాసెసింగ్ ఫీజు పేరుతో అందినకాడికి దండుకుంటూ అనేక మందిని మోసం చేసిన మీర్జా ఖదీర్ బేగ్ అలియాస్ సమర్ వ్యవహారంలో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇతగాడు గడిచిన తొమ్మిదేళ్లల్లో పలువురు బాధితుల నుంచి రూ.20 కోట్ల మేర కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘరానా మోసగాడిని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్న విషయం విదితమే. ఇతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించారు.

చదివింది పదో తరగతి..

వరంగల్‌లోని న్యూ రాయపురకు చెందిన ఖదీర్ బేగ్ పదో తరగతి చదువుకున్నాడు. 2015 నుంచి అనేక ప్రాంతాల్లో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు ఏర్పాటు చేశాడు. గూగుల్‌లో ఉన్న అనేక ప్రైవేట్ ఫైనాన్స్ గ్రూపుల్లో చేరతాడు. సిబిల్ స్కోర్ సరిగా లేని రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, బులియన్, కమోడిటీస్ వ్యాపారులకు బ్యాంకులు, ప్రముఖ సంస్థల నుంచి రుణాలు రావడం దాదాపు అసాధ్యం. ఇలాంటి గ్రూపులు ప్రైవేట్ ఫైనాన్సియర్లపై ఆధారపడుతుంటాయి. ఆయా గ్రూపుల్లో ఉండే వ్యాపారుల నంబర్లు సంగ్రహించే ఖదీర్ బేగ్ తన సంస్థలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌లోని యువతులతో కాల్స్ చేయిస్తాడు.

ముందే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని...

స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలపై తక్కువ వడ్డీకి ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణం ఇప్పిస్తామంటూ టెలీ కాలర్లు నమ్మబలుకుతారు. ఆసక్తి చూపిన వారిని తమ కార్యాలయాలకు ఆహ్వానిస్తారు. అలా వచ్చిన వారితో మాట్లాడే ఖదీర్ బేగ్ ఎంత రుణమైనా ఏర్పాటు చేస్తామని, ప్రాసెసింగ్ ఫీజుగా 3.5 శాతం ముందే చెల్లించాలని చెబుతాడు. ఈ మొత్తం చెల్లించిన నాడు మొదలు 90 నుంచి 120 రోజుల్లో రుణం మంజూరవుతుందని నమ్మిస్తాడు. నిర్ణీత గడువు పూర్తయినా రుణం రాక, అప్పటికే ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన వారిలో ఎవరైనా తమ డబ్బు తిరిగి ఇవ్వమని తీవ్రంగా ఒత్తిడి చేస్తే మరొకరు ఇచ్చిన మొత్తం నుంచి వారికి తిరిగి చెల్లిస్తాడు. వాళ్లు ఇచ్చిన దాంట్లో రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు తగ్గించి ఇచ్చి ఆ మొత్తం ఖర్చయిందని తప్పించుకుంటాడు.

21 కేసులు.. రెండుసార్లు పీడీ యాక్ట్...

ఇతగాడిపై తొలిసారిగా 2015లో జూబ్లీహిల్స్ పోలీసులు 9 కేసులు నమోదు చేశారు. ఆపై గచ్చిబౌలి అధికారులు 12 కేసులు పెట్టారు. భార్య ఫిర్యాదుతో మహిళా ఠాణాలో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఇలా మొత్తం 21 కేసుల్లో నిందితుడిగా మారాడు. 2016లో గచ్చిబౌలి అధికారులు పీడీ యాక్ట్ పెట్టారు. జైలు నుంచి బయటకు వచ్చాక ముంబై వెళ్లి ఓ యాడ్స్ కంపెనీలో షూటింగ్ అసిస్టెంట్‌గా చేరాడు. 2019లో నగరానికి వచ్చి మరో కార్యాలయం తెరిచి మళ్లీ మోసాలు ప్రారంభించారు. ఈసారి అరెస్టు చేసిన పోలీసులు మరోసారి పీడీ యాక్ట్ ప్రయోగించారు. 2022 డిసెంబర్‌లో జైలు నుంచి బయటకు వచ్చిన ఖదీర్ ఢిల్లీ వెళ్లి వివిధ వ్యాపారాల తీరును పరిశీలించి వచ్చాడు.

ఎన్‌బీడబ్ల్యూలు ఉన్నాయని ఆరా తీయగా...

ఈ ఏడాది ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన ఖదీర్ బేగ్ ఏప్రిల్ 25న బంజారాహిల్స్‌లో కీ లెండర్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేసి మళ్లీ దందా మొదలెట్టాడు. 2015 నుంచి ఇప్పటి వరకు ఇతగాడు మొత్తం రూ.20 కోట్ల వరకు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బెయిల్‌పై వచ్చి, కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో ఖదీర్ బేగ్‌పై నగరంలో కొన్ని నాన్‌–బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) జారీ అయ్యాయి. ఈ విషయం తెలిసిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇతడి ఆచూకీ కోసం ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే కీ లెండర్స్ కార్యాయలం ఏర్పాటు, మళ్లీ మోసాలు ప్రారంభించడం వెలుగులోకి వచ్చాయి. దీంతో ఖదీర్ బేగ్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్‌ఎంసీ పథకాలపై అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో: బల్దియాలో అమలవుతున్న వివిధ పథకాలను గురించి అధ్యయనం చేయడానికి వచ్చిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న పథకాల గురించి రెండు రోజుల అధ్యయనం కోసం సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. తొలిరోజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకోగా, రెండో రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా కార్యక్రమాల గురించి తెలుసుకోనున్నారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, జీవవైవిధ్యం, హరితహారం, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఐటీ, రెవెన్యూ, ట్యాక్స్, స్పోర్ట్స్, ఎస్సార్‌డీపీ, సీఆర్‌ఎంపీ, టౌన్‌ప్లానింగ్, టీడీఆర్, ఈవీడీఎంల గురించి ఆయా విభాగాల ఉన్నతాధికారులు వివరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్లు లేవనెత్తిన పలు సందేహాలను కమిషనర్ లోకేశ్‌కుమార్ నివృత్తి చేశారు. జీహెచ్‌ఎంసీకి వచ్చిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల్లో రాధికా గుప్తా, పి.శ్రీజ, ఫైజాన్ అహ్మద్, పి.గౌతమి, పర్మర్ పింకేష్ కుమార్, లలిత్ కుమార్, లెనిన్ వత్సల్ తదితరులు ఉన్నారు.



పథకాలపై ఐఏఎస్‌లకు వివరిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



గోవింద్‌రాఠి, సుష్మితలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్. చిత్రంలో ఎంపీ లక్ష్మణ్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ పథకాలకు ఆకర్షితులై అన్నివర్గాల వారు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. పలు పార్టీల వారు సైతం బీజేపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. సోమవారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన గోవింద్‌రాఠి, మనోజ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు బండిసంజయ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కొన్ని సంవత్సరాల పాటు బీఆర్ఎస్‌లో ఉన్న గోవింద్‌రాఠి, మనోజ్‌కుమార్ బీఆర్ఎస్‌కు ఇటీవల రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. బీఆర్ఎస్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

బీజేపీలో చేరిన సుష్మిత

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర్రావు కుమార్తె సుష్మిత బీజేపీలో చేరారు. సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆమెకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్, సునీల్ బన్సల్ సమక్షంలో పలువురు నగర కీలక నేతలతో కలిసి ఆమె బీజేపీలో చేరారు. గతంలో సికింద్రాబాద్ గణపతి దేవాలయ చైర్మన్‌గా పనిచేసిన ఆమె, బీజేపీ సీనియర్ నేత వివేక్ వెంకటస్వామి మేనకోడలు. రాబోయే ఎన్నికల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా బరిలో నిలిచేందుకే ఆమె బీజేపీలో చేరినట్లు స్థానిక నేతలు చెబుతున్నారు.

పనుల్లో జాప్యం..ప్రయాణం నరకప్రాయం



హిమాయత్‌నగర్ పరిధిలోని 'మినర్వా కాఫీ షాప్-తెలుగు అకాడమీ' రూట్‌లో రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ 50 రోజుల క్రితం రూ.56 లక్షల వ్యయంతో 220 మీటర్ల రోడ్డు నిర్మాణానికి జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. రోడ్డు నిర్మాణం చేస్తున్న సమాచారాన్ని జలమండలికి తెలపకుండా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ రోడ్డు తవ్వకాలు చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా 20 మీటర్ల పాటు మంచినీటి పైప్‌లైన్ ధ్వంసమైంది. దాదాపు 10కి పైగా సివరేజ్ మ్యాన్‌హోల్స్ దెబ్బతిన్నాయి. దీంతో మినర్వా నుంచి కేక్ బ్యాంక్ వరకు రోడ్డు మంచినీరు, మురుగు నీరుతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఓ పక్క వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు, మరో పక్క స్థానిక అపార్ట్‌మెంట్‌వాసులు తమ వాహనాల్ని బయటకు తెచ్చేందుకు వీలు లేక తీవ్ర అవస్థల పాలవుతున్నారు. ఇంతజరుగుతున్నా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం మొద్దు నిద్ర వీడట్లేదు. అరకొర పనులు జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

\- హిమాయత్‌నగర్



తవ్వి వదిలేసిన రోడ్డు

క్లుప్తంగా

దురాచారాల నిర్మూలనకు కృషి చేసిన భాగ్యరెడ్డివర్మ



సాక్షి, సిటీబ్యూరో: ఎంవీ భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ లోకేశ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంటరాని కులాల ఉద్ధరణ, దేవదాసి, జోగిని వంటి దురాచారాల నిర్మూలనకు భాగ్యరెడ్డివర్మ విశేష కృషి చేశారన్నారు. హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలు స్థాపించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు ప్రియాంక, వి.కృష్ణ, సరోజ, విజయలక్ష్మి, జయరాజ్ కెన్నెడీ, పంకజ, సీఎంఓహెచ్ డాక్టర్ పద్మజ, హెచ్ఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ సరోజదేవి, చీఫ్ అకౌంట్స్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, ఏఎంసీ రమణ, జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూలకుండీల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

హస్తినాపురం: ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పూల మొక్కలతో కలిపి గంజాయి మొక్కలను పెంచుతున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జలేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సాహెబ్‌నగర్ పరిధిలోని వినూత్న ఎన్‌క్లేవ్ కాలనీలో గంజాయి మొక్కలు పెంచుతున్నారన్న పక్కా సమాచారం అందడంతో సోమవారం తన సిబ్బందితో దాడిచేశారు. ఏపీలోని వెస్ట్ గోదావరికి చెందిన పంచమట్ల సాయిరేవంత్ వర్మ తన నివాసంలో పూలమొక్కలతోపాటు 10 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించారు. ఇతను ఆంధ్రా నుండి గంజాయి విత్తనాలను తీసుకువచ్చి పూలమొక్కలతో పాటు పెంచుకుంటున్నారని తెలుసుకున్నారు. పది గంజాయి మొక్కలతో పాటు 300 గ్రాముల గంజాయి విత్తనాలను స్వాధీనం చేసుకుని సాయి రేవంత్‌వర్మను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌పై కేసు నమోదు

ఫేక్ 'ఫైర్ ఎన్‌ఓసీ' సమర్పించారని గుర్తింపు

హిమాయత్‌నగర్: ఫేక్ 'ఫైర్‌ఎన్‌ఓసీ' సబ్‌మిట్ వ్యవహారంలో బషీర్‌బాగ్‌లోని 'అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్' విద్యాసంస్థపై ఇంటర్మీడియేట్ బోర్డు, అగ్నిమాపక శాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ఎన్‌ఓసీని సబ్‌మిట్ చేసి ఇటు ఇంటర్ బోర్డును అటు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డిని చీట్ చేయడంతో కళాశాల మేనేజ్‌మెంట్‌పై ఐపీసీలోని 420, 406, 468, 471 సెక్షన్ల కింద నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బషీర్‌బాగ్‌లోని 'అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్' విద్యాసంస్థకు 'ఫైర్ ఎన్‌ఓసీ' ఉందంటూ గత ఏడాది నవంబర్‌లో ఇంటర్ బోర్డుకు ఎన్‌ఓసీ నెంబర్: 455870002022 తో లెటర్ సబ్‌మిట్ చేశారు. ఈ సబ్‌మిషన్‌లో సందేహాన్ని వ్యక్తం చేసిన బోర్డు ఎన్‌ఓసీ నెంబర్ నిజమా కాదా అనేది తేల్చాలంటూ అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డిని రాతపూర్వకంగా కోరారు. సంబంధిత కాలేజీకి ఫైర్ ఎన్‌ఓసీ తానేమీ ఇవ్వలేదని, మీరు ఇచ్చిన నెంబర్ తప్పు అంటూ డీజీ వై.నాగిరెడ్డి బోర్డుకు సమాధానం ఇచ్చారు. దీంతో కాలేజీలో తనిఖీలు చేపట్టిన ముషీరాబాద్ ఫైర్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్ ఫేక్ ఎన్‌ఓసీ ఇచ్చినట్లు డీజీ వై.నాగిరెడ్డికి రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేయాలని నాగిరెడ్డి ఎస్‌హెచ్‌ఓను కోరడంతో.. ఆయన రెండు రోజుల క్రితం నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాలేజ్ మేనేజ్‌మెంట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'మాస్క్' షిప్‌యార్డ్‌లో ఉద్యోగాలంటూ గాలం

నిరుద్యోగుల నుంచి రూ.65 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ప్రముఖ షిప్పింగ్ కంపెనీ 'మాస్క్'లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నగర వాసులకు టోకరా వేశారు సైబర్ నేరగాళ్లు. తమ కంపెనీకి చెందిన పలు దేశాల్లో డాక్యుమెంట్ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించుకుంటామని చెప్పి 13 మంది నుంచి అందినకాడికి దోచుకుని మోసానికి పాల్పడ్డారు. దీంతో బాధితులంతా సోమవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కాచిగూడలో నివాసం ఉండే ప్రశాంత్ హ్యూమన్‌రైట్స్ విభాగంలో పనిచేస్తున్నారు. ఇతనికి ఇటీవల అభిరామ్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఇతను 'మాస్క్' షిప్పింగ్ కంపెనీకి చెందిన వాడిగా చెప్పుకుంటూ ఉద్యోగాలు ఇస్తానన్నాడు. సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, మాల్దీవ్స్ తదితర ప్రాంతాల్లో తమకు 'డాక్యుమెంట్ ఎక్స్‌పర్ట్స్' కావాలన్నాడు. జీతం రూ.5 లక్షలు ఇస్తామన్నారు. ఇలా చెబుతూ రెండు రోజుల తర్వాత సింగపూర్‌కు షిప్ వచ్చిందని, 20 మంది కావాలంటూ ప్రశాంత్‌ను కోరాడు. ఈ మాటలన్నీ నమ్మిన ప్రశాంత్ మరో 12 మందిని జత కలుపుకున్నాడు. వీరందర్ని నుంచి రూ.5 లక్షల చొప్పున రూ.65 లక్షలు వసూలు చేశాడు. ఈ డబ్బు పాస్‌పోర్టు, వీసా, ఇన్సూరెన్స్ తదితర అవసరాల కోసమన్నాడు. డబ్బు తీసుకుని పదిహేను రోజులు గడిచినా అభిరామ్ నుంచి ఏవిధమైన స్పందన లేదు. దీంతో అనుమానం వచ్చి ఎంక్వైరీ చేయగా.. అభిరామ్ అనే వ్యక్తి తమ కంపెనీలో ఎవరూ లేరని 'మాస్క్' కంపెనీ తెలిపింది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ 13 మంది బాధితులు సైబర్ క్రైంను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

అపార్ట్‌మెంట్‌లో సినీ నటి దురుసు ప్రవర్తన

కేసు నమోదు



పోలీసుల విచారణకు వచ్చిన సినీ నటి డింపుల్ హయతి

బంజారాహిల్స్: ఐపీఎస్ అధికారి అధికారిక కారును కాలితో తన్నడమే కాకుండా తన బెంజికారుతో రివర్స్‌లో వచ్చి ఢీకొట్టి దుర్భాషలాడిన ఘటనలో సినీ నటిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్ హుడా ఎన్‌క్లేవ్ జర్నలిస్టు కాలనీలోని ఎస్‌కేఆర్ అపార్ట్‌మెంట్స్‌లో ఓ ఐపీఎస్ అధికారి ఫ్లాట్‌లో అద్దెకుంటున్నారు. ఇదే అపార్ట్‌మెంట్స్‌లో సినీ నటి డింపుల్ హయతి కూడా అద్దెకుంటున్నారు. ట్రాఫిక్ విభాగంలో డీసీపీగా పని చేస్తున్న ఐపీఎస్ అధికారి అధికారిక వాహనాన్ని (టీఎస్ 09 పీఏ 1744) అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేశారు. అయితే సదరు నటి డింపుల్ ఈ వాహనాన్ని తరచూ కాలితో తన్నడమే కాకుండా తన కాబోయే భర్త డేవిడ్‌తో కలిసి బెంజి కారు (ఏపీ 09 సీఎల్ 0827)తో రివర్స్ తీసుకొచ్చి డ్యామేజీ చేస్తున్నట్లు గుర్తించిన కారు డ్రైవర్ ఇదేమిటని పలుమార్లు ప్రశ్నించారు. మీ సార్ ఐపీఎస్ అధికారి అయితే మేం భయపడాలా అంటూ అర్థం పర్థం లేకుండా మాట్లాడటమే కాకుండా పోలీసులను కించపరిచే విధంగా ప్రవర్తిస్తున్నది. ఈ కారుకు భద్రతగా ఏర్పాటు చేసిన కోన్స్‌ను కూడా ఆమె పీకిపడేసేది. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగడం, గన్‌మెన్లను బెదిరించడం నిత్యకృత్యంగా పెట్టుకుంది. ఏనాడూ సదరు అధికారి ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు. గన్‌మెన్లు, డ్రైవర్ నచ్చజెప్పేందుకు చూసినా ఆమె వినిపించుకోకపోగా ఆగడాలు రోజురోజుకు శృతిమించాయి. దీంతో అధికారి డ్రైవర్ చేతన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు డింపుల్‌పై ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనలో ఐపీసీ సెక్షన్ 353, 341, 279 కింద కేసు నమోదు చేసి సోమవారం విచారణకు పిలిపించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that, our client, **Smt Balbir Kaur Khanuja D/o Sardar Gurbux Singh, W/o Sardar Satpal Singh Khanuja** aged 62 years, Occ: House Wife, R/o 3-6-69/4/1/D, Basheerbagh, Hyderabad-500029 **has entered into an Agreement of Sale Dated 12-04-2023, with Sri Burra Satya Prakash Rao S/o Sri B.S.R. Vasishtu, aged 60 Years, (2) Smt Burra Rama Sundari W/o Sri R.S Prakash Rao & D/o Vayuvegula Satyanarayana Murthy, aged 53 years, Both Occ: Business,** R/o B-16, D.No16-2-751/99, SBH Colony, Saidabad, Hyderabad-59, (Vendors) in connection with sale of Schedule Property i.e., **Municipal No. 16-11-762/1 to 15, Shop No.1, Ground Floor, above Parking Level, Moosarambagh, Dilsukhnagar, Hyderabad, admeasuring 1684 sft with UDS Land of 49 syds out of 860 Square Yards,** which was purchased by the vendors vide Regd Sale Deed No. 862/2008 dated 08-02-2008 Registered at SRO Azampura, Hyderabad and substantial amounts were paid towards consideration. Any person/s, having any right, title or interest over the scheduled property, may file their written objections with the documentary evidence to the undersigned within **Seven days** from today otherwise, it will be construed that, there are no objections and the Registration of the said property will be completed and any objections received subsequently will not be entertained and stand waived.

Sd/-T.SRINIVSA MURTHY, Advocate,
D.No.3-5-1107/5&6, 4th Floor,
Narayanguda, Hyderabad.
Phone: 9396549089 / 040-24757042

కత్తులతో బెదిరించి..

- వ్యక్తి కిడ్నాప్
- స్థానికుల అప్రమత్తతతో చిక్కిన దుండగులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

శంకర్‌పల్లి: ప్రజల చొరవతో ఓ వ్యక్తి కిడ్నాప్ నుంచి బయట పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని జనవాడ గ్రామ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, చర్యాల గ్రామానికి చెందిన సాయికుమార్, అతని స్నేహితుడు నాగరాజు ఉదయం శంకర్‌పల్లిలోని డీఎంఆర్ గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. సాయంత్రం వారు బైక్‌పై ఊరికి వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. తాము ఫైనాన్స్ వారమని సాయికుమార్‌ను బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని వెళ్లారు. 15కిలో మీటర్ల దూరంలోని జనవాడ చౌరస్తా వద్దకు రాగానే సాయికుమార్ అక్కడి జనాన్ని చూసి బైక్ నుంచి దూకేందుకు యత్నించాడు. దీంతో నిందితులు బైక్ ఆపి సాయికుమార్‌ను కత్తులతో బెదిరించారు. బలవంతంగా బైక్‌పై ఎక్కించేందుకు ప్రయత్నించారు. గమనించిన చుట్టుపక్కల ప్రజలు, జనవాడ వాసులు కిడ్నాపర్లను అడ్డుకునేందుకు యత్నించారు. జనంపై కూడా కత్తులతో దాడికి తెగబడ్డారు. గమనించిన స్థానికులు నిందితులను పట్టుకుని చితక బాదారు. శంకర్‌పల్లి, నార్సింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బాధితులు సాయికుమార్, నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్డీకాపూల్‌కు హైదరాబాద్ కలెక్టరేట్

ముందుగా ఫైళ్ల తరలింపు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను నాంపల్లి నుంచి లక్డీకాపూల్‌కు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం లక్డీకపూల్‌లోని రంగారెడ్డి జిల్లా పాత కలెక్టరేట్ భవన సముదాయంలోకి ఫైళ్లను తరలించారు. ఆయా విభాగాలకు చెందిన వందలాది ఫైళ్లను మొదట మూటలు కట్టి డీసీఎంలలో తరలించారు. మంగళ, బుధవారాల్లో కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని పూర్తి స్థాయిలో తరలించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. నగర శివారులోని కొంగరకలాన్‌లో ఇటీవల నిర్మించిన నూతన సమీకృత భవన సముదాయంలోకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను తరలించిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ తరలింపునకు మార్గం సుగమమైంది. ఇక నాంపల్లిలోని భవన సముదాయంలో పోలీసు సౌత్ వెస్ట్ జోన్ ఆఫీసు ఏర్పాటు చేయనున్నారు. కాగా కలెక్టరేట్ తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఆదేశాలు జారీ అవడంతోనే హుటాహుటిన చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.



డీసీఎం వాహనంలో ఫైళ్లను తరలిస్తున్న దృశ్యం

మిత్రులకు వీడియో కాల్ చేసి.. ఉరేసుకుంటున్న దృశ్యాలు చూపించి..

యువకుడి ఆత్మహత్య

సనత్‌నగర్: ఓ యువకుడు తాను ఉరి వేసుకుంటున్న దృశ్యాన్ని తన మిత్రులకు వీడియో కాల్ ద్వారా చూపించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ గోఖలేనగర్‌కు చెందిన టి.సాంబరాజు (22) సికింద్రాబాద్‌లోని ఓ జ్యువెలరీ షాపులో పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా ఉదయం 11 గంటలకు షాపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. అయితే సాంబరాజు 12 గంటల ప్రాంతంలో బేగంపేటలోని ఓ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నాడు. బ్యాగ్‌లో తన వెంట తెచ్చుకున్న చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఉరి వేసుకుంటున్న సమయంలో మిత్రులకు వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అంతటితో ఆగకుండా ఉరి వేసుకున్న దృశ్యాన్ని కూడా మిత్రులకు చూపించి మరీ ఆత్మహత్యకు పాల్పడడం వారిని కలిచివేసింది. వెంటనే అప్రమత్తమైన స్నేహితులు ఫోన్‌లోని లొకేషన్ ఆధారంగా సదరు హోటల్‌కు చేరుకుని సాంబరాజు బస చేసిన గది తలుపు గడియ పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో బేగంపేట పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సాంబరాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆత్మహత్యకు కారణం ప్రేమ వ్యవహారమే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఏడు నెలల కుమార్తె మృతిపై తండ్రి అనుమానాలు..

- భార్యపైనే అనుమానం ఉందని ఫిర్యాదు
- ఖననం చేసిన 15 రోజుల తరువాత సమాధి నుంచి తవ్వి తీసి పోస్టుమార్టం
- కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు

సనత్‌నగర్: ఏడు నెలల పసికందు మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు చిన్నారి మృతదేహాన్ని సమాధి నుంచి వెలికితీసి పోస్టుమార్టం జరిపించారు. తనతో గొడవపడి తన బిడ్డను తీసుకువెళ్లిన తన భార్య పైనే అనుమానం ఉందని, విచారణ జరపాల్సిందిగా భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురా ప్రాంతంలోని పోలీస్‌లైన్‌లో నివాసం ఉండే భవానీ ప్రసాద్, పావని దంపతులకు నలుగురు సంతానం. అయితే భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడి విడిపోయేవరకు వచ్చింది. ఈ క్రమంలో ఏడు నెలల వయసున్న చిన్న కుమార్తె వర్షికను తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చిన పావని స్థానికంగా అన్నానగర్‌లో గదిని అద్దెకు తీసుకుని వేరుగా ఉంటోంది. ఈ నెల ఏడో తేదీన చిన్నారి వర్షిక మృతి చెందడంతో ముషీరాబాద్ ప్రాంతంలోని పార్శిగుట్ట శ్మశానవాటికలో ఖననం చేశారు. అయితే ఈ విషయం భర్త భవానీప్రసాద్‌కు ఆలస్యంగా తెలిసింది. తన చిన్న కూతురు వర్షిక మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ బేగంపేట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని 15 రోజుల తరువాత సమాధి నుంచి తవ్వి బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

'మాసబ్'ను కబ్జా కానివ్వం



మాసబ్ చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రంగారెడ్డి, నాయకులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువును కాపాడే ప్రయత్నంలో జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మాసబ్ చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకులతో కలిసి సోమవారం చెరువులో మట్టి డంప్ చేస్తున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మాసబ్ చెరువు విషయమై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఎవరిని ప్రశ్నించినా ఇందులో ఇన్‌వాల్వ్ కావద్దని కలెక్టర్ హరీష్ చెప్పినట్లు చెబుతున్నారని.. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు భూ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారంటూ ఆరోపించారు. కళ్లముందే చెరువు కబ్జా అవుతున్నా పట్టించుకోని అధికారులు ఉండి ఏం లాభమన్నారు. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని.. అప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడటంతో పాటు మట్టిని డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోర్టు ఉత్తర్వులను అడ్డం పెట్టుకుని చేపడుతున్నటువంటి నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్, రవీందర్‌రెడ్డి, మల్లేష్, శివలింగం గౌడ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేష్, బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు వద్దిగళ్ల బాబు, టీడీపీ అధ్యక్షులు వీరేశం, బీఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, దర్శన్, మహేందర్ రెడ్డి, గుత్తా మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రూ. 2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

వెంగళరావునగర్: డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో త్వరలో రూ. 2 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ వెల్లడించారు. యూసుఫ్‌గూడ సర్కిల్–19 వార్డు కార్యాలయంలో సోమవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులను కలిశారు. ఇందులో భాగంగా ఎగ్జిక్యూటివ్ అధికారి రాజ్‌కుమార్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎమ్మెల్యే ఫండ్ నుంచి రూ. 10 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ క్రమంలో వెంగళరావునగర్ డివిజన్‌కు రూ. 2 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు. ఆ నిధులతో రోడ్లు, పార్కులు, డ్రైనేజీ సిమెంట్ బాక్స్‌లు, కమ్యూనిటీ హాల్స్, వైకుంఠ ధామం తదితర పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి


పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్

హిమాయత్‌నగర్: పార్కులో మెరుగైన వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మిని స్థానిక ఆయిల్‌సీడ్ కాలనీవాసులు కోరారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఆయిల్‌సీడ్ కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. అక్కడి పార్క్‌లో కనీస సౌకర్యాలు అందుబాటులో లేనందున ఆధునిక వసతులు కల్పించి తమకు మంచి చేయాలని కోరారు. ఉన్నత అధికారులతో మాట్లాడి పార్క్ డెవలప్‌మెంట్ జరిగేలా కృషి చేస్తానన్నారు.

ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా శివరామకృష్ణ


శివరామకృష్ణ

ఫిలింనగర్: ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.గురుశివరామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 17న ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఎస్‌బీలో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను తొలుత ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఎం.గురుశివరామకృష్ణను నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ క్రమంలోనే శివరామకృష్ణ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు సైతం స్వీకరించారు. తాజాగా చేపట్టిన బదిలీలో భాగంగా గురు శివరామకృష్ణను ఫిలింనగర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బంజారాహిల్స్ ఏసీపీ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. ఇదిలా ఉండగా ఫిలింనగర్ డీఐగా ఇప్పటికే రమేష్ గౌడ్‌ను నియమించారు.

సోషల్ మీడియా సెలబ్రిటీల సందడి



ఖైరతాబాద్: హుస్సేన్‌సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాలో సోమవారం సాయంత్రం సోషల్ మీడియా, ఇన్‌స్టాగామ్ రీల్స్‌లో సెలబ్రిటీలుగా గుర్తింపు పొందిన ప్రియారెడ్డి (కికార్ కాలా), హైదరాబాదీ అమ్మి, జులేకా, షోరియా ఉల్లు దాదాతో పాటు పలువురు సందర్శించారు. ఉత్సవ్ మేళాలో సెలబ్రిటీలు సందడి చేయడంతో పాటు సందర్శకులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ మాట్లాడుతూ... నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు సమ్మర్ ఉత్సవ్ మేళాను ఏర్పాటు చేశామన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

కంటోన్మెంట్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయిన ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ వివరాల ప్రకారం.. కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 02జెడ్ 0260) సోమవారం ఉదయం ఈసీఐఎల్ నుంచి ఇస్నాపూర్ (రూట్ నెం. 250/219) వెళ్తున్న క్రమంలో బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ఎడమ వైపు నుంచి ఓవర్ టెక్ చేయబోయిన టూ వీలర్ బస్సును ఢీకొట్టింది. దీంతో టూ వీలర్ నడిపిస్తున్న వ్యక్తి బస్సును ఆపి లోపలికి వచ్చి డ్రైవర్ దయానంద్‌పై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయాడు. 108కి కాల్ చేయడంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కండక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


బసవతారకం కేన్సర్ ఆస్పత్రి నుంచి కేబీఆర్ పార్కు దారిలో నిలిచిన వరద నీరు


జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో...

వరద వెళ్లేదెలా?

- వర్షపు నీరు వెళ్లేందుకు అనువుగా లేని కాలువలు
- వరద నీటితో నిండిపోతున్న రోడ్లు
- వర్షం వస్తే బెంబేలెత్తిపోతున్న వాహనదారులు

బంజారాహిల్స్: అకాల వర్షాలకు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. వరద నీరు సాఫీగా కాలువల్లోకి చేరడం లేదు. వరద నీటి కాల్వలు ఎక్కడికక్కడ వ్యర్థాలు, రాళ్లతో బ్లాక్ అవుతుండటంతో వరద సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లలేక రోడ్ల పైనే నిలిచిపోతోంది.

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శ్రీనగర్ కాలనీ, కమలాపురి కాలనీ, సోమాజిగూడ, పంజగుట్ట ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచిపోయింది.
- వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లు ఘటనా స్థలాలకు చేరుకోలేకపోయాయి. కొన్ని చోట్ల వ్యాపారులు, స్థానికులే మ్యాన్‌హోళ్ల మూతలపై రంధ్రాల్లో ఇరుక్కున్న వ్యర్థాలను తొలగించారు.
- మరికొన్ని చోట్ల మ్యాన్‌హోళ్ల మూతలను ఎత్తేసి వరద నీరు వెళ్లేందుకు చొరవ తీసుకున్నారు.
- బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వరద నీరు వెళ్లే మార్గాలన్నీ చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయాయి. ఫలితంగా ఎక్కడికక్కడ వరద, మురుగు పేరుకుపోయింది.


శ్రీనగర్ కాలనీ హిందూ శ్మశాన వాటిక వద్ద...

బస్తీల్లో మెరుగైన వసతులు కల్పిస్తా: మాగంటి

రహమత్‌నగర్: బస్తీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి మెరుగైన వసతులు కల్పిస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని బ్రహ్మశంకర్‌నగర్ బస్తీ, ఫేజ్–2 బస్తీల్లో ఆదివారం సీవరేజి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... రహమత్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పలు పనులను చేయిస్తున్నామన్నారు. బ్రహ్మశంకర్‌నగర్ బస్తీ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తామన్నారు. ఈ సందర్భంగా బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యను పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే స్పందించిన గోపీనాథ్ జలమండలి అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సత్వరమే నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బస్తీ నేతలు మల్లేశ్, బసవరాజు, సరిత డివిజన్ నాయకులు ధనూజ, నజీర్, గఫూర్, ఫయాజ్, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.


సీవరేజి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం


మాట్లాడుతున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: పోలీసు లెక్కల ప్రకారం దేశంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రతి గంటకు నలుగురు మృత్యువాతపడుతున్నారని బేగంపేట టీటీఐ ఏసీపీ జి. శంకర్‌రాజు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అపోలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లకు ఆయన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలు చేశారు. గతేడాది హెల్మెట్ ధరించకపోవడం వల్ల 54468 మంది ద్విచక్ర వాహనదారులు మృతి చెందారని, ఆ ఏడాది ట్రాఫిక్ పోలీసులు 8,72,109 హెల్మెట్ ఉల్లంఘన కేసులు నమోదు చేశారని అన్నారు. రాంగ్‌రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్‌తో జరిగే ప్రమాదాలను కళ్లకు కట్టారు. ప్రతి ఒక్కరూ జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. యువత అతి వేగంతో వాహనాలు నడుపుతున్నారని ఇతరులకు హాని కలిగిస్తున్నారని అన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, చట్టం దృష్టిలో నిషేధం అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో అపోలో ఆస్పత్రి హెచ్ఆర్ నైజు, సీఎస్‌వో జగ్దీష్ సింగ్, బేగంపేట టీటీఐ వీరమ్మ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఓలా, ఉబర్, రాపిడోలను నిషేధించండి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఏఐటీయూసీ తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తూ వారి జీవితాలను రోడ్డున పడవేస్తున్న ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేధించాలని ఏఐటీయూసీ తెలంగాణ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకుడు రాజు గౌడ్ మాట్లాడుతూ... రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో ఓలా, ఉబర్ వైట్ నంబర్ ప్లేట్ల వాహనాల దోపిడీ దందా కొనసాగుతోందన్నారు. ఎల్లో నంబర్ ప్లేట్ల వాహనాలను ఎయిర్ పోర్ట్‌లోకి రానీయకుండా ఓలా ఉబర్ బౌన్సర్ల దాడులు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్ టాక్స్ కట్టిన ఎల్లో నంబర్ ప్లేట్ల టాక్సీ వాహనాలను ఎయిర్ పోర్ట్‌లోకి అనుమతించి, టాక్స్ కట్టకుండా ప్రభుత్వానికి నష్టం కల్గిస్తున్న ఓలా, ఉబర్ వైట్ నంబర్ ప్లేట్ల వాహనాలను సీజ్ చేసి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. యూనియన్ నేతలు బాబు, ఎస్.కె. లతీఫ్, సయ్యద్ మహమూద్‌బాషా, అమృతం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జాగో జూబ్లీహిల్స్ పాదయాత్ర'


సమస్యలు తెలుసుకుంటున్న ఉపేందర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్‌లోని న్యూప్రేమ్‌నగర్‌లో సోమవారం 14వ రోజు నిర్వహించిన జాగో జూబ్లీహిల్స్ పాదయాత్రలో టీ హోప్ సంస్థ చైర్మన్ కె. ఉపేందర్‌రెడ్డి పర్యటించారు. టీ హోప్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా స్కాలర్ షిప్స్‌తో, 125 మంది పేదలకు ఉచితంగా వివాహాలు చేశామని చెప్పారు. బస్తీలు, కాలనీల్లో సమస్యలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తన సేవా భావాలను, పనితనాన్ని చూసి తనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నేతలు రాహుల్, వడ్డెర మోహన్, సంపత్, సతీష్, వెంకటేష్, విరూపాక్ష, భాస్కర్‌రెడ్డి, రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులంతా ఒకే బూత్‌లో ఓటు వేసేలా చర్యలు

వెంగళరావునగర్: సర్కిల్ పరిధిలో ఉన్న ఓటర్లలో ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే బూత్‌లో ఓట్లు వేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఉప కమిషనర్ ఎ.రమేష్ వెల్లడించారు. జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్–19 కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంసీ రమేష్ మాట్లాడుతూ... సర్కిల్‌లో ఓటరు లిస్ట్ వెరిఫికేషన్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని పేర్కొన్నారు. కొత్త ఓటర్లు ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఇందులో భాగంగానే ఆ కుటుంబంలోని వారంతా ఒకే చోట ఉండేలా చూస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం టీడీపీ నేతలు విజయ్‌కుమార్, సుప్రియాగౌడ్, రాపర్తి అశోక్, టి.సాయిశేష గిరిరావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న చింతల

హిమాయత్‌నగర్: ప్రజల అభివృద్ధికి డబుల్ ఇంజన్ సర్కారే అవసరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 15వ రోజు డివిజన్‌లోని మల్లికార్జున నగర్ బస్తీ, స్ట్రీట్ నెంబర్–8లో పర్యటించి ప్రజల సమస్యలను విన్నారు. ప్రజలు పలు సమస్యలను చింతల దృష్టికి తెచ్చారు. వాటిలో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, రోడ్లు, కాలుష్యం, ట్రాఫిక్, ఆక్రమణలు. వీటన్నింటినీ పరిష్కరించాలని స్థానికులు చింతలను కోరారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ... చిన్నపాటి వర్షానికే కాలనీ బురదమయంగా మారి జనం ఇక్కట్లు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకుల అసమర్థ, నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ప్రశ్నించాలన్నారు.

సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- తెలంగాణ రైతులను పట్టించుకోరుకానీ మహారాష్ట్రకు వెళ్తారా?
- తెలంగాణలో 119 స్థానాల్లో పోటీ చేస్తాం
- అందరిపై అభ్యర్థులకు బరిలో దింపుతాం
- శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ


మాట్లాడుతున్న శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ

పంజగుట్ట: తెలంగాణలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా... అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వారిని పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి ఆబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని శివసేన పార్టీ తెలంగాణ అధ్యక్షుడు సింకారు శివాజీ పేర్కొన్నారు. యావత్ తెలంగాణ ఐక్యమై పోరాడితే, రెండు వేల మందికి పైగా అమరులైతే వచ్చిన తెలంగాణలో ఒక కుటుంబం రాజ్యమేలడం దారుణమని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిండే మోసం చేశారు అని పదేపదే కేసీఆర్ అనడం సరి కాదని, ధర్మం దారితప్పుతుంటే సరిచేశారని, యావత్ మహారాష్ట్ర ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. మరోమారు ఏక్‌నాథ్ శిందేను వెన్నుపోటుదారుడు అంటే సహించేది లేదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో శివసేన పార్టీ తెలంగాణలో 119 స్థానాల్లో పోటీ చేస్తుందని వెల్లడించారు. 33 శాతం మహిళలకు, 50 శాతం బీసీ ఉద్యమకారులకు, ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం టిక్కెట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకి రెండు కాళ్లు పోగొట్టుకున్న ఉద్యమకారుడు రమేష్, జై తెలంగాణ అంటూ ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి చేతులు, కాళ్లు పోగొట్టుకున్న పెడమర్తి నాగరాజ్‌కు తమ పార్టీ అభ్యర్థులుగా టిక్కెట్లు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒక రైతును నిలబెడతామని, కేటీఆర్‌పై పద్మశాలీ సోదరుడు లేక సోదరిని, హరీష్‌రావుకు పోటీగా తెలంగాణ ఉద్యమ కారుడిని, కవితకు పోటీగా పసుపు రైతును నిలబెడతామన్నారు. త్వరలోనే తమ నాయకుడు ఏక్‌నాథ్ షిండే రాష్ట్రానికి రానున్నారని, ఒక భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి గోపీకిషన్, కార్వాన్ ఇన్‌చార్జి సూర్యవంశీ రమేష్, ఉమ్మడి ఖమ్మం ఇన్‌చార్జి శ్రీనివాస్, యువసేన రాష్ట్ర నాయకులు సాయి, గౌతం గౌడ్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



కంటోన్మెంట్: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని నందమూరి నగర్ కమ్యూనిటీహాల్, లోతుకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు స్వల్ప వైద్య సేవల కోసం కూడా పడుతున్న ఇబ్బందులను దూరం చేసే లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 350 బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, హైదరాబాద్ జిల్లా పరిధిలో నూతనంగా 14 బస్తీ దవాఖానాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్–ఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృశాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, లాస్య నందిత, నివేదిత పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరించాం..

పికెట్ నాలాకు వచ్చే వరద నీటితో సమీప కాలనీలు ముంపునకు గురై ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని, దివంగత ఎమ్మెల్యే సాయన్న మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంతో సమస్య పరిష్కరించడం జరిగిందన్నారు. అదే విధంగా అల్వాల్ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం కూడా జరుగుతుందని తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధి వాసులకు నిరంతరం ఉచితంగా తాగునీటి సరఫరా చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు..

రాంగోపాల్‌పేట: బీజేపీకి చెందిన మైనార్టీ నాయకులు సోమవారం మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంతో మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మరెంతో మంది పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. మహ్మద్ ఆసీఫ్, మహ్మద్ సోహైల్, అబ్దుల్ రెహ్మాన్, సయ్యద్ అమీర్, సోఫియాన్, మహ్మద్ ఖాసీం, మహ్మద్ అర్బాస్, ఎండీ సిద్దిక్ బీఆర్ఎస్‌లో చేరారు.

అధ్వాన రోడ్డులో జారిపడి మహిళకు గాయాలు


ఆస్పత్రిలో కుసుమకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్ చౌరస్తాలో అధ్వానంగా గుంతలమయంగా మారిన రోడ్డులో ఓ మహిళ సోమవారం జారిపడి గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దుర్గా భవానీనగర్ బస్తీకి చెందిన కుసుమ అనే మహిళ ఎమ్మార్సీ కాలనీకి వచ్చి తిరుగుపయనంలో ఛత్రపతి శివాజీనగర్ బస్తీలో గుంతలమయంగా ఉన్న రోడ్డులో జారిపడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. ఛత్రపతి శివాజీనగర్ బస్తీలో ఉన్న గుంతల రోడ్డుపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం పిల్లలు, వృద్ధులు ఈ గుంతల్లో పడుతూ గాయాలపాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొబైల్ ఫోన్ లాక్కెళ్లిన వ్యక్తి అరెస్టు

పంజగుట్ట: మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లిన ఓ వ్యక్తిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ తుమ్మలబస్తీకి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రాజేంద్ర. గత నెల 29వ తేదీన ఖైరతాబాద్ కూడలిలో బస్సు కోసం వేచిచూస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి హెల్మెట్ ధరించి రాజేంద్ర జేబులోని మొబైల్ ఫోన్ లాక్కొని క్షణాల్లో పంజగుట్ట వైపు వెళ్లిపోయాడు. రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం పంజగుట్ట పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కార్వాన్‌కు చెందిన మహ్మద్ అతహర్ అలియాస్ కమాండో(22) ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించాడు. అతన్ని ఆపి తనిఖీ చేశారు. ఖైరతాబాద్‌లో సెల్‌ఫోన్ దొంగతనంతోపాటు షాహినాజ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



కృష్ణా జిల్లా మంగినపూడి సమీపంలోని తపసిపూడి వద్ద బందరు పోర్టుకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో వైఎస్ జగన్

దేవతల్లా యజ్ఞం చేస్తున్నాం రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు

బందరు పోర్టుకు శంకుస్థాపన సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలో నాలుగేళ్లుగా పేదలకు మంచి జరగకూడదన్న లక్ష్యంతో చంద్రబాబు బృందం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. పేదలు ఎప్పటికీ పేదలుగానే మిగిలిపోయి పాచి పనులు చేసుకుంటూ బతకాలనే దుర్బుద్ధి కలిగిన రాక్షసులతో మనం యుద్ధం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. పేదల అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. దేవుడి ఆశీస్సులు, ప్రజలందరి చల్లటి దీవెనలతో ఆ అడ్డంకులను అధిగమించి అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెప్పారు. 'అమరావతి ప్రాంతంలో 50 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితమే ప్రారంభించాం. కానీ దేవతల యజ్ఞాన్ని రాక్షసులు అడ్డుకున్నట్టుగా టీడీపీ, గజదొంగల ముఠా అడ్డుపడుతోంది. కేవలం చంద్రబాబు, ఆయన బినామీలే ఉండాలని, పేదలకు అక్కడ స్థానమే లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. పేదలు ఉదయం వచ్చి పనులు చేసుకొని తిరిగి వెళ్లి పోవాలట! వారు అమరావతిలో ఉండటానికే వీలు లేదన్నది చంద్రబాబు, ఆయన బినామీల అంతరంగం' అని సీఎం జగన్ ధ్వజమెత్తారు. ఈనెల 26వతేదీన అమరావతిలో 50 వేల మందికి పైగా పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.5,156 కోట్ల వ్యయంతో చేపట్టిన బందరు పోర్టు నిర్మాణానికి సోమవారం కృష్ణా జిల్లా మంగినపూడి సమీపంలోని తపసిపూడి వద్ద సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ మైదానంలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు.

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సుప్రీంకోర్టులో నేడు అవినాశ్ పిటిషన్ విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ముందస్తు బెయిలు కోరుతూ ఎంపీ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. అవినాశ్‌కు ముందస్తు బెయిలు ఇవ్వొద్దంటూ మాజీ ఎంపీ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి ఈ పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించనుంది. ఇదిలా ఉంటే, తమ పిటిషన్ విచారించాలంటూ అవినాశ్ తరపు న్యాయవాది సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. మరో వెకేషన్ బెంచ్‌కు వెళ్లాలని ధర్మాసనం సూచించడంతో జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సంజయ్‌కరోల్‌లతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. తాను సభ్యుడిగా లేని ధర్మాసనం జాబితాలో చేర్చాలని జస్టిస్ సంజయ్ కరోల్ రిజిస్ట్రీకి సూచించారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రానుంది.

ఎల్లో మీడియా ఓవరాక్షన్

ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎల్లో మీడియా ఓవరాక్షన్ చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న తల్లి శ్రీలక్ష్మి బాగోగులు చూసుకుంటున్న అవినాశ్ పట్ల కనీస మానవత్వాన్ని కూడా మరిచి ఎల్లో మీడియా అమానుష ధోరణిని బయటపెట్టుకుంది. సీబీఐ అధికారులు సోమవారం కర్నూలుకు రావడంతో అదే అదనుగా రెచ్చిపోయింది. అవినాశ్‌ను ఎలాగైన అరెస్టు చేయించాలన్న విపరీత ధోరణి, కర్నూలు నగరంలో ఉద్రిక్తతలు సృష్టించాలన్న వ్యూహంతో క్షణక్షణం అసత్య ప్రచారంతో హోరెత్తించింది. గంట గంటకు ఎల్లో మీడియా పిచ్చి ముదిరి, మధ్యాహ్నానికి పీక్స్‌కు చేరుకొంది. స్థానిక పోలీసులు సహకరించడంలేదని, మధ్యాహ్నానికి కర్నూలుకు కేంద్ర బలగాలు వస్తున్నాయని, ఆ వెంటనే సీబీఐ అధికారులు అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ తప్పుడు ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎల్లో మీడియా విపరీత ధోరణిని రాష్ట్రవ్యాప్తంగా పలువురు తప్పుపట్టారు. తల్లి ఆరోగ్యం బాగోలేక బాధలో ఉన్న వ్యక్తిపట్ల అమానవీయంగా వ్యవహరించడాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సభ్య సమాజం ఖండించాయి. ఒక ఎంపీకి ఉండే హక్కులు, ఆయన ప్రైవసీని భంగపరిచే విధంగా పచ్చ పైత్యాన్ని వెళ్లగక్కుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలో భాగంగానే వైఎస్ అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా ఎల్లోమీడియా ఈ దుర్నీతికి పాల్పడుతోందని స్పష్టమవుతోంది. అందులో భాగంగానే అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబడుతున్నారని, ఎంపీ తల్లికి అందిస్తున్న చికిత్సపై వైద్యులు సమాచారం అందిస్తున్నా, అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినాశ్ సోమవారం సీబీఐ విచారణకు హాజరు కావల్సి ఉంది. అయితే, ఆయన తల్లి తీవ్ర అనారోగ్యంతో ఈనెల 20వ తేదీ నుంచి కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తోంది. అవినాశ్ దగ్గరుండి ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని, ఈ నెల 27 తర్వాత హాజరవుతానని అవినాశ్ సీబీఐ అధికారులకు లేఖ పంపారు. అయినప్పటికీ, సీబీఐ అధికారులు సోమవారం ఉదయం కర్నూలు వచ్చారు. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. దీనినే అవకాశంగా తీసుకున్న ఎల్లో మీడియా వెంటనే తప్పుడు కథనాలు ప్రచారం చేయడం ప్రారంభించింది. అవినాశ్‌ను అరెస్టు చేయడానికే సీబీఐ అధికారులు వచ్చారంటూ అసత్య ప్రచారం మొదలెట్టింది. వారు పోలీసు అధికారులను కలిసినట్లు, అవినాశ్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారంటూ స్క్రోలింగ్‌లు, చర్చలు ప్రారంభించింది. ఓ వ్యక్తి తల్లి అనారోగ్యంతో ఉంటే, అతన్ని లక్ష్యంగా చేసుకోకూడదన్న కనీస మానవతా ధర్మాన్ని కూడా విస్మరించి, తీవ్ర ఆందోళనలో అవినాశ్ పట్ల విపరీత ధోరణిని ప్రదర్శించింది. ఓ వ్యక్తికి ఉండే ప్రైవసీని కూడా హరించేలా వ్యవహరించింది. దగ్గరుండి తల్లిని రక్షించుకోవాల్సిన ఆయన ధర్మాన్ని, తల్లి పట్ల ప్రేమను పట్టించుకోకుండా సైకో మనస్తత్వాన్ని బయటపెట్టుకుంది. బాధలో ఉన్న ఆయన విచారణకు రానని కూడా చెప్పడంలేదు. ఈ నెల 27వ తేదీ వరకు గడువు



విశ్వభారతి హాస్పిటల్ వద్ద పోలీసు బందోబస్తు

కోరారు. ఆ తర్వాత విచారణకు హాజరవుతానని సీబీఐ అధికారులకు తెలిపారు. అయినా పచ్చ మీడియా క్రూరత్వాన్ని ప్రదర్శించింది. అవినాశ్‌ను అరెస్టు చేయకపోవడంతో నిరాశ చెందిన ఈ మీడియా.. కొత్త వ్యూహాన్ని రచించింది. సీబీఐ అధికారులు పోలీసు అధికారులను సంప్రదిస్తున్నారని, ఎప్పుడైనా అరెస్టు జరగవచ్చని మరో ప్రచారం మొదలెట్టింది. అదీ కాకపోవడంతో పిచ్చెక్కిపోయింది. పోలీసు అధికారులు సీబీఐకి సహకరించడంలేదని, కేంద్ర బలగాలను రప్పిస్తున్నారంటూ మరోసారి తప్పుడు వార్తలు వ్యాప్తిలోకి తెచ్చింది. మధ్యాహ్నం లోపు హైదరాబాద్ నుంచి కేంద్ర బలగాలు వస్తాయని, ఆ వెంటనే అరెస్టు అంటూ వార్తలు, చర్చలతో పచ్చ పైత్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యంగా టీవీ–5, ఏబీఎన్ తప్పుడు కథనాలు, చర్చలతో హోరెత్తించాయి. వాస్తవానికి కేంద్ర బలగాలు కర్నూలుకు రాలేదు. కేవలం కర్నూలులో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేందుకు ఓ ప్రణాళికతో ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేశారు.

సీబీఐని కూడా ప్రభావితం చేస్తారా?

సీబీఐ బృందం కర్నూలుకు రాగానే ఎల్లో మీడియా దుష్ప్రచారం మొదలైంది. సీబీఐ అధికారులు ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. నేరుగా స్టేట్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడే బస చేశారు. అయినా, పచ్చ మీడియా సీబీఐ వెంటనే అవినాశ్‌ను అరెస్టు చేసేస్తోందంటూ ప్రచారం మొదలెట్టింది. టీవీ చర్చల్లో తమకు అనుకూలురను కూర్చోబెట్టి, అధికారులను ప్రభావితం చేసేలా చర్చలు సాగించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇది కచ్చితంగా పెడ ధోరణేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చర్చల్లో వక్తలు, యాంకర్లు వ్యక్తం చేసే అభిప్రాయాలు ఇష్టానుసారం అసత్యాలతో సాగుతున్నాయని, మీడియా ట్రయల్ పేరిట వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచే కర్నూలుకు తరలివచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, సుధాకర్, శ్రీదేవి, ఆర్థర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు కూడా ఆస్పత్రికి వచ్చారు. కర్నూలుతోపాటు పులివెందుల, కడప, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆస్పత్రి పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి కార్యకర్తల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఆదోని, పత్తికొండ సబ్‌డివిజన్ నుంచి మరిన్ని బలగాలు సోమవారం రాత్రికి కర్నూలుకు చేరుకున్నాయి.

శ్రీలక్ష్మిని పరామర్శించిన వైఎస్ విజయమ్మ

వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ సోమవారం సాయంత్రం విశ్వభారతి ఆస్పత్రికి వచ్చి ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మిని పరామర్శించారు. శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవినాశ్‌ను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అంతా మంచే జరుగుతుందని కాంక్షించారు.

ఆస్పత్రి ముందు కార్యకర్తల నిరసన

ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రి ముందు బైఠాయించారు. 'తండ్రిని అకారణంగా జైలుకు పంపారు. తల్లి అనారోగ్యంతో ఉంటే బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌ను వెంటాడి, వేధించడం ఏంటని' నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆందోళనకరంగానే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి

అవినాశ్ తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై విశ్వభారతి ఆస్పత్రి హెల్త్ బులెటిన్ రిలీజ్ చేసింది. ఆమెకు నాన్ ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (గుండెపోటు) ఉందని పేర్కొంది. యాంజియోగ్రామ్ చేశామని, రెండు రక్తనాళాల్లో బ్లాక్‌లు గుర్తించామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యుల బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఆమెకు రక్తపోటు ఇప్పటికీ తక్కువగా ఉండటంతో అయానోట్రోపిక్ సపోర్ట్‌తో ఉన్నారని తెలిపారు. ఆది, సోమవారాల్లో ఆమె వాంతులు చేసుకున్నారని, అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉందని తెలిపారు. మరికొద్దిరోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు.

అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబాటు

వందలాది రోగులు, వారి సహాయకులు ఉండే ఆస్పత్రిలోకి మీడియా పదే పదే జొరబడటంపై సీనియర్ విలేకరులే మండిపడుతున్నారు. కేవలం చంద్రబాబుకు ఏదో మేలు చేయాలన్న తపనతోనే ఎల్లో మీడియా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోందని విమర్శిస్తున్నారు. ఇదే ఉద్దేశంతో విశ్వభారతి ఆస్పత్రి పరిసరాల్లో ఆదివారం అర్ధరాత్రి, ఎల్లో మీడియా హంగామా చేసింది. రాత్రి 11గంటల తర్వాత ఎల్లో మీడియా ప్రతినిధి ఒకరు తాను పనిచేస్తున్న సంస్థ పేరు కాకుండా మరో పేరు చెప్పి ఆస్పత్రిలోకి వెళ్లారు. శ్రీలక్ష్మి ఉన్న ఐసీయూ సమీపంలో ఓ కానిస్టేబుల్ అతన్ని నిలువరించారు. తప్పుడు పేరు చెప్పి రావాల్సిన అవసరం ఏముందని అక్కడున్న వారు కూడా గట్టిగా నిలదీశారు. దీంతో మీడియా ప్రతినిధి ఆస్పత్రి గేటు వద్దకు వచ్చి అవినాశ్ అనుచరులపై దుందుడుకుగా వ్యవహరించారు. ఇదంతా మిగతా ఎల్లో మీడియా ప్రతినిధులు వీడియో తీయబోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇలా ఎల్లో మీడియా అతిగా ప్రవర్తించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

కాళేశ్వరంతో ఒక నదినే ఎత్తిపోశారు

అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సమావేశంలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఒక నాయకుడి అచంచలమైన నిబద్ధతకు కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఒక నదిని ఎత్తిపోయడం ద్వారా లక్షలాదిమంది జీవితాల్లో వెలుగును నింపి జీవనోపాధి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ సాగునీటి ప్రగతి ప్రస్థానం, ఇంజనీరింగ్ నైపుణ్యం, దాని ద్వారా కలిగిన మార్పులు ఈరోజు ప్రపంచానికి, సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. అమెరికాలోని నెవడా రాష్ట్రం హెండర్సన్‌లో సోమవారం జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నిర్వహించిన 'వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్స్ కాంగ్రెస్' సమావేశంలో మంత్రి కేటీఆర్ ప్రారంభోపన్యాసం చేశారు.

618 మీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి...: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు కరువుకు నిలయంగా మారడంతోపాటు వ్యవసాయ రంగం సంక్షోభంలో నిలిచిందని కేటీఆర్ చెప్పారు. 55 శాతం జనాభా వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉన్న తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరం అనే విషయాన్ని గుర్తించి కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో సీఎం కేసీఆర్ పూర్తి చేశారన్నారు. సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తున ఉన్న నీటిని 618 మీటర్ల స్థాయికి ఎత్తిపోతల ద్వారా తీసుకుపోయి వివిధ ప్రాజెక్టులు నింపడం ప్రపంచ సాగునీటి చరిత్రలోనే ఒక అద్భుతంగా నిలిచిపోతుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం తరలించిన మట్టి ద్వారా 101 గిజా పిరమిడ్లను నిర్మించవచ్చని, ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన స్టీల్ ద్వారా 66 ఈఫిల్ టవర్ల నిర్మాణం చేయొచ్చన్నారు. ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన కాంక్రీట్ ద్వారా 53 బుర్జ్ ఖలీఫాలు కట్టవచ్చన్నారు.

ఇంజనీరింగ్ అద్భుతం: కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని ఒక ఇంజనీరింగ్ అద్భుతం అని కేటీఆర్ పేర్కొన్నారు. 13 జిల్లాల్లో సుమారు 500 కి.మీ మేర ఈ ప్రాజెక్టు విస్తరించిందని, 1,800 కి.మీ కాల్వల నిర్మాణం జరిగిందని, ఏడు మెగా లింకులను 28 ప్యాకేజీలుగా 22 పంపుహౌస్‌ల నిర్మాణం చేశారన్నారు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ కోసం 20 రిజర్వాయర్లు నిర్మించారని, 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ లాంటి అతి పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించినట్లు తెలిపారు. 240 టీఎంసీల నీటిని సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాల కోసం వాడుకునే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంతో 90 లక్షల ఎకరాల్లో రెండు పంటలుగా సాగవుతున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకమైన 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్'గా గుర్తిస్తూ అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఇచ్చిన అవార్డును కేటీఆర్ స్వీకరించారు.

నగర వార్తలు

ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం నారగోని



లక్డీకాపూల్ : నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయుడు పురుషోత్తం నారగోని నియమితులయ్యారు. ఇటీవల ఒడిస్సాలోని జజ్పూర్ కేంద్రంగా నిర్వహించిన యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆయనను ఎన్నుకున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల యూనియన్ కార్యక్రమాల పర్యవేక్షణ తదితర బాధ్యతలు నిర్వహిస్తారు. ఎన్‌యూజే (ఐ) జాతీయ కార్యవర్గ సభ్యులుగా సీనియర్ పాత్రికేయులు సిల్వేరి శ్రీశైలం, బుచ్చి రాములు, రాజన్న నియమితులయ్యారు. ఈ సందర్భంగా నారగోని మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఎన్‌యూజే (ఐ)ని బలోపేతం చేస్తామని, జర్నలిస్టులకు రావలసిన వసతులను, సౌకర్యాలను అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి

మంత్రి మల్లారెడ్డి

కీసర: ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం కీసరగుట్ట దేవాలయ ప్రాంగణంలో ఆలయ ట్రస్టు బోర్డు కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్ట దేవాలయం ఆధ్యాత్మికతోపాటు, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏటా గుట్టకు వచ్చే యాత్రికులు సంఖ్య పెరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులుకు కలుగకుండా దేవస్థానంతో పాటు, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. మహాశివరాత్రి బ్రహోత్సవాలు, శ్రావణమాస, కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం రూ. కోటి ప్రత్యేక నిధులను వెచ్చించిందన్నారు. కీసరగుట్టలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.



ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

దేవాలయ అభివృద్ధికి పాటు పడటంతో పాటు, దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నూతన ట్రస్టుబోర్డు సభ్యులు కృషి చేయాలన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

అంతకు ముందు మంత్రి మల్లారెడ్డి శ్రీరామలింగేశ్వరుడి సేవలో పాల్గొన్నారు. గర్భాలయ అభిషేకం అనంతరం వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు, మహా ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్తవెంకటేష్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు కందాడి వెంకట్‌రెడ్డి, మచ్చాని జంగయ్య యాదవ్, కందాడి ముత్యంరెడ్డి, శీలం శ్రీనివాస్, గుర్రం లక్ష్మారెడ్డి, మణికంఠముదిరాజ్, రాగి రాఘవేందర్‌రెడ్డి, మామిండ్ల వెంకటేష్, రాగులరమేష్, ఎంపాల సుధాకర్‌రెడ్డి, మణిగండ్ల నాగరాజు, వర్షి తలింగం, వంగేటి బుచ్చిరెడ్డి, సర్పంచులు నాయకపు మాధురి, మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, కొత్తహేమలత శ్రీనివాస్‌గౌడ్, నాగయపల్లి సుజాత, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కీసరగుట్ట ఈఓ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం దువా చేయండి

దేశంలోనే హైదరాబాద్ ఎంబారికేషన్ నెంబర్ వన్

- మైనార్టీ గురుకులాలు దేశానికే ఆదర్శం
- హజ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు
- వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర హజ్ కమిటీ యాత్రికులకు చేస్తున్న ఏర్పాట్లను గుర్తించి కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌కు బెస్ట్ ఎంబారికేషన్ అవార్డును అందజేసిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు సకల సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రతి యాత్రికుడికి ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తునానమని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం నాంపల్లి హజ్‌హౌస్‌లో 2023 హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యమంత్రి కేసీఆర్ క్షేమం కోరుతూ హజ్ యాత్రికులు దువా(ప్రార్థనలు) చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. ముస్లిం మైనార్టీ యువతుల వివాహాల కోసం షాదీముబారక్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసి ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట్, జహీరాబాద్, సింగారెడ్డిలో హజ్‌హౌస్‌లు ఏర్పాటు చేశామన్నారు. అ హజ్‌హౌస్‌లలో హజ్ ఆరాధనలు, యాత్రపై అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. చైర్మన్ మహ్మద్ సలీం మాట్లాడుతూ..యాత్రికుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు హజ్‌హౌస్‌తో పాటు నాంపల్లి, కింగ్‌కోఠి, మలక్‌పేట్, ఖైరతాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆర్యోగ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.షఫీవుల్లా, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ పాల్గొన్నారు.

కుటుంబాలను నిలబెట్టేందుకే 'సీడీఈడబ్ల్యూ'

- మహిళా సమస్యలు, చైల్డ్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తాం
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



మహిళా కానిస్టేబుళ్లతో కలిసి సీడీఈడబ్ల్యూ సెంటర్‌ను ప్రారంభించిన సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: తెలంగాణ పోలీసు శాఖ మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, డీజీపీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు మహిళలు, చిన్నారులకు ప్రాధాన్యత, భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నామన్నారు. కుటుంబ సమస్యలను పరిష్కరించేందుకు 'సేఫ్ సిటీ ప్రాజెక్టు'లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధి లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్ (సీడీఈడబ్ల్యూ) సెంటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. కుటుంబ కలహాల కారణంగా విడిపోతున్న వారికి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు సీడీఈడబ్ల్యూ సెంటర్లు దోహదపడతాయన్నారు. ఈ సెంటర్ల ద్వారా మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, వాటిని అర్థం చేసుకుని బంధాలను నిలబెట్టేందుకు ఈ సెంటర్లు తోడ్పడతాయన్నారు. 'మీ భద్రతే మా బాధ్యత' అనే మోటోను సైబరాబాద్ పోలీసుల పనితీరును ప్రతిబింభిస్తుందన్నారు.

ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు..

ప్రస్తుతం మూడు పీఎస్‌లలో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని త్వరలో మరో నాలుగు చోట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి సీడీఈడబ్ల్యూ కేంద్రం అనుభవజ్ఞులైన ఇద్దరు కౌన్సిలర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీరు కేవలం కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ ఉంటారన్నారు. ఇందులో భాగంగా మహిళా సమస్యలు, చైల్డ్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఏవీ ఆడియో విజువల్ వాహనాన్ని మహిళా కానిస్టేబుళ్లతో కలిసి ప్రారంభించారు. ప్రస్తుతం అల్వాల్, పేట్ బషీరాబాద్, జీడిమెట్ల పోలీస్‌స్టేషన్లలో ఈ సెంటర్లను ఏర్పాటు చేశామని, త్వరలో మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ ఆర్‌సీపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీడీఈడబ్ల్యూ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. బాలానగర్ జోన్‌లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీడీఈడబ్ల్యూ సెంటర్‌ను బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీపీలు నితికపంత్, డీవీ శ్రీనివాసరావు, ఏసీపీలు రామలింగరాజు, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్: దేశంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని, పార్లమెంటులో మహిళా బిల్లు ప్రవేశపెట్టి మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత అధ్యక్షతన మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిథ్యం కల్పించకపోతే బిల్లుకు సార్థకత ఉండదన్నారు. ఇప్పటికే మహిళా బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందని, లోక్‌సభలోనూ ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని కోరారు. మహిళా బిల్లుపై గొంతు చించుకునే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళలు, వారికి జరుగుతున్న అన్యాయాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మహిళా బిల్లు పాస్ కావాలంటే బీసీ మహిళలకు సబ్‌కోటా ఇవ్వక తప్పదని స్పష్టం చేశారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుతోనే మహిళా ప్రగతి సాధ్యమని, మహిళలపై అత్యాచారాలు తగ్గుతాయన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దశల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారని, అందులో భాగంగా బెల్టుషాపులు ఎత్తివేశారన్నారు. ఎర్ర సత్యనారాయణ, వేముల రామకృష్ణ, సి.రాజేందర్, అంజి, అనంతయ్య, నాని ముదిరాజ్, కుమార్ యాదవ్, సత్తిబాబు, జి.పి.టి కుమార్, పి. శ్రీనివాస్, పి. భూషణం పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటు

- బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం మాజీ ఆచార్యులు కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటని వర్సిటీ వీసీ సీతారామారావు అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో పలు విభాగాలకు డైరెక్టర్‌గా పని చేశారు. ఆయన మృతి విశ్వ విద్యాలయానికి, తెలుగు సాహితీ రంగానికి తీరని లోటని వీసీ పేర్కొన్నారు. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఎన్ఆర్.రెడ్డి పేర్కొన్నారు.

ఆబ్కారీ శాఖలో లిక్కర్ లిఫ్టింగ్ పెంపుపై హర్షం



మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానిస్తున్న బాలరాజ్ గౌడ్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎక్సైజ్ శాఖలో లిక్కర్ లిఫ్టింగ్‌ను 5 శాతం నుంచి 7 శాతానికి పెంచడం పట్ల తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రెస్టారెంట్ అండ్ బార్ అసోసియేషన్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, గౌరవ సలహాదారు అయిలి వెంకన్న గౌడ్, అధ్యక్షులు దామోదర్ గౌడ్ మాట్లాడుతూ గత కొంత కాలంగా నష్టాల్లో కూరుకుపోయిన బార్ అండ్ రెస్టారెంట్‌లను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 90 ఎంఎల్, క్వార్టర్, ఆఫ్ బాటిల్స్‌ను రెస్టారెంట్‌లలో విక్రయించేందుకు అవకాశం కల్పించడంతో పాటు రెంటల్స్‌ను 4 భాగాలుగా చెల్లించే వెసులుబాటును కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. మరికొన్ని పెండింగ్ సమస్యలపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజుగౌడ్, రామకృష్ణ, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ గౌడ్, నిరంజన్ గౌడ్, బత్తిని లతా గౌడ్‌లతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహిణిగా ఇంటి బాధ్యతలు మహిళలకు ఎలాగూ తప్పదు. ఇక ఆదాయ మార్గం గురించి ఆలోచించడం, వాటిని అమలులో పెట్టడం అంటే తగిన వనరులే కాదు ఇంటిల్లిపాదీ అందుకు సహకరించాలి. హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో ఉంటున్న ఆర్.రాజేశ్వరి ని కలిసినప్పుడు 'పదేళ్లుగా చేస్తున్న పచ్చళ్లు, పొడుల వ్యాపారం... ఆదాయంతో పాటు బిజినెస్ ఉమన్‌గానూ గుర్తింపును తెచ్చిపెట్టింది' అని వివరించింది.

కాదేదీ ఉపాధికనర్హం!

ఇంటి పచ్చళ్లతో ఇల్లు దిద్దుకుంది


● రాజేశ్వరి



'మన ఇళ్లల్లో అన్ని కాలాల్లోనూ ఏవో ఒక పచ్చళ్లు పెట్టడం అనేది గృహిణులకు అలవాటైన పనే. ఇంట్లో నేనూ అలాగే చేస్తుండే దాన్ని. నా చేతి పచ్చళ్లు రుచికరంగా ఉంటాయని ఇంట్లోనూ, బంధుమిత్రులు, చుట్టుపక్కల వాళ్లు బాగా మెచ్చుకునేవారు. అడిగి మరీ చేయించుకునేవారు. దీనికి తోడు నాకు తెలిసిన వాళ్లు విదేశాలకు వెళ్లినప్పుడు తమకు నచ్చిన పచ్చడి, పొడులు తయారు చేసిమ్మని అడిగేవారు.

పదేళ్ల క్రితం...

నోటి మాటతోనే ఒకరొకరుగా పచ్చళ్లు చేసిమ్మని అడిగే వారి సంఖ్య పెరగడం మొదలయ్యింది. దీనినే చిన్న వ్యాపారంగా మార్చుకుంటే బాగుంటుంది కదా అనుకున్నాను. మా ఊరు గుంటూరుకు వెళ్లినప్పుడల్లా అక్కడ రైతుల దగ్గరకు వెళ్లి, కావల్సిన సరుకులను నేరుగా పొలాల నుంచే సేకరించేదాన్ని. ఒకటే నియమం పెట్టుకున్నాను. కేవలం వెజ్ పచ్చళ్లను మాత్రమే పెట్టాలి. అలాగే, రసాయనిక ఎరువు వాడకుండా పండించిన ఆర్గానిక్ పంటల నుంచే సేకరించాలనుకున్నాను. నేరుగా రైతులను కలిసి, వారి ద్వారా పంటలను కొనుగోలు చేయడం, వాటిని బాగుచేయించి, తీసుకురావడమూ పెరిగింది. మిర్చి, పసుపు, మసాలా దినుసులు వంటివి ఏయే ప్రాంతాల్లో ఏయే ఏవి అధికంగా పండుతాయో తెలుసుకుని, ఆ దినుసులను సేకరిస్తూ ఉంటాను.

ఒక్కరిగానే...

మొదట్లో ఒక్కదాన్నే పచ్చళ్లకు అవసరమైనవన్నీ ఏర్పాటు చేసుకునే దాన్ని. అందుకు తగిన పనుల ప్లానింగ్ కూడా చేసుకున్నాను. మెల్లగా మార్కెట్ పెరుగుతుండటంతో సాయానికి మరొకరిని నియమించుకుని, పనులు చేస్తూ వచ్చాను. కామాక్షి ఫుడ్స్ పేరుతో పదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని రిజిస్టర్ చేయించుకొని, ఇప్పుడు నాతోపాటు మరో ముగ్గురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. మొదట్లో అంతగా తెలియకపోయినా మార్కెట్ గురించి నాకు నేనుగానే ఓ అంచనా వేసుకుంటూ షాప్స్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఆర్డర్ల ద్వారానూ పచ్చళ్లు సిద్ధం చేస్తుంటాను. టొమాటో, గోంగూర, మాగాయ, నిమ్మకాయ, చింతకాయ.. వంటి పచ్చళ్లు, పొడుల తయారీ రోజూ ఉంటుంది.

రోజూ ఉదయం నాలుగు గంటల నుంచే మొదలయ్యే నా దినచర్య తిరిగి, రాత్రి పదిగంటలకే పూర్తవుతుంది. నాకు ఇద్దరు పిల్లలు. మా వారు ఉద్యోగి. ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటూనే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాను. ఏడాదికి ఇరవై లక్షల ఆదాయంతో ఈ మార్గం నాలో ఓ కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నా చేత్తో నలుగురికి రుచికరమైన పచ్చళ్లను అందివ్వడమే కాదు, నాతో పాటు ఇంకొందరికి ఉపాధినివ్వడం సంతోషంగా ఉంది. ఆర్డర్లను బట్టి తయారీ విధానాన్ని ఎంచుకుంటాను కాబట్టి నష్టం అనే సమస్య ఎప్పుడూ రాలేదు. చేసే పనిలో ముందుగానే అంచనా ఉంటే అది ఉద్యోగమైనా, వ్యాపారమైనా ఇంటితోపాటు సమర్థవంతంగా నిర్వర్తించే సత్తా మహిళలకెలాగూ ఉంటుంది' అని వివరిస్తుంది రాజేశ్వరి.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: మోహనాచారి

న్యూస్‌మేకర్స్

నానమ్మ హ్వా.. మనవరాలు హ్వా...


● గీతా గోదరా, ఆష్కా

మనవరాలు కరాటే చేస్తుంటే నానమ్మ తోడుగా నిలబడి చూడటం ఆనవాయితీ. కాని నానమ్మ కూడా కరాటే డ్రస్సు తొడుక్కుని గోదాలో దిగితే? గుర్‌గావ్‌కు చెందిన 60 ఏళ్ల గీతా గోదరా ఆమె 13 ఏళ్ల మనవరాలు ఆష్కా గోదరా దుబాయ్‌లో తాజాగా జరిగిన కరాటే ఛాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు. ఈ కాలపు నానమ్మ–మనవరాలు ఇలాగే ఉండాలని అందరూ మెచ్చుకుంటున్నారు.

గుర్‌గావ్‌లోని సెక్టార్ 5లో రెండేళ్ల క్రితం మనవరాలికి తోడుగా కరాటే అకాడెమీకి బయలుదేరిన గీతా గోదరా ఇదంతా ఇంత వేగంగా జరుగుతుందని అనుకోలేదు. తాను కూడా కరాటే ఛాంపియన్ అవుతానని అసలు అనుకోలేదు.

'నేను పుట్టింది హర్యానాలోని పల్లెటూళ్లో. నా చదువు ఐదవ క్లాసుతో ముగిసిపోయింది. చిన్నప్పటి నుంచి సాహస కార్యాలు చేయాలని ఉండేది. ఒక వయసులో సైన్యంలో చేరాలని అనుకున్నాను. ఏవీ జరగలేదు. సంసారంలో పడ్డాను. నా మనవరాలు ఆష్కాకు నేను అసంపూర్తిగా వదిలేసిన కలలు నెరవేర్చుకునే వీలు ఉంది. అందుకని తను ఏం కోరినా సపోర్ట్ చేయాలనుకున్నాను. కరాటే నేర్చుకుంటానంది. నేను తోడుగా వెళ్లడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.


● గీతా గోదరా

ఆమె ఇటీవల దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ (బుడోకాన్ కప్)లో 83 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. 22 దేశాల నుంచి ఈ పోటీల్లో కరాటేలో పాల్గొంటే వారిలో మన దేశం నుంచి 30 మంది ఉన్నారు. ఇంత మందిలో గీతా గోదరా మెడల్ సాధించింది.

'రోజూ నా మనవరాలు చేస్తున్న సాధన చూస్తే నాక్కూడా కరాటే నేర్చుకోవాలనిపించింది. ట్రైనర్ సునీల్‌ను అడిగాను– నా వయసు వారు నేర్చుకోవచ్చా అని. ఏ వయసు వారైనా నేర్చుకోవచ్చు... ఆసక్తి ఉండటమే ప్రధానం అని చెప్పాడు. వెంటనే నేను కూడా నేర్చుకోవడం మొదలెట్టాను' అంది గీతా గోదరా.

కాని ఈ పరిస్థితి మనవరాలు ఆష్కాకు ఇబ్బంది తెచ్చి పెట్టింది. 'నాతో పాటుగా మా నాయనమ్మ కూడా కరాటే ప్రాక్టీసు చేస్తుంటే నా స్నేహితులు ఆట పట్టించారు. నేను కూడా మా నాయనమ్మ ఇది చేయకపోతే బాగుండు అనుకున్నాను. కాని అకాడెమీలో ఆమె అన్ని ఎక్సర్‌సైజులను చాలా బాగా చేస్తుంది. పంచ్ గట్టిగా విసురుతుంది. ఆమెలో బలం చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పుడు మెడల్స్ తెస్తుండటంతో గర్వపడుతున్నాను' అంది ఆష్కా.

'కరాటే మనసును, శరీరాన్ని ఒక తూగులో ఉంచుతాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. ఆత్మస్థయిర్యాన్ని కూడా ఇస్తాయి. ఇలాంటి ఒక వ్యాపకం ఉండటం స్త్రీలకు అవసరం' అంటోంది గీతా గోదరా.

స్త్రీలకు ఆత్మరక్షణ విద్యలు తప్పనిసరి అనిపిస్తున్న ఈ రోజుల్లో ఈ నానమ్మ, మనవరాలు ఇస్తున్న సందేశంతో స్ఫూర్తి పొందాల్సిందే.

బ్యూటిప్

జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే...



కప్పు పెసరపప్పును ఉడికించి మెత్తగా పేస్ట్ చేసి అందులో కోడిగుడ్డు సొన (పసుపు– తెలుపు మొత్తంగా), టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి రెండు గంటల తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. వారానికోసారి ఈ మూంగ్‌దాల్ హెయిర్ ప్యాక్ వేస్తే జుట్టు ఆరోగ్యంగా నిగనిగలాడుతూ, ఒత్తుగా పెరుగుతుంది.

గమనిక: ప్రతిరోజూ నానబెట్టి గ్రైండ్ చేయడం సాధ్యం కాకపోతే పెసలను మరపట్టించి పిండిని నిల్వ చేసుకుని రోజూ వాడుకోవచ్చు. తాజాగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పెసరలోని పోషకాలు త్వరగా చర్మానికి అందుతాయి.

సాగుబడి

రోహిణీ కార్తె : మే 25 నుంచి

5న ప్రకృతి రైతుల మహా సమ్మేళనం

జూన్ 5(సోమవారం)న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రకృతి రైతుల మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ గ్రౌండ్‌లో ఉ. 10 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుంది. పొలాన్ని అమ్మే వ్యవసాయం మానేద్దాం పొలాన్ని కొనుగోలు చేసే వ్యవసాయాన్నే చేద్దాం అనే నినాదంతో ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత కుమారస్వామి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 10 వేల మంది రైతులు, వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అందరూ ఆహ్వానితులే.

సాగు మారితే జీవవైవిధ్యం భద్రం!


కర్నూలు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో కనిపించిన పక్షి గూడు

రసాయనాల మయమైపోయిన వ్యవసాయ పద్ధతిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి, వాతావరణ మార్పుల్ని పంటలు ధీటుగా తట్టుకొని మంచి దిగుబడులు ఇవ్వడానికి అవకాశం ఉందన్నది తెలిసిందే. అదే విధంగా.. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తే పంటల్లో వైవిధ్యత పెరుగుతుంది. పక్షులు తదితర జీవరాశితోపాటు మట్టిలో సూక్ష్మ జీవరాశి వైవిధ్యత కూడా పెరుగుతుందని ఐరాసకి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య పరిరక్షణ దినోత్సవం(మే 22) సందర్భంగా మరికొన్ని విషయాలు..

- ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల్లో భూమి పైన పంటలు, పక్షులు, తేనెటీగల్లాంటి మిత్రపురుగులతోపాటు భూమి లోపల వానపాములు, సూక్ష్మజీవరాశికి సంబంధించిన జీవవైవిధ్యం 30–50% పెరుగుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైందని 'ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్' తాజా నివేదిక చెబుతోంది. ఈ క్షేత్రాల్లో పంటలు, పక్షులు, మిత్రపురుగులు, సూక్ష్మజీవుల సంఖ్య 50% ఎక్కువగా ఉంటుందని, వీటి జాతుల సంఖ్య 30% అధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.
- రసాయనాలు వాడని గడ్డిభూముల్లో కన్నా ప్రకృతి/సేంద్రియ పద్ధతుల్లో సాగయ్యే వార్షిక పంటల్లో, పండ్ల తోటల్లో జీవవైవిధ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.
- ప్రకృతి/సేంద్రియ సాగులో తేనెటీగలు, సాలీళ్లు, తదితర అరుదైన మిత్రపురుగుల సంఖ్య రసాయనిక క్షేత్రాలతో పోల్చితే 55% ఎక్కువగా, వీటి జాతుల వైవిధ్యం 27% ఎక్కువగా ఉందని నివేదిక తెలిపింది.
- ప్రకృతి/సేంద్రియ క్షేత్రాలు ఉన్న ప్రాంతాల్లో నాటు తేనెటీగల సంఖ్య, జాతుల వైవిధ్యంతో పాటు వాటి పునరుత్పత్తి రేటు కూడా పెరిగిందని ఐఫోమ్ ఆర్గానిక్స్ యూరప్ నివేదిక తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌లో 50 ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, 50 రసాయనిక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పక్షుల సంఖ్యపై ఏపీ ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్‌ఎఫ్) గత ఏడాది ఓ అధ్యయనం చేసింది.
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో రెండు తోకల పిట్ట, నేత పక్షి, గిజిగాడి గూడు పక్షి, పిగిలి పిట్టలు 2,3 రెట్లు ఎక్కువగా తరచూ తిరుగాడుతూ కనిపించాయని ఏపీసీఎన్‌ఎఫ్ నిపుణుడు ఈ అధ్యయనానికి సారథ్యం వహించిన ఏపీసీఎన్‌ఎఫ్ పరిశోధనా విభాగం హెడ్ డా. జాకిర్ హుస్సేన్ తెలిపారు. రసాయనిక క్షేత్రాల కన్నా ప్రకృతి పొలాలను ఎక్కువ పక్షులు సందర్శిస్తున్నాయన్నారు. పక్షుల రాక వల్ల శతృపురుగుల తీవ్రత తగ్గుతున్నదన్నారు.
- కర్నూలు జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే చోట ప్రకృతి పొలాల్లో నేత పక్షి గూళ్లు కనిపించటం విశేషం.

మిత్రపురుగుల సేద్యం

- ఎకలాజికల్ ఇంజనీరింగ్ సాగు పద్ధతులను ప్రాచుర్యంలోకి తెస్తున్న ఎన్.ఐ.పి.హెచ్.ఎం.


తోటల్లో చెట్ల వరుసల మధ్య ఇలా పూల మొక్కలు వేస్తే మిత్రపురుగులు వస్తాయి


ఎకలాజికల్ ఇంజనీరింగ్: పంటల మధ్య గట్లపై పూల మొక్కల పెంపకం


రోడ్ల పక్కన ఖాళీల్లో పూల మొక్కల పెంపకం.. ఇవే మిత్ర పురుగుల కారిడార్లు!


ఈ బొరియలూ తేనెటీగల ఆవాసాలే

తేనెటీగలు.. ఇవి 3 కోట్ల సంవత్సరాల క్రితం నుంచే భూగోళంపై జీవిస్తున్నాయి. మొక్కల/వ్యవసాయ జీవవైవిధ్యానికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు పరాగ సంపర్కం కీలకం. అడవిలో 90% మొక్కలు, చెట్లకు, 75% పంటలకు తేనెటీగలు తదితర ప్రాణుల వల్ల జరిగే పరాగ సంపర్కమే ఆధారం. 115 ప్రధాన ఆహార పంటలు ప్రపంచ ప్రజల ఆకలితీర్చుతున్నాయి. వీటిలో 87 పంటలు పుష్పించి సక్రమంగా పంట దిగుబడులు ఇస్తున్నాయంటే అందుకు 35% కారణం తేనెటీగలు తదితర చిరు మిత్ర జీవులే. రసాయనిక వ్యవసాయ పద్ధతులు, చెట్లను నరికేయటం వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది. తేనెటీగలు వంటి మిత్ర పురుగులను రక్షించుకోవటం మన ఆహార భద్రతకు, పర్యావరణ ఆరోగ్యానికి ప్రాణావసరమని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోంది. మనం వినిపించుకోవాలి.

ప్రతి నాలుగు పంటల్లో మూడు పంటలు తేనెటీగల సేవలు అందుకుంటున్నాయి. బాదం పంట దిగుబడులైతే నూటికి నూరు శాతం వీటిపైనే ఆధారపడి ఉంటుంది. తేనెటీగలకు 5 కళ్లు, రెండు రెక్కలుంటాయి. కొన్నయితే గంటకు 20 మైళ్లు ప్రయాణిస్తూ పరాగ సంపర్కానికి తోడ్పడుతుంటాయి.

పంటల మార్పిడి, వైవిధ్యత..

పర పరాగ సంపర్కానికి తోడ్పడే ఈ చిరుప్రాణులకు హాని కలిగించని బాధ్యతాయుతమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించమని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం (మే 20) సందర్భంగా ఎఫ్.ఎ.ఓ. పిలుపునిచ్చింది. 'పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, రసాయనిక పురుగుమందుల వాడకాన్ని తగ్గించటం, పరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు వంటి చిరు జీవులకు అవసరమైన ఆవాసాలను అంటే చెట్లను, పూల వనాలను పునరుద్ధరించటం, అభివృద్ధి చేయటం వంటి చర్యలు తీసుకోవాలని ఎఫ్.పి.ఓ. డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు, రైతులు ఈ పిలుపును అందుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గిస్తే నీటిలో వీటి అవశేషాలు తగ్గుతాయి. తేనెటీగలకు మేలు జరుగుతుంది అన్నారాయన.

తేనెటీగల పరిరక్షణకు స్లొవేనియా విశేష కృషి చేస్తోంది. 2016 నుంచి మే 20వ తేదీని అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకోవడానికి స్లొవేనియా ప్రభుత్వ కృషే కారణం. ఖండాంతర దేశాల్లో 300కు పైగా తేనెటీగల పరిరక్షణ కార్యక్రమాల్లో స్లొవేనియా భాగస్వామైంది.

* * *

తేనెటీగలను మింగుతున్న రసాయన సేద్యం

- బెంగళూరు గ్రామీణ ప్రాంతాల్లో 20% తగ్గిన మిత్రపురుగులు

వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న కొద్దీ సహజ తేనెటీగల సంఖ్య తగ్గిపోతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలింది. బెంగళూరు ప్రాంతంలో జరిగిన ఓ అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. నగరం చుట్టూతా విస్తరించిన 40 కిలోమీటర్ల ప్రాంతంలోని 60 గ్రామాల్లో అధ్యయనం చేస్తే సహజ తేనెటీగల సంఖ్య ఏకంగా 20% తగ్గినట్లు వెల్లడైంది. జర్మనీకి చెందిన గొట్టింజెన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం పరిశోధించింది. రసాయనిక వ్యవసాయం విస్తీర్ణం, సాంద్రత పెరుగుతున్నకొద్దీ తేనెటీగలు సమూహాలు తగ్గిపోతుండటాన్ని గుర్తించారు.

▶ నగరం నుంచి ప్రతి కిలోమీటరు దూరంగా వెళ్లే కొద్దీ ఆయా ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 2.4% మేరకు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ▶ 2016 డిసెంబర్– మే 2017 మధ్య 1275 కుటుంబాలపై అధ్యయనం చేశారు. ఇందులో 638 రైతు కుటుంబాలు. 3 కుటుంబాలకు చెందిన 31 జాతుల తేనెటీగలు ఆ ప్రాంతాల్లో గుర్తించారు. ▶ చెట్ల మీదనే కాకుండా నేలలో బొరియలు చేసుకొని ఆవాసాలను ఏర్పాటు చేసుకునే తేనెటీగలు ఉంటాయి. కాబట్టి, రసాయనిక పురుగుమందుల వల్లనే కాకుండా రసాయనిక ఎరువులు లేదా నీటి పారుదల వల్ల కూడా తేనెటీగల సంఖ్య తగ్గుతున్నట్లు గుర్తించారు. ▶ ఒక రైతు తన పొలంలో రసాయనిక ఎరువులు వాడటం లేదా నీటి తడి పెట్టడం చేస్తే అక్కడ తేనెటీగల సంఖ్య 20% తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

▶ పరిసరాల్లోని ఒక్కో పొలంలో పురుగుమందులు చల్లినప్పుడల్లా ఒక్కో శాతం తేనెటీగల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది. అత్యధికంగా 80% మంది రైతులు, సగటున 25% మంది రైతులు రసాయనిక పురుగుమందులు చల్లుతున్నారు. ఆ మేరకు తేనెటీగల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ▶ అనేక సంవత్సరాల నుంచి ఉధృతంగా రసాయనిక వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో తేనెటీగలు 8.1% మేరకు తగ్గింది.

▶ రోడ్డుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో తేనెటీగల సంఖ్య 17.3% తగ్గిపోయింది. అదేవిధంగా, దగ్గర్లో అడవి లేదా చెరువు ఉన్న చోట్ల 30–39% పెరిగింది. ▶ వ్యవసాయంలో విషరసాయనాలు, ముఖ్యంగా నియోనికోటినాయిడ్స్, వాడుతుండటం వల్ల తేనెటీగల నాడీవ్యవస్థ దెబ్బతింటున్నది. ఈ ప్రభావం వల్ల తేనె సేకరణకు వెళ్లిన తేనెటీగలు, ఇంకా ఇతర మిత్ర పురుగులు తిరిగి గూళ్లకు చేరకుండానే నేలరాలుతున్నట్లు పరిశోధకులు గుర్తించారంటున్నారు తేనెటీగల సంరక్షకురాలు జీవీ అపూర్వ.



ఎన్.ఐ.పి.హెచ్.ఎం. అధ్యయనం

హైదరాబాద్ రాజేంద్రనగరలోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్ఐపిహెచ్ఎం) శాస్త్రవేత్తలు తేనెటీగలు సహా అనేక మిత్ర పురుగుల వల్ల ఏయే పంటల సాగులో ఏ విధంగా ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేశారు. మిత్రపురుగుల సంరక్షణతో కూడిన 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' పద్ధతులపై జరిగిన అధ్యయనానికి అదనపు సంచాలకులు(పిహెచ్ఎం) డాక్టర్ ఈడ్పుగంటి శ్రీలత సారథ్యం వహించారు. పొద్దుతిరుగుడు, జనుము, మొక్కజొన్న, స్వీట్‌కార్న్, వంగ, బెండ, గుమ్మడి, సొర, బీర, చెర్రీ తదితర పంటలపై ఈ అధ్యయనం జరిగింది. గట్ల మీద పూల మొక్కలు సాగు చేశారు. 9 జాతులకు చెందిన 14 రకాల ఈగలు ఈ కూరగాయ తోటల్లో పరాగసంపర్కానికి దోహదపడినట్లు గుర్తించారు. అందులో 5 రకాల తేనెటీగలు ఉన్నాయి. వంగ తోటలో 14 రకాల ఈగలు కనిపించటం విశేషం.

ఎకలాజికల్ ఇంజనీరింగ్ అంటే?

'ఎకలాజికల్ ఇంజనీరింగ్' భావనను 1962లో తొలుత ప్రతిపాదించిన శాస్త్రవేత్త డా. హొవర్డ్ టి. ఒడుమ్. రసాయనిక సాంద్ర వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని గుర్తించి, పంట పొలాల్లో పర్యావరణ వ్యవస్థలను పునరుజ్జీవింపజేయటం, తద్వారా మొక్కలు, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం, ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవటం ఈ భావన ముఖ్య లక్ష్యం. భూమిని బాగు చేయడానికి ఆచ్ఛాదన పంటలు, పంటల మార్పిడి, పచ్చిరొట్ట పంటలను సాగు చేసి కలియదున్నటం, సేంద్రియ ఎరువులతో పాటు జీవన ఎరువులు, జీవ రసాయనాలు వినియోగించటం ఎకలాజికల్ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన అంశాలు.

మిత్రపురుగులను ఆకర్షించడానికి ఆకర్షక పంటలు, శత్రుపురుగులను ఆకర్షించి మట్టుబెట్టడానికి ఎర పంటలు, శత్రుపురుగులను పారదోలడానికి వికర్షక పంటలు, పురుగులు తోటలోకి రాకుండా చూడడానికి కంచె/సరిహద్దు పంటలు వేసుకోవటం చీడపీడల నియంత్రణలో కీలకం. 'పంటల తొలి 40 రోజుల్లో రసాయనిక పురుగుమందులు వాడకుండా ఉండటం ముఖ్యం. ఈ దశలోనే తేనెటీగలు సహా అనేక రకాల మిత్రపురుగులు వృద్ధి చెంది పంటకాలం అంతటా చీడపీడలను నియంత్రణలో ఉంచుతాయి..' అంటున్నారు డా. శ్రీలత . 86 పంటల 'ఎకలాజికల్ ఇంజనీరింగ్' కోసం వెబ్‌సైట్ చూడొచ్చు.. https://niphm.gov.in/


బెండ పంటను రక్షించే మిత్ర పురుగులు

అర్జున్ ఖాతాలో మూడో 'డ్రా'



షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో 'డ్రా' నమోదు చేశాడు. షాంట్ సర్గ్‌సియాన్ (అర్మేనియా)తో సోమవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను అర్జున్ 34 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఈ టోర్నీలో రెండు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిన అర్జున్ 3.5 పాయింట్లతో 18వ ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, నిహాల్ సరీన్, ఆర్యన్ చోప్రా నాలుగు పాయింట్లతో ఉమ్మడిగా రెండో ర్యాంక్‌లో ఉన్నారు.

చాంపియన్ సమీర్ వర్మ



ఐదేళ్ల తర్వాత భారత బ్యాడ్మింటన్ ప్లేయర్ సమీర్ వర్మ తన కెరీర్‌లో మరో అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. స్లొవేనియా ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో సమీర్ వర్మ విజేతగా నిలిచాడు. ఫైనల్లో సమీర్ వర్మ 21-18, 21-14తో సు లి యాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గాడు. విజేతగా నిలిచిన సమీర్‌కు 1200 డాలర్ల (రూ. 99 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది. చివరిసారి సమీర్ వర్మ 2018లో సయ్యద్ మోదీ సూపర్-300 టోర్నీలో టైటిల్ సాధించాడు.

'ఫైనల్'కు ముందెవరు?

చెన్నై, గుజరాత్‌ల మధ్య నేడు తొలి క్వాలిఫయర్

జోరు మీదున్న టైటాన్స్ ● ఆల్‌రౌండ్ సత్తాతో సూపర్‌కింగ్స్

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఐపీఎల్‌లో రెండు దీటైన జట్ల మధ్య ఢీ అంటే ఢీ అనే మ్యాచ్‌కు నేడు రంగం సిద్ధమైంది. మంగళవారం జరిగే తొలి క్వాలిఫయర్‌లో నాలుగుసార్లు చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్‌తో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. చెన్నై వేదికగా మ్యాచ్ జరగడం ధోని సేనకు అనుకూలత అయినప్పటికీ... ఈ జట్టుపై ఓటమి ఎరుగని గుజరాత్ కొండంత ఆత్మవిశ్వాసంతో ఉంది. ఈ నేపథ్యంలో రెండు సమఉజ్జీల మధ్య ఆసక్తికర సమరం గ్యారంటీ! దీంతో ప్రేక్షకులకు టి20 మెరుపులు, ఆఖరి ఓవర్ డ్రామాకు కొదవుండదు. ఇక చెన్నైలో గెలిచినా... ఓడినా... చివరి మజిలీ మాత్రం అహ్మదాబాదే! నెగ్గితే నేరుగా ఒక జట్టు ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు మరో ప్రయత్నంగా రెండో క్వాలిఫయర్‌లో ఆడుతుంది. ఈ రెండూ నరేంద్ర మోదీ స్టేడియంలోనే జరుగనున్నాయి.

చెన్నై చెలరేగితే...

బరిలోకి దిగే రెండు జట్లు బలమైన ప్రత్యర్థులు. చెన్నై ఐపీఎల్ ఆరంభం నుంచే లీగ్ ఫేవరెట్లలో ఒకటిగా ఎదిగింది. ధోని నాయకత్వంలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఎన్నోసార్లు నిరూపించుకుంది. ఈ సీజన్‌లోనూ సూపర్‌కింగ్స్ ఆట మేటిగానే ఉంది. టాపార్డర్‌లో రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వే, అజింక్య రహానే, శివమ్ దూబే ధనాధన్ షోకు శ్రీకారం చుడితే ప్రత్యర్థికి చుక్కలే! వెటరన్ ధోని బ్యాటింగ్‌లో వెనుకబడొచ్చేమో కానీ... జట్టును నడిపించడంలో ఎప్పటికీ క్రికెట్ మేధావే. మిడిలార్డర్‌లో అంబటి రాయుడు నుంచి ఈ సీజన్‌లో చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. బహుశా ఈ మ్యాచ్‌లో ఆ వెలతి తీర్చుకుంటాడేమో చూడాలి. ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, మొయిన్ అలీ... ఇక బౌలింగ్ దళంలో దీపక్ చహర్, తుషార్ దేశ్‌పాండే పవర్ ప్లేలో పరుగులిస్తున్నప్పటికీ వికెట్లను మాత్రం పడగొట్టేస్తున్నారు. తీక్షణ, పతిరణల వైవిధ్యం కూడా జట్టుకు కీలక సమయాల్లో ఉపయోగపడుతుంది.

టైటాన్స్ 'టాప్'షో

టోర్నీ మొదలైన మ్యాచ్‌లోనే చెన్నైపై గెలిచిన గుజరాత్ టైటాన్స్ లీగ్‌లో ఘనమైన ఆరంభమిచ్చింది. బెంగళూరుతో జరిగిన ఆఖరి మ్యాచ్‌లోనూ టైటాన్స్‌దే ఆధిపత్యం. సొంతగడ్డపై బెంగళూరు భారీస్కోరు చేసినా ఛేదించి మరీ నెగ్గింది. పాయింట్ల పట్టికైనా... ఆటలోనైనా... డిఫెండింగ్ చాంపియన్‌కు లీగ్ దశలో అయితే ఎదురే లేకపోయింది. ముఖ్యంగా ఇంపాక్ట్ ప్లేయర్‌ను పాండ్యా సేన సమర్థంగా సరైన దిశలో వినియోగించుకుంటుంది. శుబ్‌మన్ గిల్ లేదంటే విజయ్ శంకర్‌ల 'ఇంపాక్ట్' జట్టుకు అదనపు పరుగుల్ని కట్టబెడుతోంది. జట్టులో వీళ్లిద్దరే కాదు... సాహా నుంచి రషీద్ ఖాన్ దాకా ఇలా ఎనిమిదో వరుస బ్యాటర్ కూడా బాదేయగలడు. షనక, మిల్లర్, రాహుల్ తెవాటియాలు ధాటిగా ఆడగల సమర్థులు. దీంతో పరుగులకు, మెరుపులకు ఏ లోటు లేదు. ఇక బౌలింగ్ విషయానికొస్తే మోహిత్ శర్మ, నూర్ అహ్మద్, షమీ, రషీద్ ఖాన్ కలిసొచ్చే పిచ్‌పై మ్యాచ్‌నే మలుపుతిప్పే బౌలర్లు. ఏ రకంగా చూసుకున్నా ఎవరికీ ఎవరు తీసిపోరు కాబట్టి హేమాహేమీల మధ్య వార్ వన్‌సైడ్ అయితే కానే కాదు!

తుది జట్లు (అంచనా)

గుజరాత్ టైటాన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సాహా, గిల్, విజయ్ శంకర్, షనక, మిల్లర్, తెవాటియా, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, షమీ, మోహిత్ శర్మ/యశ్ దయాళ్.

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (కెప్టెన్), రుతురాజ్, కాన్వే, దూబే/పతిరణ, జడేజా, రహానే, మొయిన్, రాయుడు, దీపక్ చహర్, తుషార్, తీక్షణ.

పిచ్, వాతావరణం

ఎప్పట్లాగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశముంది. అయితే రాత్రయ్యేకొద్దీ తేమ కారణంగా బౌలర్లకు కష్టాలు తప్పవు. టాస్ నెగ్గిన జట్టు ఛేజింగ్‌తే మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన లేదు.

3 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఇప్పటి వరకు గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరగ్గా... మూడింటిలోనూ గుజరాత్ జట్టే గెలిచింది. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ చెన్నై నిర్దేశించిన లక్ష్యాలను గుజరాత్ ఛేదించింది. అయితే చెన్నై వేదికగా మాత్రం ఈ రెండు జట్లు తొలిసారి తలపడుతున్నాయి.

43 ఐపీఎల్ టోర్నీలో చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు మొత్తం 61 మ్యాచ్‌లు ఆడింది. 43 మ్యాచ్‌ల్లో నెగ్గింది. 18 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

24 ఐపీఎల్ టోర్నీ ప్లే ఆఫ్స్ దశలో చెన్నై మొత్తం 24 మ్యాచ్‌లు ఆడింది. 15 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. (తొలుత బ్యాటింగ్ చేసినపుడు 7 సార్లు... ఛేజింగ్‌లో 8 సార్లు). మిగతా 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

నీరజ్... నంబర్‌వన్

భారత జావెలిన్ త్రోయర్ ఘనత



న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత అథ్లెటిక్స్ ముఖచిత్రంగా మారిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన కెరీర్‌లో మరో గొప్ప ఘనతను సాధించాడు. సోమవారం విడుదల చేసిన వరల్డ్ అథ్లెటిక్స్ పురుషుల జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో నీరజ్ చోప్రా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తద్వారా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా అవతరించిన తొలి భారతీయ అథ్లెట్‌గా నీరజ్ గుర్తింపు పొందాడు. ప్రస్తుతం నీరజ్ 1455 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉండగా... ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 1433 పాయింట్లు) రెండో స్థానంలో, జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్; 1416 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నారు. గత ఐదేళ్లుగా నీరజ్ అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం... 2018 ఆసియా క్రీడల్లో స్వర్ణం... 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం... 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం... 2022 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం... 2022 డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్వర్ణం... ఇలా నీరజ్ అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తున్నాడు. తాజా సీజన్‌లో భాగంగా ఈనెలలో దోహాలో జరిగిన డైమండ్ లీగ్ తొలి సిరీస్‌లో నీరజ్ అగ్రస్థానంలో నిలిచాడు. తదుపరి వచ్చే నెలలో ఫిన్‌లాండ్‌లో జరిగే పావో నుర్మీ గేమ్స్‌లో నీరజ్ బరిలోకి దిగనున్నాడు.

భారత క్రికెట్ జట్టు కిట్ స్పాన్సర్‌గా అడిడాస్

చెన్నై: జర్మనీకి చెందిన ప్రముఖ క్రీడా ఉత్పాదనల సంస్థ అడిడాస్ భారత క్రికెట్ జట్టు కిట్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ప్రస్తుత స్పాన్సర్ 'కిల్లర్ జీన్స్'తో కాంట్రాక్టు గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త స్పాన్సర్‌షిప్ ఇచ్చింది. దీనిపై బోర్డు కార్యదర్శి జై షా మాట్లాడుతూ 'దేశంలో క్రికెట్ అభివృద్ధి అంచనాలను మించుతుంది. కాబట్టి ప్రపంచశ్రేణి సంస్థ మాతో జట్టు కట్టడంపై పెద్దగా ఆశ్చర్యమేమీ లేదు' అని అన్నారు. జర్మన్ స్పోర్ట్స్ బ్రాండ్ అయిన అడిడాస్‌తో ఒప్పందం ఎన్నేళ్లు, ఎంత మొత్తానికి స్పాన్సర్‌షిప్ పొందిందనే వివరాలేవీ ఆయన వెల్లడించలేదు. విశ్వసనీయ వర్గాల ప్రకారం రూ. 350 కోట్లతో అడిడాస్ కిట్ స్పాన్సర్‌షిప్ దక్కించుకున్నట్లు తెలిసింది. టీమిండియా వచ్చే నెల 7 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడుతుంది. ఆ జెర్సీలపై అడిడాస్ లోగో కనిపించనుంది. టీమ్ స్పానర్ బైజూస్ కూడా మారుతున్నట్లు తెలిసింది. ఈ నవంబర్ వరకు గడువున్నప్పటికీ సదరు సంస్థ ముందుగానే వైదొలగనుండటంతో త్వరలోనే బిడ్లను ఆహ్వానిస్తారు.

ప్రపంచ మాజీ టాప్ ర్యాంక్ జోడీకి సాకేత్-యూకీ షాక్



పారిస్: లియోన్-250 ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్‌లో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 7-6 (7/4), 3-6, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ జోడీ సెబాస్టియన్ కబాల్-రాబర్ట్ ఫరా (కొలంబియా) జోడీపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. గంటా 53 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్, యూకీ రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ ర్యాంకింగ్ ఆధారంగా వచ్చే వారం పారిస్‌లో మొదలయ్యే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా'కు సాకేత్, యూకీ అర్హత పొందారు.

శ్రీజ, శరత్ కమల్ పరాజయం



డర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. సింగిల్స్‌తోపాటు డబుల్స్ విభాగంలోనూ శ్రీజ ఇంటిదారి పట్టింది. సోమవారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 112వ ర్యాంకర్ శ్రీజ 2-11, 4-11, 2-11, 4-11తో ప్రపంచ పదో ర్యాంకర్ యింగ్ హాన్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ-దియా చితాలె (భారత్) జోడీ 8-11, 8-11, 11-13తో సన్ యింగ్షా-వాంగ్ మాన్యు (చైనా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత వెటరన్ స్టార్, 40 ఏళ్ల ఆచంట శరత్ కమల్ రెండో రౌండ్‌లో 4-11, 11-13, 8-11, 10-12తో లీ సాంగ్ సు (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో శరత్ కమల్-సత్యన్ (భారత్) జోడీ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో మనిక బత్రా-సత్యన్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ముందుగానే...

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో వచ్చే నెల 7 నుంచి 11 వరకు లండన్‌లో జరిగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ సన్నాహాల కోసం కోహ్లి సహా ఏడుగురితో కూడిన టీమిండియా బృందం నేడు లండన్‌కు వెళ్లనుంది. ఈ బృందంలో స్పిన్నర్లు అశ్విన్, అక్షర్ పటేల్, పేసర్లు సిరాజ్, శార్దుల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనాద్కట్ కూడా ఉన్నారు. కౌంటీల్లో ఆడుతున్న పుజారా లండన్‌లో జట్టుతో కలుస్తాడు. మిగిలిన సభ్యులు కెప్టెన్ రోహిత్ శర్మ, జడేజా, ఇషాన్, గిల్, షమీ, శ్రీకర్ భరత్, రహానేలు ఐపీఎల్ ముగిశాక వెళ్తారు.


విలక్షణ నటుడు శరత్‌బాబు ఇక లేరు

సినిమా

కథానాయకుడు, ప్రతినాయకుడు, సహాయ నటుడు... ఇలా ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయిన అందాల నటుడు శరత్‌బాబు (71) ఇక లేరు. మూడు నెలల కిందట అనారోగ్యానికి గురైన ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని, బెంగళూరు వెళ్లారు. అయితే మళ్లీ అస్వస్థతకు గురి కావటంతో బెంగళూరులోని ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు గత నెల 20న ఆయన్ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. శరత్‌బాబు శరీరంలో ఇన్‌ఫెక్షన్ (సెప్సిస్) వ్యాపించడంతో ఊపిరితిత్తులు, కాలేయం, ఇతర అవయవాలు దెబ్బతినగా, వెంటిలేటర్‌పై ఆయనకు చికిత్స అందించారు వైద్యులు. చివరికి మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌తో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో కన్ను మూశారు.

పోలీస్ కావాలనుకుని...

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 1951 జూలై 31న జన్మించారు శరత్‌బాబు. ఆయన అసలు పేరు సత్యంబాబు దీక్షిత్. శరత్‌బాబు తల్లితండ్రులకు ఎనిమిది మంది కుమారులు, ఐదుగురు కుమార్తెలు కాగా శరత్‌బాబు నాలుగో సంతానం. శరత్ తండ్రి విజయశంకర్ దీక్షితులు హోటల్ నడిపేవారు. ఆముదాలవలసలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదివారు శరత్‌బాబు. శ్రీకాకుళంలో ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదివారు. స్వతహాగా అందగాడైన శరత్‌బాబుని కాలేజీలో 'హీరో', 'గోల్డెన్ ఫిష్' అని స్నేహితులు పిలవడంతో పాటు 'నువ్వు హీరో అవ్వాలి' అని అనేవారట. శరత్‌బాబుకి మాత్రం పోలీస్ కావాలన్నది ఆశయం. కానీ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివేటప్పుడే కళ్లద్దాలు రావడంతో ఆ ఉద్యోగానికి అర్హుడు కాదనుకుని, ఆ ప్రయత్నం విరమించుకున్నారు శరత్‌బాబు. ఆ తర్వాతే సినిమాలపై దృష్టి మళ్లింది. అయితే తనలాగే కుమారుడు కూడా హోటల్ రంగంలోకి రావాలన్నది శరత్ తండ్రి కోరిక. అందుకే సినిమాల్లోకి వెళతానన్న శరత్‌ని ప్రోత్సహించలేదు. కానీ, తల్లి ప్రోత్సాహంతో నటుడు కావాలనుకున్నారు.



● శరత్ బాబు

తిరిగి ఊరెళ్లలేక...

దర్శక-నిర్మాత ఆదుర్తి సుబ్బారావు కొత్తవాళ్లతో సినిమా తీసి, హిట్ సాధించారని శరత్‌కి తెలిసింది. దీంతో 'నేను సినిమాలు చూస్తానంతే.. నటన తెలియదు. కానీ సినిమాల్లో నటించాలని ఉంది.. రమ్మంటే వస్తాను' అంటూ తన ఫొటోలతో పాటు ఒక ఉత్తరం పంపారు శరత్. ఆ లెటర్‌కి స్పందించి, మద్రాసు రమ్మని ట్రైన్ చార్జీలు కూడా పంపించారు ఆదుర్తి. మద్రాస్ వెళ్లి ఆదుర్తి సుబ్బారావుని కలిస్తే, 'ఓ హిందీ సినిమా చేస్తున్నాను. ఓ ఏడెనిమిది నెలల్లో తెలుగు సినిమా చేస్తాను.. అప్పుడు వస్తే చాన్స్ ఇస్తా' అన్నారట. అయితే తిరిగి ఊరెళ్లిపోవడం ఇష్టం లేక మద్రాసులోనే ఉండి, ప్రయత్నాలు సాగిద్దామని నిర్ణయించుకున్నారు శరత్‌బాబు.

నువ్వే మా హీరో అన్నారు

రామవిజేత అని ఓ సంస్థ కొత్త వాళ్లతో సినిమాలు తీస్తోందని విని, అవకాశం కోసం వెళ్లారు శరత్‌బాబు. అక్కడ దాదాపు వెయ్యి అప్లికేషన్స్ ఉన్నాయి. వాటిల్లో ఎంపిక చేసిన ముగ్గురిలో శరత్‌బాబు ఒకరు. స్క్రీన్ టెస్ట్ చేశాక, 'నువ్వే మా హీరో' అన్నారు. ఆ సినిమాయే 'రామరాజ్యం' (1973). ఆ షూటింగ్ జరుగుతున్నప్పుడు అట్లూరి పూర్ణచంద్రరావు స్క్రీన్ టెస్ట్ చేసి, 'స్త్రీ' చిత్రంలో సపోర్టింగ్ హీరోగా చేసే అవకాశం ఇచ్చారు. హీరోగా చేస్తూనే సహాయ నటుడిగా కీలక పాత్రలు చేస్తూ వచ్చారు. 'కన్నె వయసు, నోము, పంతులమ్మ, మరో చరిత్ర, రామకృష్ణులు, సీతాకోక చిలుక, ఇది కథ కాదు, తాయారమ్మ బంగారయ్య, మూడు ముళ్ల బంధం, శరణం అయ్యప్ప, సాగర సంగమం, సితార, అన్వేషణ, స్వాతి ముత్యం, సంసారం ఒక చదరంగం, శ్రీరామదాసు, మగధీర, శిరిడి సాయి తదితర చిత్రాల్లో మంచి పాత్రలు పోషించారు. ఉత్తమ సహాయ నటుడిగా 'సీతాకోక చిలుక (1981), ఓ భార్య కథ (1988), నీరాజనం (1989)' చిత్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డులు అందుకున్నారాయన.



● శరత్‌బాబు భౌతికకాయం

తమిళ్ ఎంట్రీ హిట్

బాలచందర్ దర్శకత్వంలో చేసిన 'నిళల్ నిజమాగిరదు' ద్వారా తమిళ్‌కి పరిచయమయ్యారు శరత్‌బాబు. ఆ సినిమా వంద రోజులు ఆడింది. అలా తమిళ్‌లో తొలి హిట్‌తో శరత్ కెరీర్ అక్కడా ఊపందుకుంది. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో దాదాపు 300 చిత్రాల్లో నటించారు.

ఇదే ఆఖరి జన్మ!

ఎప్పుడైనా కొంచెం డిస్టర్బ్ అయితే ధ్యానం చేసేవారు శరత్‌బాబు. ''దేవుడికి ఆకారం లేదు. అందుకే ధ్యానం చేసేటప్పుడు జ్యోతిని ఊహించుకుంటా. నేను దేవుణ్ణి బాగా నమ్ముతాను. ఆ నమ్మకం ఉన్నవాళ్లకి జన్మల మీద నమ్మకం ఉంటుంది. ఇదే నా ఆఖరి జన్మ అని నాకు తెలుసు' అని ఓ సందర్భంలో శరత్ పేర్కొన్నారు.

పెళ్లి-విడాకులు

వయసులో తనకంటే నాలుగేళ్లు పెద్ద అయిన నటి రమాప్రభని 1974లో వివాహం చేసుకున్నారు శరత్‌బాబు. పద్నాలుగేళ్ల తర్వాత 1988లో వీరు విడాకులు తీసుకున్నారు. అయితే వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారనే వార్త వినిపించేది. ''నా బ్లడ్ గ్రూప్‌తో పిల్లలు లేరు. నేనెవర్నీ దత్తత చేసుకోలేదు. నాకు 25 మంది పిల్లలున్నారు. నా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల పిల్లలు వాళ్లు'' అని గతంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు శరత్‌బాబు. తమిళ నటుడు నంబియార్ కుమార్తె స్నేహలతని పెళ్లాడారాయన. అయితే వీరిద్దరు కూడా విడిపోయారు.

బుల్లి తెరపైనా...

బుల్లితెరపై పదికి పైగా సీరియల్స్‌లో నటించారు శరత్‌బాబు. తమిళంలో చేసిన 'సిలంది వలై' (1987) సీరియల్ ద్వారా చిన్నితెరపై తొలిసారి కనిపించారు. తెలుగులో 1997 నుంచి 2001 వరకూ ప్రసారమైన 'అంతరంగాలు'లో నటించారు. ఇంకా 'జనని, 'అగ్నిగుండాలు' వంటి సీరియల్స్‌తో పాటు తమిళ, కన్నడంలోనూ పలు సీరియల్స్ చేశారు.

చివరి సినిమా.. 'మళ్ళీ పెళ్లి'

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తమిళంలో శరత్‌బాబు చేసిన చివరి చిత్రం 'వసంత ముల్లై' (2023). ఈ నెల 26న విడుదలకు సిద్ధమైన 'మళ్ళీ పెళ్లి'లో శరత్‌బాబు కీలక పాత్ర చేశారు. తెలుగులో ఆయనకు ఇదే చివరి సినిమా. వ్యక్తిగతంగా హార్సిలీ హిల్స్‌లో స్థిరపడాలనేది శరత్‌బాబు కోరిక. అక్కడ ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. అయితే నిర్మాణం పూర్తి కాలేదు. చివరికి శరత్ కోరిక నెరవేరలేదు.

నేడు అంత్యక్రియలు

శరత్‌బాబు తోడబుట్టినవాళ్లల్లో అన్నయ్య ఉమా దీక్షితులు, తమ్ముళ్లు గోపాల్, గోవింద్, సంతోష్, మధు, మంజు ఉన్నారు. శరత్‌బాబు రెండో అన్నయ్య రమా దీక్షితులు మూడేళ్ల కిందట మృతి చెందారు. అక్కచెల్లెళ్లు సిరి, రాణి, బేబీ, మున్ని, రోజా ఉన్నారు. శరత్‌బాబు మృతికి రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ తదితర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కాగా సోమవారం సాయంత్రం 2 గంటల పాటు హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో అభిమానుల సందర్శనార్థం శరత్‌బాబు భౌతికకాయాన్ని ఉంచి, ఆ తర్వాత చెన్నై తరలించారు. చెన్నైలో నేడు శరత్‌బాబు అంత్యక్రియలు జరుగుతాయి.

– శరత్‌బాబు సృజనాత్మకత కలిగిన వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి. సుదీర్ఘమైన చలనచిత్ర జీవితంలో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. శరత్‌బాబు మరణం బాధాకరం.
– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

– తెలుగు చలనచిత్ర రంగంలో కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగా అన్ని రకాల పాత్రలు పోషించి ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న గొప్ప నటులు శరత్‌బాబుగారు. ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లడం బాధాకరం.
– వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

– ఐదు దశాబ్దాలుగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 220కి పైగా చిత్రాల్లో నటించిన శరత్‌బాబు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు. శరత్ బాబు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.
– కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి

– శరత్‌బాబుగారు తన విలక్షణ నటనతో చెరగని ముద్ర వేశారు. అలాంటి దిగ్గజ నటుణ్ణి తెలుగు చిత్ర పరిశ్రమ కోల్పోయింది.
– తమిళిసై సౌందరరాజన్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్

నాకు.. నరేశ్‌కి ఆ అదృష్టం దక్కింది



● ఎమ్మెస్ రాజు, వీకే నరేశ్, జయసుధ, పవిత్రా లోకేశ్

''చిత్ర పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం అందరికీ కుదరదు. కానీ నాకు, నరేశ్‌కు ఆ అదృష్టం దక్కింది. విజయనిర్మలగారు 'పండంటి కాపురం' చిత్రం ద్వారా నన్ను, నరేశ్‌లను పరిచయం చేశారు. మన వ్యక్తిగత విషయాల పరంగా ఎవరికీ భయపడక్కర్లేదు'' అని నటి జయసుధ అన్నారు. **- జయసుధ**

వీకే నరేశ్, పవిత్రా లోకేష్ జంటగా ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. విజయ కృష్ణ మూవీస్‌పై వీకే నరేశ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'ఆకాశమే..' అనే సాంగ్‌ను జయసుధ విడుదల చేశారు. నటిగా యాభై ఏళ్లు పూర్తిచేసుకున్న జయసుధను నరేశ్ సత్కరించగా, నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న నరేశ్ ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో జయసుధ సత్కరించారు. వీకే నరేశ్ మాట్లాడుతూ–''నా రీల్ లైఫ్ బాగున్నా రియల్ లైఫ్ బాగోలేదు. ఇప్పుడు 50 ఏళ్లకు మా అమ్మ (విజయ నిర్మల) తర్వాత ఇంకో అమ్మను (పవిత్ర) కలుసుకున్నాను. జీవితంలో ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలని చెప్పే చిత్రమే 'మళ్ళీ పెళ్లి'' అన్నారు. ''నా కొత్త జీవితం ప్రారంభమైంది. 'మళ్ళీ పెళ్లి'లో నాకు మంచి పాత్ర ఇచ్చినందుకు రాజుగారు, నరేశ్‌గారికి థ్యాంక్స్'' అన్నారు పవిత్రా లోకేశ్. ''నా 12 ఏళ్లప్పుడు విజయ కృష్ణ మూవీస్‌లో 'మీనా' సినిమా చూశాను. ఇప్పుడు వారి బేనర్‌లో సినిమా చేస్తాననుకోలేదు. 'మళ్ళీ పెళ్లి' బోల్డ్ కథ'' అన్నారు ఎమ్మెస్ రాజు.

నంది అవార్డు ప్రతి ఆర్టిస్ట్ కల



● ప్రతాని రామకృష్ణ గౌడ్, అలీ

''1964 నుండి నంది అవార్డ్స్ ఇస్తున్నారు. ఆ అవార్డు అందుకోవాలనేది ప్రతి ఆర్టిస్ట్ కల. 7 సంవత్సరాల క్రితం ఆగిపోయిన నంది అవార్డ్స్‌ను తిరిగి ప్రారంభిస్తున్న ప్రతాని రామకృష్ణ గౌడ్‌గారికి థ్యాంక్స్. అలాగే సీనియర్ నటుల పేరుతో స్మారక అవార్డ్స్ ఇవ్వడం హర్షించదగ్గ విషయం'' అని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, నటుడు అలీ అన్నారు. **- అలీ**

'తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో ఆగస్టు 12న దుబాయ్‌లో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023' వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ అవార్డ్స్ ఇన్విటేషన్ బ్రోచర్‌ను అలీ, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ విడుదల చేశారు. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''దాదాపు ఆరేడు సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల సహకారంతో నంది అవార్డ్స్ పంపిణీ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ వేడుకకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తెలుగు రాష్ట్రాల సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతారు'' అన్నారు.

యూత్‌ఫుల్ ఐక్యూ



● సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ

సాయి చరణ్, పల్లవి, ట్రాన్సీ ముఖ్య తారలుగా జి.యల్.బి. శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఐక్యూ'. 'పవర్ ఆఫ్ స్టూడెంట్' అనేది ఉపశీర్షిక. కాయగూరల రాజేశ్వరి సమర్పణలో కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది. ''మేధావి అయిన ఓ విద్యార్థిని మెదడును అమ్మడానికి వాళ్ల ప్రొఫెసర్ ఏ విధంగా ప్లాన్ చేశాడు? ఆ అమ్మాయిని హీరో ఎలా కాపాడాడు? అన్న అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
234	111
61,964	18,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,713	▲	55
డోజోన్స్	33,305	▽	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,771	▲	14
డాక్స్	16,224	▽	51
షాంఘై	3,296	▲	13
నికాయ్	31,087	▲	278

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై


బంగారం (24 క్యారెట్)	60,829
బంగారం (22 క్యారెట్)	60,585
వెండి (కేజీ)	72,521

ఎకానమీపై ప్రభావం.. చాలా స్వల్పం

రూ. 2,000 నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

- కరెన్సీ నిర్వహణలో భాగంగానే ఉపసంహరణ ప్రక్రియ
- చలామణీలో ఉన్న కరెన్సీలో ఈ నోట్ల వాటా 11 శాతమే...
- గడువులోగా చాలా నోట్లు తిరిగి వచ్చేస్తాయని భావిస్తున్నాం
- ప్రస్తుతం నోట్లు చెల్లుబాటవుతాయి...
- సెప్టెంబర్ 30 తర్వాత తగు నిర్ణయం తీసుకుంటాం...
- డిపాజిట్లకు ప్రస్తుత కేవైసీ నిబంధనలే వర్తిస్తాయని స్పష్టీకరణ





న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థపై రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రభావం ''చాలా చాలా స్వల్పం''గానే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. చలామణీలో ఉన్న కరెన్సీలో వీటి వాటా 10.8 శాతమేనని (విలువపరంగా రూ. 3.6 లక్షల కోట్లు) వెల్లడించారు. కరెన్సీ నిర్వహణ కార్యకలాపాల్లో భాగంగానే ఉపసంహరణ ప్రక్రియను చేపట్టినట్లు సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇంతకు ముందు 2013–14లో కూడా ఈ తరహా ప్రక్రియ నిర్వహించినట్లు, అప్పట్లో 2005కు పూర్వం ముద్రించిన నోట్లను చలామణీ నుంచి ఉపసంహరించినట్లు ఆయన వివరించారు. స్వచ్ఛ నోట్ల విధానంలో భాగంగానే తాజాగా రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు చెప్పారు. ''చలామణీలో ఉన్న కరెన్సీలో రూ. 2,000 నోట్ల వాటా కేవలం 10.8 శాతమే కాబట్టి ఎకానమీపై దీని ప్రభావం చాలా చాలా తక్కువగానే ఉంటుంది. పైగా ఈ నోట్లను లావాదేవీల్లో ఎక్కువగా ఉపయోగించడం లేదని మా పరిశీలనలో తేలింది. కాబట్టి ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావమేమీ ఉండదు'' అని ఆయన వివరించారు. ప్రస్తుతానికి రూ. 2,000 నోట్ల చెల్లుబాటు యథాప్రకారంగానే కొనసాగుతుందన్న దాస్.. డిపాజిట్ చేసేందుకు, మార్చుకునేందుకు నిర్దేశించిన సెప్టెంబర్ 30 తర్వాత కూడా చెల్లుబాటవడంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దానిపై అప్పుడు తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. 10 నోట్లను మాత్రమే మార్చుకునేందుకు అవకాశం కల్పించడం వెనుక హేతుబద్ధతపై స్పందిస్తూ 2014 జనవరిలో కూడా దాదాపు ఇదే విధానం పాటించినట్లు దాస్ చెప్పారు. ఇక రూ. 1,000 నోట్లను తిరిగి ప్రవేశపెట్టడంపై బదులిస్తూ.. అది ఊహాజనిత ప్రశ్న అని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని స్పష్టం చేశారు.

పుష్కలంగా నిధులు..

ద్రవ్య నిర్వహణపై ఉపసంహరణ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ.. ప్రజల నుంచి నిధులకు ఉండే డిమాండ్‌ను బట్టి ఇది ఉంటుందన్నారు. ''కొంత మొత్తం బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ అవుతుంది. మరికొంత మొత్తాన్ని మార్చుకుంటారు. మార్చుకున్న కరెన్సీ అంతా తిరిగి ప్రజల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఖాతాల్లో డిపాజిట్ అయిన మొత్తాలను మాత్రం కస్టమర్లు బ్యాంకులోనే అట్టే పెట్టుకోవడమో లేదా తమ అవసరాల కోసం వెనక్కి తీసుకోవడమో జరగొచ్చు. ఏదైనా బ్యాంకింగ్ వ్యవస్థలో పుష్కలంగా నిధులు అందుబాటులో ఉన్నాయి'' అని దాస్ చెప్పారు.

నీరు, నీడ కల్పించండి..

రూ. 2,000 నోట్లను మార్చుకునేందుకు లేదా డిపాజిట్ చేసేందుకు వచ్చే కస్టమర్లకు తగు సౌకర్యాలు కల్పించాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎండలో పడిగాపులు కాసే పరిస్థితి రాకుండా తగు నీడ, తాగడానికి నీరు వంటి సదుపాయాలు అందించాలని పేర్కొంది. నోట్ల మార్పిడి, డిపాజిట్ల డేటాను రోజువారీ రికార్డులను నిర్వహించాలని ఒక నోటిఫికేషన్‌లో సూచించింది. 2016లో పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు నోట్లను మార్చుకునేందుకు చాంతాడంత లైన్లలో నిలబడి పలువురు మరణించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆర్‌బీఐ సూచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పీఎస్‌బీ చీఫ్‌లతో భేటీ..

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) చైర్మన్లు, డైరెక్టర్లతో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం సమావేశమయ్యారు. బ్యాంకుల్లో గవర్నెన్స్, నైతిక విలువలు తదితర అంశాలపై చర్చించారు.

ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు...

వ్యవస్థలోకి నల్లధనం వచ్చే అవకాశాలపై స్పందిస్తూ.. ఖాతాలో డిపాజిట్ చేయాలన్నా, నోట్లను మార్చుకోవాలన్నా ప్రస్తుతం నిర్దిష్ట ప్రక్రియ ఉందని దాస్ చెప్పారు. దాన్నే కొనసాగించాలని బ్యాంకులకు సూచించామని, అదనంగా కొత్త నిబంధనలేమీ పెట్టలేదని తెలిపారు. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం రూ. 50,000 దాటి నగదు డిపాజిట్ చేస్తే పాన్ తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందన్నారు. ఇక ఈ కసరత్తుతో కరెన్సీ నిర్వహణ వ్యవస్థపై పడే ప్రభావాలకు సంబంధించిన ప్రశ్నలకు స్పందిస్తూ.. మన వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని శక్తికాంత దాస్ తెలిపారు. తోటి దేశాలతో పోలిస్తే డాలరుతో భారత కరెన్సీ మారకం ఒడిదుడుకులకు లోనవడం చాలా తక్కువేనని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధం, సంపన్న దేశాల్లో కొన్ని బ్యాంకుల మూసివేతతో అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లలో సంక్షోభాలు తలెత్తినప్పటికీ భారతీయ కరెన్సీ స్థిరంగా నిల్చుందని దాస్ తెలిపారు.

అప్పుడేం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేను

ప్రస్తుతం రూ. 2,000 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటవడం కొనసాగుతుందని దాస్ చెప్పారు. ఎన్ని నోట్లు తిరిగి వస్తాయో వేచిచూడాల్సి ఉంటుందన్నారు. ''ఇప్పటికైతే చాలా మటుకు నోట్లు తిరిగి వచ్చేస్తాయనే అనుకుంటున్నాం. ఎన్ని వస్తాయన్నది చూడాలి. సెప్టెంబర్ 30 (మార్చుకునేందుకు, డిపాజిట్ చేసేందుకు ఆఖరు తేది) దగ్గరయ్యే కొద్దీ తగిన నిర్ణయాలు తీసుకుంటాం. దాని గురించి ఇప్పుడే నేను ఊహాజనిత సమాధానాలు ఇవ్వలేను'' అని దాస్ వ్యాఖ్యానించారు. నోట్ల మార్పిడికి, బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ చేసేందుకు బోలెడంత సమయం ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. విదేశీ పర్యటనల్లో ఉన్న వారు, వర్క్ వీసాలతో విదేశాల్లో ఉన్న వారు ఎదుర్కొనే సమస్యలను కూడా తాము పరిగణనలోకి తీసుకున్నామని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ కలుగకుండా ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడటమే తమ ప్రధాన ఉద్దేశమని దాస్ వివరించారు.

టీసీఎస్ కన్సార్షియంకు బీఎస్ఎన్ఎల్ 4జీ కాంట్రాక్ట్

విలువ రూ. 15,000 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్‌కు 4జీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసే కాంట్రాక్టును ఐటీ దిగ్గజం టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సారథ్యంలోని కన్సార్షియం దక్కించుకుంది. దీని విలువ రూ. 15,000 కోట్లు. దీనికి సంబంధించి బీఎస్ఎన్ఎల్ నుంచి అడ్వాన్స్ పర్చేజ్ ఆర్డర్‌ను అందుకున్నట్లు టీసీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో కొద్ది నెలలుగా దీనిపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ కాంట్రాక్టు గురించి ప్రకటించినప్పటి నుంచి టీసీఎస్ కంపెనీయే ముందు వరుసలో ఉందంటూ వార్తలు వచ్చాయి. ముంబై, న్యూఢిల్లీ మినహా బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా ఫిక్సిడ్ లైన్, వైర్‌లెస్, డేటా సర్వీసులను అందిస్తోంది. మరోవైపు టెలికం పరికరాల తయారీ సంస్థ ఐటీఐకి కూడా బీఎస్ఎన్ఎల్ రూ. 3,889 కోట్ల విలువ చేసే ఆర్డరు ఇచ్చింది. దీని ప్రకారం 18–24 నెలల వ్యవధిలో 23,633 సైట్ల కోసం 4జీ పరికరాలను సరఫరా చేయాల్సి ఉంటుందని ఐటీఐ వివరించింది.

టాటా అల్ట్రోజ్ సీఎన్‌జీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ అల్ట్రోజ్ ఐసీఎన్‌జీ వెర్షన్‌ను ఆరు వేరియంట్లలో ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్ ధర రూ.7.55 లక్షల నుంచి మొదలుకుని రూ.10.55 లక్షల వరకు ఉంది. ట్విన్ సిలిండర్ సీఎన్‌జీ టెక్నాలజీతో రూపుదిద్దుకుంది. భద్రతా కారణాల దృష్ట్యా ట్విన్ సిలిండర్లను లగేజ్ ఏరియా కింద ఏర్పాటు చేసినట్టు కంపెనీ తెలిపింది. ఆల్ట్రోజ్ ఐసీఎన్‌జీ మెరుగైన భద్రతా ఫీచర్లతో తయారైంది. ఇంధనం నింపే సమయంలో ఇంజన్ ఆఫ్ అవుతుంది. నిర్దిష్ట స్థాయిని మించి ఇంజిన్ వేడెక్కితే సీఎన్‌జీ సరఫరా నిలిచిపోవడమే గాక గ్యాస్‌ను గాలిలోకి వదులుతుంది.



మార్కెట్లకు మెటల్, ఐటీ దన్ను



- రెండో రోజూ లాభాలే
- సెన్సెక్స్ 234 పాయింట్లు అప్

ముంబై: వరుసగా రెండో రోజు దేశీ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 234 పాయింట్లు ఎగసి 61,964 వద్ద నిలిచింది. నిఫ్టీ 111 పాయింట్లు బలపడి 18,314 వద్ద ముగిసింది. ప్రధానంగా మెటల్, ఐటీ, హెల్త్‌కేర్ రంగాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి.

దిగ్గజాల జోరు

ఎన్ఎస్ఈలో మెటల్ ఇండెక్స్ 3.2 శాతం జంప్‌చేయగా.. ఐటీ 2.5 శాతం, హెల్త్‌కేర్ 1.6 శాతం చొప్పున ఎగశాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, ఆయిల్, రియల్టీ సైతం 0.7 శాతం చొప్పున పుంజుకున్నాయి. ఆర్‌బీఐ గవర్నర్‌తో సమావేశం నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంక్స్ 0.5 శాతం బలపడ్డాయి. ఇక నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ 20 శాతం దూసుకెళ్లగా.. అదానీ పోర్ట్స్ 6.4 శాతం జంప్ చేసింది. ఇతర బ్లూచిప్స్‌లో దివీస్, అపోలో హాస్పిటల్స్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సన్ ఫార్మా, ఎల్‌అండ్‌టీ, డాక్టర్ రెడ్డీస్, జేఎస్‌డబ్ల్యూ, ఐటీసీ, సిప్లా 5–1 శాతం మధ్య లాభపడ్డాయి. మరోపక్క ఐషర్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ, టాటా మోటార్స్, కోల్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.5 శాతం స్థాయిలో డీలా పడ్డాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి విలువ 17 పైసలు క్షీణించి 82.84ను తాకింది.

జోస్ ఆలుక్కాస్.. హెచ్‌యూఐడీ 'ఫెస్ట్'



హైదరాబాద్: దక్షిణ భారత్‌లో ప్రముఖ జ్యువెల్లరీ గ్రూప్‌ల్లో ఒకటైన జోస్ ఆలుక్కాస్, హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్ అమలును వేగవంతం చేయడానికి తనవంతు సహకారాన్ని అందిస్తోంది. ఇందుకు హెచ్‌యూఐడీ ఎక్స్ఛేంజ్ ఫెస్ట్ సహా పలు కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. బీఐఎస్-916 హాల్‌మార్క్ కలిగిన ఆభరణాలను ప్రవేశపెట్టి, విక్రయించిన మొదటి జ్యువెల్లరీ గ్రూప్‌గా నిలిచిన సంస్థ, ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ యూనిక్ ఐడెంటిఫికేషన్ కోడ్ (హెచ్‌యూఐడీ)తో తన బంగారు నిల్వల్లో మొత్తం 100 శాతాన్ని హాల్‌మార్క్ చేసినట్లు పేర్కొంది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్ క్యాట్) 02/2023

వాయుసేనలో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్‌ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-02/2023)కు సంబంధించి ప్రకటన విడుదలైంది.

» **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/టెక్నికల్/వెపన్ సిస్టమ్ /అడ్మినిస్ట్రేషన్ /లాజిస్టిక్స్/అకౌంట్స్/ఎడ్యుకేషన్/మెటియరాలజీ.
» **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్(ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికేట్).
» **అర్హత:** ఇంటర్(ఫిజిక్స్, మ్యాథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్–1, స్టేజ్–2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్ పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023
» **వెబ్‌సైట్:** www.afcat.cdac.in

సీపీగెట్-2023

తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది విశ్వవిద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరం (2023–24) సంప్రదాయ పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్(సీపీగెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహిస్తోంది.

» **పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు:** ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంటీఎం, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐబీఎస్సీ, బీఎల్ఐబీఎస్సీ.
» **అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సు విభాగాలు:** బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ /ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, అప్లైడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏ.
» **పీజీ డిప్లొమా కోర్సులు–విభాగాలు:** చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్.
» **అర్హత:** పీజీ,పీజీడీ కోర్సులకు కనీసం 40శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఎడ్, ఐపీజీ కోర్సులకు కనీసం 50శాతం మార్కులతో 10+2/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష,రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ప్రవేశ పరీక్ష:** సంబంధిత సబ్జెక్టులో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు తేదీలు:** మే 12 నుంచి జూన్ 11
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తు తేదీలు:** జూన్ 12–18
» **రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తు తేదీలు:** జూన్19–20
» **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు:** జూన్ చివరి వారం నుంచి
» **వెబ్‌సైట్:** www.cpget.tsche.ac.in

ఇండియన్ నేవీలో 372 చార్జ్‌మ్యాన్ పోస్టులు

భారత నౌకాదళం ఇండియన్ నావల్ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా చార్జ్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు హెడ్‌క్వార్టర్స్ వెస్టర్న్ నేవల్ కమాండ్(ముంబై),హెడ్‌క్వార్టర్స్ ఈస్టర్న్ నేవల్ కమాండ్(విశాఖపట్నం), హెడ్‌క్వార్టర్స్ సదరన్ నేవల్ కమాండ్ (కొచ్చి), హెడ్‌క్వార్టర్స్ అండమాన్ నికోబార్ కమాండ్(పోర్ట్ బ్లెయిర్) యూనిట్లలో పనిచేయాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 372
» **గ్రూప్:** ఎలక్ట్రికల్, వెపన్, ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ అండ్ మెయింటెనెన్స్, ప్రొడక్షన్ ప్లానింగ్ అండ్ కంట్రోల్.
» **ట్రేడులు:** ఎలక్ట్రికల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ఫిట్టర్, గైరో ఫిట్టర్, రేడియో ఫిట్టర్, రాడార్ ఫిట్టర్, సోనార్ ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంట్ ఫిట్టర్, కంప్యూటర్ ఫిట్టర్, వెపన్ ఫిట్టర్, బాయిలర్ మేకర్, ఇంజన్ ఫిట్టర్, ఫౌండర్, జీటీ ఫిట్టర్, ఐస్ ఫిట్టర్, పైప్ ఫిట్టర్, మెషినిస్ట్, మెషినరీ కంట్రోల్ ఫిట్టర్, రెఫ్రిజిరేషన్ అండ్ ఏసీ ఫిట్టర్, ప్లేటర్, వెల్డర్, షిప్ రైట్, లాగర్, షిప్ ఫిట్టర్, మిల్ రైట్, ఐస్ ఫిట్టర్ క్రేన్, పెయింటర్, సివిల్ వర్క్స్, పీపీ అండ్ సి.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 29.05.2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఏపీ, టీఎస్‌లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.05.2023
» **వెబ్‌సైట్:** www.indiannavy.cbexams.com

బోధన, పరిశోధనలకు మార్గం

» యూజీసీ-నెట్ 2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోసం నెట్ పరీక్ష
» జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.31 వేల ఫెలోషిప్

పరిశోధనల పట్ల ఆసక్తి ఉందా.. అధ్యాపక వృత్తిలో బోధన రంగంలో స్థిరపడాలని కోరుకుంటున్నారా.. అయితే మీకు సరైన మార్గం.. యూజీసీ-నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్)!! జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలో విజేతగా నిలిస్తే.. జేఆర్ఎఫ్ సొంతం చేసుకొని పరిశోధనల దిశగా అడుగులు వేయొచ్చు. మరోవైపు అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో కెరీర్ ప్రారంభించే అవకాశం కూడా ఉంది. ఇటీవల యూజీసీ-నెట్ 2023(జూన్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ నెట్ వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రయోజనాలు, ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..

83 సబ్జెక్టులలో యూజీసీ నెట్

యూజీసీ–నెట్ 2023ను మొత్తం 83 సబ్జెక్ట్‌లలో నిర్వహించనున్నారు. వీటిలో ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, కామర్స్, హిస్టరీ, ఎకనామిక్స్ వంటి సంప్రదాయ సబ్జెక్ట్‌లతోపాటు.. డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్, ఫోరెన్సిక్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, క్రిమినాలజీ, కంప్యూటర్ సర్వీస్ అండ్ అప్లికేషన్ తదితర సైన్స్ సంబంధిత సబ్జెక్టులు సైతం ఉన్నాయి. అదేవిధంగా మేనేజ్‌మెంట్, లాంగ్వేజెస్, ఫారెన్ లాంగ్వేజెస్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌ల్లోనూ యూజీసీ నెట్‌ను నిర్వహించనున్నారు.

జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్

యూజీసీ నెట్ ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారు జేఆర్ఎఫ్ ఆధారంగా పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా యూనివర్సిటీల్లో అధ్యాపకుడిగా బోధన రంగంలో చేరేందుకు అర్హత లభిస్తుంది.

అర్హతలు

- పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు లభిస్తుంది. –పీజీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** జేఆర్ఎఫ్ అభ్యర్థుల వయసు జూన్ 1, 2023 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. ఓబీసీ–ఎన్‌సీఎల్, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఉంటుంది.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి లేదు.

రెండు కేటగిరీలుగా పరీక్ష

- జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనే రెండు కేటగిరీల్లో యూజీసీ–నెట్‌ను నిర్వహిస్తారు. కాబట్టి అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరవ్వాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవచ్చు.
- అధ్యాపక వృత్తిలో స్థిరపడాలనుకుంటే.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను తమ ప్రాథమ్యంగా ఎంచుకోవాలి.

యూజీసీ నెట్‌తో ప్రయోజనాలివే

- యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించి తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు పలు అవకాశాలు లభిస్తున్నాయి.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో అర్హత సాధించిన వారినే ఈ పోస్ట్‌లకు ఎంపిక చేయాలి.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో మూడేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా పనిచేయొచ్చు. తొలి రెండేళ్లు జేఆర్ఎఫ్ హోదాలో నెలకు రూ.31 వేల ఫెలోషిప్ పొందొచ్చు.
- జేఆర్ఎఫ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారికి సైంటిస్ట్‌లుగా ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది.
- ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌ల్లో జేఆర్ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ విభాగాల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు దక్కుతాయి.



రెండు పేపర్లు-300 మార్కులు

- యూజీసీ నెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో రెండు పేపర్లుగా జరుగుతుంది. మొత్తం 300 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి.
- పేపర్–1 టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–100 మార్కులకు; పేపర్–2 సబ్జెక్ట్ సంబంధిత పేపర్ 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- పేపర్–1కు అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఆర్ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి.
- పేపర్–2ను అభ్యర్థుల పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా యూజీసీ నెట్‌లో అర్హత ఉన్న సబ్జెక్ట్‌కు సంబంధించిన పరీక్షగా నిర్వహిస్తారు.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌కు హాజరైన అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాలి. అప్పుడే ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ, జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. హాజరైన మొత్తం అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా ప్రకటించనున్నారు.

బెస్ట్ స్కోర్‌కు మార్గాలివే

జాతీయ స్థాయిలో నిర్వహించే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే..అభ్యర్థులు సబ్జెక్ట్‌పై సంపూర్ణ అవగాహన పెంచుకోవడం చాలా అవసరం.

పేపర్-1 ఉమ్మడిగా

అభ్యర్థులందరికీ ఉమ్మడి పరీక్ష..పేపర్–1. ఇందులో టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలుంటాయి. మొత్తం పది విభాగాల(టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి.. ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2.. సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలు

పేపర్–2లో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచే ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ప్రాక్టికల్ అప్రోచ్

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ఆయా అంశాలను చదివేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. కారణం..పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు ప్రాక్టికల్ థింకింగ్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌లు ఎంతో అవసరమవుతున్నాయి. క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ అప్రోచ్ మెరుగుపరచుకుంటే.. ప్రశ్నలు ఏ విధంగా అడిగినా సమాధానాలు ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 31, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** జూన్ 2, 3 తేదీల్లో
- **యూజీసీ నెట్ తేదీలు:** జూన్ 13 నుంచి 22 వరకు (ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12:30 వరకు; మధ్యాహ్నం 3 నుంచి 6 వరకు)
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://ugcnet.nta.nic.in, www.nta.ac.in

క్లుప్తంగా...

రేపు వ్యవసాయ వర్సిటీలో విత్తన మేళా

అందుబాటులో 45 రకాల వంగడాలు



సాక్షి, హైదరాబాద్: రైతులకు నాణ్యమైన విత్తనం అందించాలనే ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈనెల 24న బుధవారం విత్తన మేళా నిర్వహిస్తోంది. రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియం సమీపంలో ఈ మేళా జరగనుంది. అదే రోజు విశ్వవిద్యాలయం పరిధిలోని మూడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు (జగిత్యాల, పాలెం, వరంగల్), కృషి విజ్ఞాన కేంద్రాల్లో కూడా విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు పరిశోధనా సంచాలకులు డాక్టర్ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పంటల్లో 45 వంగడాలకు సంబంధించి 15 వేల క్వింటాళ్ల విత్తనాలను విక్రయిస్తామని వెల్లడించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూపొందించిన జీవన ఎరువులు, చీడపీడల నివారణలో వాడే పరాన్న జీవులు మొదలైనవి రైతుల కొనుగోలు నిమిత్తం అందుబాటులో ఉంటాయి. దీంతోపాటు వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతుల సందేహాలు తీర్చడానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడానికి వీలుగా వ్యవసాయ, అనుబంధ రంగాలతో కూడిన వ్యవసాయ ప్రదర్శన కూడా అదే రోజు నిర్వహిస్తున్నారు. ఈ విత్తన మేళాను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్ రెడ్డి ప్రారంభిస్తారు.

గుండెపోటుతో గాంధీ ఆసుపత్రి వైద్యుడు మృతి


డాక్టర్ ఫణీంద్ర

బన్సీలాల్‌పేట్(హైదరాబాద్): సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి పీడియాట్రిక్స్ సర్జరీ విభాగం డాక్టర్ ఫణీంద్ర(37) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఫణీంద్రకు తెల్లవారు జామున గుండెపోటు రావడంతో కుప్పకూలారు. వెంటనే ఆయన భార్య ఫణీంద్రను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే ఫణీంద్ర అప్పటికే మరణించినట్లు గాంధీ వైద్యులు ధ్రువీకరించారు. డాక్టర్ ఫణీంద్రకు కొన్ని నెలల కిందటే వివాహమైంది. ఫణీంద్ర భార్య కామారెడ్డి జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఫణీంద్ర ఆకస్మిక మరణంగా పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, పీడియాట్రిక్స్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ నాగార్జున దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ వైద్యుడి ఆకస్మిక మరణం బాధాకరమన్నారు.

రెండ్రోజులు మోస్తరు వానలు

సాక్షి, హైదరాబాద్: విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండ్రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38డిగ్రీల సెల్సియస్ నుంచి 41డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతుందని వాతావరణ శాఖ వివరించింది. సోమవారం గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 41.7 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	41.7	మెదక్	39.2
ఆదిలాబాద్	41.3	భద్రాచలం	39.0
నల్లగొండ	41.0	హైదరాబాద్	37.2
రామగుండం	40.2	మహబూబ్‌నగర్	37.2
హనుమకొండ	40.0	హకీంపేట్	37.0
ఖమ్మం	39.6	దుండిగల్	37.0

● ఫొటో దిగు.. ఫ్రేమ్ కట్టిస్తా..



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పడమటితండా, సింగరాజుపల్లి గ్రామాల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో కార్యకర్తలతో ఫొటోలు దిగారు. మీరు దిగిన ఫొటోలను లామినేషన్ చేయించి ఇంటింటా అందిస్తానని మంత్రి ప్రకటించారు. దీంతో చాలామంది కార్యకర్తలు క్యూలో నిలబడి మంత్రితో ఫొటోలు దిగారు. –దేవరుప్పుల

● శిశుగృహలో మంత్రి మనవరాలి హ్యాపీ బర్త్ డే



రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మనవరాలు ఆద్య పుట్టినరోజు వేడుకలు మధురానగర్ శిశు సంక్షేమ శాఖ ప్రాంగణంలోని అనాథ ఆశ్రమంలో సోమవారం నిర్వహించారు. అనాథ పిల్లలతో కలిసి ఆద్య కేక్ కట్ చేశారు. ఆమెకు అక్కడి చిన్నారులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలతో కలిసి భోజనం చేసిన మంత్రి.. వారికి గోరుముద్దలు తినిపించారు. – వెంగళరావునగర్

వచ్చే నెల్లోనే ఎంసెట్ కౌన్సెలింగ్

ఈ నెలాఖరులోగా ఫలితాల వెల్లడి ● ఆగస్టు నుంచి ఇంజనీరింగ్ క్లాసులు ● ఉన్నత విద్యామండలి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జూన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుపెట్టేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. వచ్చే నెల రెండో వారం దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇవ్వాలని నిర్ణయించింది. మూడో వారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసి, నాల్గో వారం కల్లా మొదటి విడత జాబితా విడుదల చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి సోమవారం నిర్ణయించారు. ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన ఇంజనీరింగ్ ఎంసెట్ ఫలితాలు ఈ నెలాఖరులోగా విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మార్కుల క్రోడీకరణ, డీ కోడింగ్ తుది దశకు చేరుకున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి సూచనల మేరకు ఆగస్టు మొదటి వారం నుంచి ఇంజనీరింగ్ క్లాసులు నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. కోవిడ్ మూలంగా మూడేళ్లుగా ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. సెప్టెంబర్‌లో ఇంజనీరింగ్ క్లాసులు మొదలవుతున్నాయి. ఇక నుంచి అలాకాకుండా సకాలంలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ క్లాసులు మొదలయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, ఈ ఏడాది వర్సిటీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ వేగం పెంచారు. మౌలిక వసతులు, సరైన ఫ్యాకల్టీ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

'జోసా' కౌన్సెలింగ్ తర్వాత స్పాట్...

జాతీయ ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంజనీరింగ్ కాలేజీల భర్తీ ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తారు. 'జోసా' షెడ్యూల్ ప్రకారం జూలై మూడో వారంలో జాతీయ కాలేజీల్లో సీట్ల భర్తీ పూర్తవుతుంది. రాష్ట్రంలో ఎంసెట్ ర్యాంకు వచ్చిన వాళ్లు కూడా జాతీయ కాలేజీల్లో సీట్ల కోసం యత్నిస్తారు. నచ్చిన బ్రాంచీ, కాలేజీ రాని పక్షంలో రాష్ట్రంలోని ఎంసెట్ కాలేజీల్లో సీట్లకు ప్రయత్నిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 'జోసా' కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఎంసెట్ కౌన్సెలింగ్ ఆఖరి విడత, స్పాట్ అడ్మిషన్లు చేపట్టే ఆలోచనలో ఉన్నత విద్యామండలి ఉంది.

డిగ్రీ ఏదైనా ఎంకాం కోర్సులో చేరొచ్చు

టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ పాండురంగారెడ్డి వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీ ఏదైనా రాష్ట్ర యూనివర్సిటీలో ఏ కాలేజీలోనైనా ఎంకాంలో ప్రవేశం పొందవచ్చని టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంకాంలో ప్రవేశాలకు బీకాంతో పాటు బీఏ, బీఏ లిట్రేచర్స్, ఎల్ఎల్‌బీ, బీఈడీ, బీపీఈడీ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ఇతర డిగ్రీలు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించినట్లు వివరించారు. టీఎస్‌సీపీజీఈటీ–2023లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూతో పాటు కాకతీయ, శాతావాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ వర్సిటీల పరిధిలోని కళాశాలల్లో ఎంకాం కోర్సులో ప్రవేశం కల్పించనున్నట్లు కన్వీనర్ సోమవారం నాడిక్కడ వెల్లడించారు. టీఎస్‌సీపీజీఈటీ–2023కు ఇంతవరకు 15 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కాగా, ఎంకాంలో ప్రవేశాలకు అన్ని డిగ్రీలకూ అవకాశం కల్పించినందున టీఎస్‌పీజీఈటీ–2023 ఎంట్రన్స్ టెస్ట్‌లో మార్పులు చేసినట్లు ఓయూ కామర్స్ విభాగం బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొ.అప్పారావు సోమవారం తెలిపారు. గతంలో మాదిరి పూర్తిగా కామర్స్ సబ్జెక్టు నుంచే ప్రశ్నలు కాకుండా, ఇతర అంశాల నుంచి కూడా 50 మార్కులకు ప్రశ్నలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంకాం ఎంట్రన్స్ టెస్ట్‌లో 100 మార్కులకు గాను 50 మార్కులు పూర్తిగా కామర్స్ సబ్జెక్టు నుంచి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. డిగ్రీలో కామర్స్‌పై అవగాహన లేని విద్యార్థులకు శిక్షణ అవసరమన్నారు.

'ప్రభుత్వం శుభవార్త చెప్పింది'

సాక్షి,హైదరాబాద్: వీఆర్‌ఏల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై వీఆర్‌ఏ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర జేఏసీ నాయకులు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర దశాబ్ది వేడుకల సందర్భంగా 23వేల మంది వీఆర్‌ఏల కుటుంబాలకు శుభవార్త చెప్పిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

డీజీపీని కలిసిన రాకేశ్ మనోచ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ–ఆంధ్ర సబ్ ఏరియా మేజర్ జనరల్ రాకేశ్ మనోచ సోమవారం డీజీపీ అంజనీకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన ఇరుశాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం డీజీపీ.. తెలంగాణ పోలీస్ కాఫీటేబుల్ బుక్‌ను రాకేశ్ మనోచకు బహూకరించారు.

ఎన్టీపీపీ రెండో దశపై నీలినీడలు!

9 ఏళ్లు గడిచినా పనులు ప్రారంభించని ఎన్టీపీసీ
- ఇప్పటికీ జారీ కాని పెట్టుబడి అనుమతి
- ఎన్టీపీసీతో ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం అనాసక్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎన్టీపీపీ) రెండో దశ విద్యుత్ కేంద్రం నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇంకా రెండో దశ ప్రాజెక్టు పనులను ఎన్టీపీసీ యాజమాన్యం ప్రారంభించలేదు. రెండో దశ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు కీలకమైన పెట్టుబడి అనుమతులు జారీ చేయలేదని తాజాగా ఎన్టీపీసీ యాజమాన్యం స్వయంగా సమాచార హక్కు చట్టం కింద వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)తోపాటు నీళ్ల ఒప్పందం, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతి, కోల్ లింకేజీ జరిగిన తర్వాతే పెట్టుబడి అనుమతులు జారీ అవుతాయని స్పష్టం చేసింది. సమాచార హక్కు కార్యకర్త ఇనగంటి రవికుమార్ అడిగిన సమాచారం మేరకు ఎన్టీపీసీ పై సమాధానం ఇచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీ మేరకు ఎన్టీపీసీ 4000 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాల్సి ఉంది.

తొలి యూనిట్ పనులు 96% పూర్తి

తొలి దశ కింద రామగుండంలో 1,600 (2800) మెగావాట్ల సామర్థ్యంతో ఎన్టీపీసీ 2016లో నిర్మాణాన్ని ప్రారంభించింది. తొలి విడతలో భాగంగా నిర్మిస్తున్న 800 మెగావాట్ల తొలి యూనిట్ పనులు 96శాతం, మరో 800 మెగావాట్ల రెండో యూనిట్ పనులు 93 శాతం పూర్తయ్యాయి. రూ.10,599 కోట్ల అంచనా వ్యయంతో తొలి దశ ప్రాజెక్టును చేపట్టగా, గత మార్చి నాటికి రూ.10,437 కోట్ల వ్యయం జరిగింది. పనుల్లో జాప్యంతో అంచనా వ్యయాన్ని రూ.10,998 కోట్లకు పెంచింది.

డిస్కంలకు భారంగా మారుతుందనే..

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. మరో 800 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఇటీవల అనుమతి ఇచ్చింది. యాదాద్రి ప్లాంట్ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో భారీగా మిగులు విద్యుత్ ఉండనుందని, ఈ నేపథ్యంలో ఎన్టీపీసీ రెండో విడత ప్లాంట్ నిర్మాణం కోసం ఆ సంస్థతో ఒప్పందం (పీపీఏ) చేసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విముఖంగా ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పీపీఏ ఉంటేనే పెట్టుబడి రుణాలను బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుంచి సేకరించడానికి ఎన్టీపీసీకి వీలుంటుంది. ఏదైనా విద్యుత్ కేంద్రంతో డిస్కంలు పీపీఏ చేసుకుంటే, భవిష్యత్తులో విద్యుత్ అవసరం లేదని కొనుగోలు చేయకున్నా ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో విద్యుత్ కేంద్రానికి బిల్లులు చెల్లించక తప్పదు. ఈ నేపథ్యంలో డిస్కంలపై భవిష్యత్తులో ఎన్టీపీసీ రెండో దశ పీపీఏ భారంగా మారుతుందనే భావనతో ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదని ప్రభుత్వవర్గాలు చెప్పాయి.

ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యం

గడిచిన 9 సంవత్సరాలలో 22,263 పోస్టులు భర్తీ
- మరో రెండు మూడు నెలల్లో 9,222 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి
- అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామక పత్రాలను అందజేసిన మంత్రి హరీశ్


శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేసిన అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మంత్రి హరీశ్‌రావు

మాదాపూర్ (హైదరాబాద్): టీచింగ్ ఆసుపత్రులలో సేవలు అందించేందుకు 34 స్పెషాలిటీల్లో 1,061 మందికి ఒకేసారి పోస్టింగులు ఇచ్చినట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైద్య,ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించామని, వైద్యులను, నర్సులను, ఇతర సిబ్బందిని భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా టీచింగ్ ఆసుపత్రులలో సేవలు అందించేందుకు 34 స్పెషాలిటీలలో 1,061 మందికి ఒకేసారి పోస్టింగ్‌లు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల కలను సాకారం చేస్తూ సీఎం కేసీఆర్ వైద్యశాఖలోని ఏడు విభాగాల్లో మొత్తం 1,331 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించినట్టు తెలిపారు. గడిచిన 9 సంవత్సరాలలో వైద్య,ఆరోగ్యశాఖలోనే 22,263 పోస్టులు భర్తీ కాగా, మరో 9,222 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రెండు, మూడు నెలల్లో ఇది పూర్తవుతుందని చెప్పారు. వైద్య విద్యార్థులపై ప్రభుత్వం కోటి రూపాయలు ఖర్చు చేస్తున్నదన్నారు. ఎస్టీ రిజర్వేషన్ కోటాను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచినట్టు తెలిపారు. ప్రజలకు జిల్లా స్థాయిలోనే నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్టు వెల్లడించారు. వరంగల్ హెల్త్ సిటీని ఈ సంవత్సరం ప్రారంభించనున్నామని, 1,100 కోట్లతో 2 వేల పడకలతో వరంగల్ హెల్త్‌సిటీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. టీడయాగ్నొస్టిక్ ద్వారా ప్రస్తుతం 57 రకాల పరీక్షలు చేస్తున్నామని, మరో నెల రోజుల్లో పరీక్షల సంఖ్యను 134కు పెంచనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే దాకా అంతా టైమ్ ప్రకారం జరగాల్సిందే. వాచీలోనో, ఫోన్‌లోనో టైమ్ చూసుకుంటూ జీవితాన్ని పరుగెత్తించాల్సిందే. మనం అనుకున్నదేదైనా జరగకుంటే 'టైం' బాగోలేదని వాపోవడమే. ఇది సరేగానీ.. భూమిపై ఒక్కో దేశానికి ఒక్కో టైమ్ జోన్ ఉంటుంది. ఇండియాకు పగలు అయితే.. అమెరికాకు రాత్రి అవుతుంది. మరి అంతరిక్షంలో ఏ టైమ్, తేదీ పాటించాలి? చంద్రుడిపై సమయం, తేదీలను లెక్కించేదెలా? ఇలాంటి సందేహాలు ఎప్పుడైనా వచ్చాయా.. వీటికి సమాధానాలేమిటో తెలుసుకుందామా.. - సాక్షి, సెంట్రల్ డెస్క్

భూమి మీద సరే.. చంద్రుడిపై టైమెంత?

అప్పట్లో చుక్కలను చూస్తూ..

మానవ నాగరికత అభివృద్ధి మొదలైన తొలి నాళ్లలో అంతరిక్షంలోని నక్షత్రాలు, సూర్య, చంద్రుల స్థితి ఆధారంగా సమయాన్ని లెక్కించేవారు. తర్వాతి కాలంలో గడియారాలతో సమయాన్ని లెక్కించడం మొదలైంది. పగలు, రాత్రి సమయాల్లో తేడాకు అనుగుణంగా.. భూమిని వివిధ టైమ్ జోన్లుగా విభజించి, ఆయా ప్రాంతాల్లో వేర్వేరు సమయాలను వినియోగిస్తున్నారు.

- మనుషులు భూమికే పరిమితమైనంత కాలం ఇది బాగానే ఉంది. కానీ అంతరిక్ష ప్రయోగాలు, స్పేస్‌లోకి మనుషులు వెళ్లిరావడం, భవిష్య త్తులో చంద్రుడు, అంగారకుడిపైకి వెళ్లేందుకు ప్రయోగాలు వంటి వాటితో.. ఏ 'టైమ్'ను అనుసరించాలనే తిప్పలు మొదలయ్యాయి.

ఇప్పుడు స్పేస్‌లో వాడుతున్నది ఏ 'టైమ్'?



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ ఎస్) భూమి చుట్టూ రోజుకు 16 సార్లు తిరుగుతుంది. ఈ సమయంలో పదహారు సార్లు సూర్యోదయం, సూర్యాస్తమయం అవుతాయి. ఒక్కో సమయంలో ఒక్కో దేశంపై ఉంటుంది. మరి టైమ్ ఎలా!?.. దీని కోసం 'యూనివర్సల్ టైమ్ (యూటీ)'ను పాటిస్తున్నారు.

- భూమ్మీద టైమ్ జోన్లను ఏర్పాటు చేసుకున్నప్పుడు బ్రిటన్‌లోని గ్రీన్‌విచ్ ప్రాంతాన్ని మూలంగా తీసుకున్నారు. అక్కడ మొదలయ్యే మొదటి టైమ్ జోన్‌ను 'గ్రీన్‌విచ్ మీన్ టైమ్ (జీఎంటీ)'గా వ్యవహరిస్తారు. ప్రస్తుతానికి దీనినే 'యూనివర్సల్ టైమ్'గా పాటిస్తున్నారు.
- అయితే ఈ 'యూటీ' కేవలం భూమి చుట్టూ ఉన్న స్పేస్ వరకే.. చంద్రుడిపై, అంగారకుడిపై టైమ్‌ను లెక్కించేందుకు ప్రపంచ దేశాల మధ్య ప్రస్తుతం ఎలాంటి ఒప్పందాలూ లేవు.

స్పేస్ ప్రయోగాలకు.. 'ఎంఈటీ'..



అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి వాటిని లాంచ్ చేసిన క్షణం నుంచి.. ఎంతెంత సమయం గడిచిన కొద్దీ ఏమేం జరిగిందనేది కీలకమైన అంశం. ఈ క్రమంలోనే స్పేస్ ప్రయోగాల్లో ప్రత్యేకంగా 'మిషన్ ఎలాప్స్‌డ్ టైమ్ (ఎంఈటీ)'ని వాడుతారు. అంటే ఒక రాకెట్ లాంచ్ అయినప్పటి నుంచీ టైమ్ లెక్కించడం మొదలుపెడతారు. దీనినే 'టీ ప్లస్ టైమ్'గా చూపిస్తారు.

- ఉదాహరణకు ఒక చంద్రుడి వద్దకు కృత్రిమ ఉపగ్రహాన్ని పంపి, 2రోజుల 5 గంటల పది నిమిషాలు అయితే.. ఆ శాటిలైట్‌కు సంబంధించిన టైమ్‌ను 'టీ+ 2డేస్ 5 హవర్స్ 10 మినట్స్'గా లెక్కిస్తారు.
- ఈ విధానాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చంద్రుడిపైకి మానవ సహిత ప్రయోగాలు చేపట్టినప్పటి నుంచీ వాడుతున్నారు. అప్పట్లో దీనిని 'గ్రౌండ్ ఎలాప్స్‌డ్ టైమ్ (జీఈటీ)'గా పిలిచారు. తర్వాత ఎంఈటీగా మార్చారు.

చంద్రుడిపై ఇలా లెక్కిస్తే సరి అంటూ..



స్పేస్ ప్రయోగాల వరకు సరేగానీ.. చంద్రుడిపై నివాసం ఏర్పర్చుకున్నాక అక్కడ 'టైమ్' ఎలాగనే సందేహాలు మొదలయ్యాయి. భూమ్మీదిలా పగలు, రాత్రి కలిపి ఒక రోజుగా లెక్కిద్దామంటే కష్టం.

- సాధారణంగా సూర్యోదయం నుంచి అస్తమయం వరకు పగలు.. అప్పటి నుంచి మళ్లీ సూర్యోదయం వరకు రాత్రి. ఈ లెక్కన చంద్రుడిపై సుమారు 15 రోజులు పగలు, మరో 15 రోజులు రాత్రి ఉంటాయి (భూమ్మీది సమయం ప్రకారం). అంటే చంద్రుడిపై ఒక రోజు (మూన్ డే) అంటే.. మనకు నెల రోజులు అన్నమాట.
- ఈ సమస్యను అధిగమించడానికి, భూమ్మీది సమయానికి సులువుగా అనుసంధానం చేయగలగడానికి ఒక ప్రతిపాదన ఉంది. చంద్రుడిపై సెకన్లు, నిమిషాలు, గంటలను యథాతథంగా లెక్కిస్తూనే.. రోజు (24 గంటల సమయం)ను మాత్రం ఒక సైకిల్‌గా పిలవాలని, 30 సైకిల్స్ కలిస్తే ఒక పూర్తి మూన్‌డేగా పరిగణించాలని ఆలోచన. అంటే మనకు ఒక నెల ఒక మూన్‌డే.. మనకు ఒక రోజు ఒక మూన్ సైకిల్‌గా లెక్కించొచ్చు. దీన్ని ఇంకా అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది.

33 రోజుల్లో.. 1,000 మొబైల్‌ఫోన్లు!

యజమానులకు తిరిగి అందజేసిన పోలీసులు
- సీఈఐఆర్ పోర్టల్‌తో చోరీ మొబైళ్ల గుర్తింపు
- రాష్ట్రవ్యాప్తంగా సీఈఐఆర్ అమలు



సాక్షి, హైదరాబాద్: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టేందుకు అమల్లోకి తెచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టార్) పోర్టల్ విధానం సత్ఫలితాలిస్తోంది. గత నెల ఏప్రిల్ 13వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 780 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నూతన పోర్టల్ విధానాన్ని డీజీపీ అంజనీకుమార్ ప్రారంభించారు. 60 మంది ట్రైనర్లకు తొలుత ఈ పోర్టల్ వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో ఏప్రిల్ 20 నుంచి ఈ సీఈఐఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ఈ పోర్టల్ విధానంతో సోమవారం వరకు అంటే 33 రోజుల్లో వెయ్యి మొబైల్ ఫోన్ల జాడను గుర్తించడంతోపాటు వాటిని తిరిగి ఫోన్ల యజమానులకు అందించారు. వీటిలో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో 149, వరంగల్ కమిషనరేట్ పరిధిలో 91, కామారెడ్డి జిల్లా పరిధిలో 79 మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టినట్టు సీఈఐఆర్ నోడల్ అధికారి, సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మొత్తం 16,011 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ విధానంలో బ్లాక్ చేసినట్టు చెప్పారు. రాష్ట్ర పౌరులెవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్టయితే దగ్గరలోని మీసేవా లేదా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సీఈఐఆర్ విధానంలో ఫిర్యాదు చేయవచ్చని మహేశ్ భగవత్ సూచించారు.

దేశంలో నంబర్‌వన్ బిజినెస్ స్కూల్ 'ఐఎస్‌బీ'

- ప్రపంచంలో 29వ స్థానంలో ఐఎస్‌బీ
- ప్రకటించిన ఫైనాన్షియల్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్ ర్యాంకింగ్–2023



రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) దేశంలోనే నంబర్ వన్ బిజినెస్ స్కూల్‌గా మరోసారి గుర్తింపు పొందింది. అదేవిధంగా ప్రపంచంలో 29వ స్థానాన్ని సొంతం చేసుకుంది. ఫైనాన్షియల్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కస్టమ్ ర్యాంకింగ్–2023ని సోమవారం ప్రకటించారు. గతేడాది ప్రపంచస్థాయిలో 38వ స్థానంలో ఉన్న ఐఎస్‌బీ ఈసారి 29వ స్థానంలో నిలవడం విశేషం. ఈ ర్యాంకులతో ఐఎస్‌బీ అసాధారణమైన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు మరోసారి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినట్లయింది. ఇక భవిష్యత్‌లో అనుకూలించే ప్రోగ్రామ్‌ల విభాగంలో ప్రపంచంలోనే నెంబర్ వన్ ర్యాంకు పొందిన ఐఎస్‌బీ.. ఎఫ్‌టీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ఓపెన్ ర్యాంకింగ్ 2023లో దేశంలో మూడవ స్థానం, ప్రపంచంలో 65వ స్థానంలో నిలిచింది. కాగా గ్రోత్ పారామీటర్‌లో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండడం విశేషం. ఈ సందర్భంగా ఐఎస్‌బీ డిప్యూటీ డీన్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్ ప్రొఫెసర్ దీపామణి మాట్లాడుతూ ఎఫ్‌టీ ర్యాంకింగ్‌లో ఉన్నతస్థానంతో పాటు భవిష్యత్తు ఉపయోగం పారామీటర్‌లో నంబర్ వన్ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుత ర్యాంకింగ్ తాము మరింతగా కష్టించి పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. సమిష్టి కృషికి ఇది నిదర్శనమన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.